




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY | నవతరం తెలుగు దినపత్రిక








Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 03 సోమవారం | మార్చి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 167

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur


# రంగంలోకి రోబోలు

- టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరం
- పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదు
- సంస్థ విద్యుత్ బిల్లులు సైతం చెల్లించకుండా నిర్లక్ష్యం
- గత పదేళ్లుగా ఎక్కడివి అక్కడే నిలిచిన టన్నెల్ పనులు
- ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం సరికాదు
- బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: సీఎం రేవంత్‌రెడ్డి

2



**నాగర్‌కర్నూలు-నవభూమిబ్యూరో**

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం సొరంగంలో 8 మంది సిబ్బంది గల్లంతైన నేపథ్యంలో సహాయక చర్యలను పరిశీలించేందుకు మంత్రులతో కలిసి సీఎం రేవంత్ టన్నెల్ లోనికి వెళ్లారు. ఆ తర్వాత ఎస్ఎల్‌బీసీ వద్ద అన్ని విభాగాల అధికారులు, ఏజెన్సీలు, రెస్క్యూ టీంలతో సహాయక చర్యలపై సమీక్షించారు. అనంతరం సీఎం రేవంత్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 2005-06లో ప్రారంభించారని తెలిపారు. 2014 తెలంగాణ ఏర్పడేనాటికి 32 కిలోమీటర్ల టన్నెల్

# 'ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు నేడే



- ఒక ఉపాధ్యాయ, 2 గ్రాడ్యుయేట్ స్థానాలకు గత నెల 27న పోలింగ్
- నేటి ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం
- మొదటి ప్రాధాన్య ఓటుతో నెగ్గకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ
- తదుపరి ప్రాధాన్య ఓటు మేరకు విజేతను ప్రకటించనున్న అధికారులు
- ప్రక్రియ పూర్తికి సుదీర్ఘ సమయం.. షిఫ్టుల వారీగా లెక్కింపు సిబ్బంది సిద్ధం

2

**అమరావతి-నవభూమిబ్యూరో:** రాష్ట్రంలో 2 గ్రాడ్యుయేట్, ఒక ఉపాధ్యాయ శాసన మండలి స్థానాలకు గత నెల 27న జరిగిన పోలింగ్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరిగాయి. రెండు పట్టభద్రుల స్థానాల్లో టీడీపీ నాయకులతోపాటు పదుల సంఖ్యలో అభ్యర్థులు పోటీ చేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయస్థానంలో ఏపీటీఎఫ్ అభ్యర్థి రఘువర్మకు కూటమి మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మూడు స్థానాల్లోనూ ఎన్నికల పోరు సాధారణ ఎన్నికలను తలపించింది. సోమవారం జరగనున్న ఎన్నికల కౌంటింగ్‌కు ఆయా జిల్లాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే, ఈ లెక్కింపు ప్రక్రియ రోజురోజంతా జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ఓట్ల లెక్కింపు క్లిష్టం**

పట్టభద్రుల ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలు మాత్రమే వినియోగించారు. నిబంధనల ప్రకారం పోలైన ఓట్లలో చెల్లనివి పక్కన పెడతారు. మిగిలిన ఓట్లలో 50 శాతం పైబడి మొదటి ప్రాధాన్య ఓటు ఏ అభ్యర్థికి లభిస్తుందో.. వారినే విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ మొదటి ప్రాధాన్య ఓటు మార్కును చేరుకోకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ ప్రారంభిస్తారు. రెండో ప్రాధాన్య ఓటుని లెక్కిస్తారు. అప్పుడు కూడా సగం కంటే తక్కువగా ఉంటే తర్వాతి ప్రాధాన్య ఓటును పరిగణనలోకి తీసుకుంటారు.

# త్వరలో భద్రాద్రికి ఎయిర్‌పోర్ట్



- తెలంగాణాకు శుభవార్త చెప్పిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- భద్రాద్రి కొత్తగూడెంలో మరో విమానాశ్రయాన్ని అభివృద్ధికి కేంద్రం సిద్ధం
- తెలంగాణా అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది
- ఉపాధి, పర్యాటకం, విద్య, తయారీ వంటి వివిధ రంగాల సమగ్ర అభివృద్ధికి కృషి
- తెలంగాణలో ఏరోస్పేస్ తయారీ హబ్‌ను అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు

**హైదరాబాద్-నవభూమిబ్యూరో**

తెలంగాణా రాష్ట్రానికి కేంద్ర మంత్రి మరో శుభవార్త చెప్పారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో కలిసి మంత్రి రామ్మోహన్ నాయుడు హైదరాబాద్ కవాడీగూడాలో మీడియాతో మాట్లాడారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌ను మరింత అభివృద్ధి చేయడానికి వీలైనంత త్వరగా భూమిని అప్పగించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. భద్రాద్రి కొత్తగూడెంలో విమానాశ్రయంపై కేంద్రమంత్రి కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చూపించిన భూమి ఉపయుక్తంగా ఉంటుందని భావిస్తే, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెంలో మరో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని అన్నారు. సాధ్యమైన చోట విమానాశ్రయాలను అభివృద్ధి చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని అన్నారు. సాధ్యాసాధ్యాల అధ్యయనం తర్వాత,ఐఎంఏ అధ్యయన బృందం నుండి కొంత డేటాను తీసుకుని, సాధ్యాసాధ్యాలను నిర్ణయిస్తారన్నారు. తెలంగాణా అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉంది ఉపాధి, పర్యాటకం, విద్య తయారీ వంటి వివిధ రంగాల సమగ్ర అభివృద్ధికి విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం కీలకమని ఆయన అన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన అన్నారు. తెలంగాణలో ఏరోస్పేస్ తయారీ హబ్‌ను అభివృద్ధి చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. మామునూరు ఎయిర్ పోర్ట్‌కు అనుమతులు ఇవ్వటం నా అదృష్టం మామునూరు విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడానికి అనుమతులు ఇవ్వడం తన అదృష్టమని, విమానాశ్రయాల అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా మాస్టర్ ప్లాన్‌తో సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. . అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి విమానాశ్రయం ముఖ్యమైన అంశాలలో ఒకటి అని ఆయన అన్నారు. తెలంగాణకు చాలా కాలంగా ఒకే విమానాశ్రయం ఉందని ఆయన అన్నారు.

# త్వరలో నామినేటెడ్ పదవులు

- పదవుల భర్తీపై సీఎం చంద్రబాబునాయుడు స్పష్టీకరణ
- మార్చి నెలాఖరుకల్లా నామినేటెడ్ పదవులు భర్తీ
- సాధికార కమిటీ సభ్యులకే నామినేటెడ్ పదవులు
- పార్టీ పదవులు మహానాడులోపు పూర్తి చేస్తాం
- మార్కెట్ యార్డులు, దేవస్థానాలకు పేర్లు ఇవ్వాలని సూచన



**అమరావతి-నవభూమిబ్యూరో:** ఏపీ అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన టీడీఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు పార్టీ నేతలకు కీలక సూచనలు చేశారు. మనం ఏదైనా పొరపాటుగా మాట్లాడితే విపక్షం దాన్ని అవకాశంగా తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యేలకు, ప్రజలకు, కేడర్‌కు మధ్య సమ న్వయం పెరగాలని సూచించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ అంజనేయులు, బుచ్చయ్య చౌదరిలు నియోజకవర్గ నిధులు ఇవ్వాలని కోరారు. దీనికి స్పందించిన చంద్రబాబు.. ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఎప్పుడు నిర్ణయం తీసుకోవాలో తాను చూస్తానని చెప్పారు. కేంద్ర బడ్జెట్ తరహాలోనే రాష్ట్ర బడ్జెట్‌పై కూడా విస్తృతమైన చర్చ జరుగాలన్నారు. వేసవిలో అనారోగ్య కేసులుపై మంత్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీనియర్లకు తన మైండ్ సెట్ ఎలా ఉంటుందో తెలుసు కానీ కొత్తవాళ్లు కూడా తెలుసుకోవాలన్నారు చంద్రబాబు. అందరూ కలిసి ప్రయాణం చేయాలని స్పష్టం చేశారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో కూడా

# మోడీ మంచోడే

- కానీ..రాష్ట్రాభివృద్ధికి అడ్డు కిషన్ రెడ్డే
- మామూనూరు ఎయిర్‌పోర్టు ప్రధానే ఇచ్చారు..
- తానే తెచ్చినట్లు కిషన్‌రెడ్డి చెప్పుకుంటున్నారు..
- మెట్రో రాలేదు.. మూసీ ప్రక్షాళనకు నిధులు రాలేదు..
- పాలమూరు రైతుబిడ్డ సీఎం అయితే ఓర్వలేని బీఆర్ఎస్

2

**వనపర్తి-నవభూమిబ్యూరో**

బీఆర్ఎస్, బీజేపీపై విమర్శలు చేస్తూ మరోసారి కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. వనపర్తి కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన-ప్రగతి బాట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. వనపర్తి తనకు చదువుతోపాటు సంస్కారం నేర్పిందన్నారు. వనపర్తి విద్యార్థిగా తెలంగాణకు వన్నెతెచ్చాడనే కీర్తి తీసుకొస్తానని ఆయన హామీ ఇచ్చారు. గతంలో వనపర్తి రాజకీయాల్లో కక్షలు, ధన ప్రభావం ఉండేది కాదని.. ఐదేళ్ల క్రితం ఇక్కడ్నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే రాజకీయాలు కలుషితం చేశారని రేవంత్ విమర్శించారు. పదేళ్ల తెలంగాణకు ముఖ్యమంత్రి

# అద్దె ఇంటితో అనుబంధం

- చదువుకునే రోజుల్లో 12 ఏళ్లు అద్దె ఇంట్లో గడిపిన రేవంత్
- వనపర్తి పర్యటనలో భాగంగా అద్దె ఇంట్లోకి వెళ్లిన సీఎం
- పాత ఇంటిని చూసి భావోద్వేగానికి గురైన రేవంత్
- యజమాని తబ్బిఉబ్బియి,సీఎంకు హారతితో స్వాగతం

2



**వనపర్తి-నవభూమిబ్యూరో**

తొలి విడత కుట్టు మిషన్ల పంపిణీకి నేడు శ్రీకారం చుట్టారు రేవంత్ రెడ్డి. దీనికోసం వనపర్తిని ఎంచుకున్నారు. ఈ టౌన్‌తో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. 12 సంవత్సరాల పాటు ఇక్కడే ఉన్నారాయన. ఇక్కడే చదువుకున్నారు. ఆ సమయంలో ఓ అద్దె ఇంట్లో గడిపారు. తన పర్యటన సందర్భంగా ఆ అద్దె ఇంటిని సందర్శించారు రేవంత్ రెడ్డి. స్వయానా ముఖ్యమంత్రి తమ ఇంటికి వస్తోన్నారనే విషయం తెలిసి ప్రస్తుతం అందులో నివసిస్తోన్న కుటుంబం ఉబ్బితబ్బిబ్బయింది. హారతి ఇచ్చి రేవంత్ రెడ్డికి స్వాగతం పలికారు ఆ కుటుంబ సభ్యులు. తాను

# లారీలు ఆపి అర్ధరాత్రి అఘోరీ హల్చల్

- నెల్లూరు జిల్లాలోని జాతీయ రహదారిపై లారీ డ్రైవర్లపై విరుచుకుపడిన అఘోరి
- చిల్లకూరు టోల్ ప్లాజా వద్ద ఎద్దుల లోడ్‌తో వెళుతున్న 3 లారీలను అడ్డగింపు
- ఆయుధం పట్టుకొని వాహనాలుఆపి అఘోరీ రచ్చరచ్చ

2



**నెల్లూరు-నవభూమిబ్యూరో**

సికింద్రాబాద్లో ముత్యాలమ్మ ఆలయం పైన దుండగులు దాడి అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఒక మహిళ అఘోరి హల్చల్ చేసిన విషయం తెలిసిందే. ఇక తెలుగు రాష్ట్రాలలో ఉన్న ప్రధాన ఆలయాలన్నీ తిరుగుతూ వెళ్లిన ప్రతి చోట ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తూనే వచ్చింది. శ్రీకాళహస్తిలో బట్టలు లేకుండా దర్శనానికి వెళ్తానని సిబ్బందితో గొడవకు దిగింది. ఎక్కడికి వెళ్ళినా అఘోరీ హల్చల్ తనను దర్శనానికి వెళ్ళనివ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ పెట్రోల్ డబ్బా పట్టుకుని

# సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ సస్పెన్షన్

- అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లారన్న ఆరోపణలు
- సిసోడియా నేతృత్వంలో సర్కారు విచారణ
- ఆర్ఆర్ఆర్‌ను వేధించిన ఘటనలోనూ సునీల్ పాత్ర

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్ సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారని తేలడంతో సునీల్ కుమార్ ను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో సీఐడీ చీఫ్ గా వ్యవహరించిన సమయంలో ఆయన ముందస్తు అనుమతి లేకుండా విదేశీ పర్యటనలు చేశారని ఆరోపణలు వచ్చాయి. జార్జియాకు వెళ్లినపుడు మాత్రమే పర్మిషన్ తీసుకున్నారని, స్వీడన్ యూకే, యూఏఈ సహా పలు దేశాల పర్యటనకు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి పొందలేదని సమాచారం. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సిసోడియా నేతృత్వంలోని కమిటీతో విచారణ జరిపించింది. విచారణలో కోడ్ ఆఫ్ కండక్ట్ కు విరుద్ధంగా ప్రవర్తించారని కమిటీ తేల్చింది. దీంతో ఐపీఎస్ ఆఫీసర్ సునీల్ కుమార్ ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. విదేశీ పర్యటనలతో పాటు సునీల్ కుమార్ పై పలు

# అనుచరుడి పాడె మోస్తూ మంత్రి కన్నీళ్లు

- తుమ్మల ప్రధాన అనుచరుడు,మాజీ జడ్పీటీసీ గాదె సత్యం కన్నుమూత
- సత్తుపల్లిలో సత్యం అంత్యక్రియలు..మంత్రి తుమ్మల రాక
- తన అనుచరుడికి కడసారి వీడ్కోలు పలుకుతూ కన్నీటి పర్యంతం
- అంత్యక్రియల్లో పాల్గొని వైకుంఠధామం వరకూ పాడె మోసిన మంత్రి
- మంత్రి పాడె మోస్తూ కన్నీరు పెట్టుకున్న దృశ్యం వీడియో వైరల్




**సత్తుపల్లి-నవభూమిప్రతినిధి**

తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రధాన అనుచరుడు, మాజీ జడ్పీటీసీ గాదె సత్యం అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం నాడు ఆయన మృతి చెందగా శనివారం నాడు అంత్యక్రియలు నిర్వహించారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో సత్యం కుటుంబసభ్యులు అంత్యక్రియలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఆయన మృతదేహానికి నివాళులర్పించేందుకు మంత్రి తుమ్మల వచ్చారు. అనుచరుడికి కడసారి వీడ్కోలు పలుకుతూ కన్నీటి పర్యంతమయ్యారు. ఆ తర్వాత అంత్యక్రియల్లో సైతం పాల్గొని వైకుంఠధామం వరకు పాడె మోశారు. మంత్రితో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపి.. వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అయితే ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# మహిళలకు సీఎం చంద్రబాబు శుభవార్త

- రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో 8 నుంచి మహిళలకు ఉపాధి కల్పించేలా కుట్టు శిక్షణ కేంద్రాలు
- టైలరింగ్‌లో నిష్ణాతుల ఆధ్వర్యంలో 90 రోజులపాటు మహిళలకు శిక్షణ
- బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గానికి చెందిన 1,02,832 మంది మహిళలకు కుట్టుమిషన్లు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలకు సీఎం చంద్రబాబు శుభవార్త చెప్పారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చెప్పే ప్రయత్నం చేసింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఆర్థిక భరోసా కలిగించేలా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఈనెల 8వ తేదీ నుంచి మహిళలకు ఉపాధి కల్పించేలా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించనుంది. టైలరింగ్‌లో మహిళలకు శిక్షణ టైలరింగ్ లో నిష్ణాతుల ఆధ్వర్యంలో 90 రోజులపాటు వారికి శిక్షణ ఇవ్వనుంది. ఇప్పటికే ఏపీలో చంద్రబాబు సర్కార్ మహిళలకు ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను ఇస్తున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా టైలరింగ్ లో కూడా శిక్షణ అందజేసి ఉచితంగా కుట్టు మిషన్లు ఇచ్చి మహిళల జీవనోపాధికి దోహదం చేయనుంది. సమాజాభివృద్ధిలో మహిళలకు కీలకమైన స్థానం ఉందని గుర్తించిన క్రమంలోనే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాలలో బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు సామాజిక వర్గానికి చెందిన 1,02,832 మంది మహిళలకు కుట్టుమిషన్లను అందజేయాలని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం 255 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేయబోతోంది. బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ ద్వారా 46,044 మందికి, ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in







# నమ్మించి కిడ్నీ తీసుకున్నారు.. ఉన్న కిడ్నీ చెడిపోయి చావుబతుకుల్లో బాధితుడు!

**కురవి-నవభూమి:** 'మా నాన్న ధరావత్ చిట్టిబాబుకు మాయ మాటలు చెప్పి అవసరానికి కిడ్నీ తీసుకుని మోసం చేశారు. ప్రస్తుతం ఆయన చావుబతుకుల్లో ఉన్నాడు' అని అతడి కుమార్తె భూక్యా రమాదేవి శనివారం కురవి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం రాజోలు శివారు పొలంపల్లి తండాకు చెందిన ధరావత్ చిట్టిబాబుకు ఇద్దరు కుమారులు నితిన్, రాము, కుమార్తె రమాదేవి ఉన్నారు. భార్య విజయ 3 ఏండ్ల క్రితం మృతిచెందింది. నల్లెల్ల శివారు గాజతండాకు చెందిన ధరావత్ చంద్ర అనే వ్యక్తి సంవత్సరంన్నర క్రితం కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా, గాజతండాకు చెందిన ధరావత్ సురేశ్, బానోత్ నవీన్‌తో కలిసి పొలంపల్లి తండాకు చెందిన ధరావత్ రవి వద్దకు వచ్చారు.నలుగురు కలిసి ధరావత్ చిట్టిబాబు ఇంటికి వెళ్లి కిడ్నీ ఇస్తే రెండు ఎకరాల భూమి, రెండు గుంటల స్థలం ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని, భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా చూసుకుంటామని చెప్పి ఒప్పించారు. కుటుంబసభ్యుల సమక్షంలో అగ్రిమెంటు రాసి, చిట్టిబాబును హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేయించి కిడ్నీ తీయించి, చంద్రకు అమర్చారు.ప్రస్తుతం చిట్టిబాబుకు ఉన్న ఒక్క కిడ్నీ చెడిపోయింది. ఆరోగ్యం బాగాలేదని, నాడు హామీ ఇచ్చిన వారి వద్దకు వెళ్లి అడిగితే తమకేం సంబంధం లేదని, దిక్కున్నచోట చెప్పుకోమన్నారు. తన తండ్రి అనారోగ్యంతో మహబూబాబాద్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడని, మోసం చేసిన చంద్ర, రవి, సురేశ్, నవీన్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని రమాదేవి ఫిర్యాదులో పేర్కొన్నది.



## 2 మీటర్ల లోతులో 4 మృతదేహాలు! బయటకు తీయటం అసాధ్యమేనా..?



**హైదరాబాద్-నవభూమి:** టన్నెల్ ప్రమాద ఘటనలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. గత నెల 22న ప్రమాదం జరగ్గా.. 9 రోజులుగా 8 మంది బాధితుల ఆచూకీ కోసం వెతుకుతూనే ఉన్నారు. టన్నెల్ లోపల ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకోవడానికి రెస్క్యూ సిబ్బందికి దాదాపు 5 రోజులు సమయం పట్టింది. టన్నెల్ బోరింగ్ మిషన్ అడ్డుగా ఉండటం, భారీగా నీటి ఊట, బురదతో సహాయక చర్యల్లో తీవ్ర అంతరాయం నెలకొంది. టీబీఎం మిషన్ భాగాలు ఎక్కడికక్కడ విరిగిపోయాయి. ఇక లోపల చిక్కున్న 8 మంది బ్రతికే అవకాశం లేదని అధికారులు తెలిపారు. మట్టిదిబ్బల కింద ఉన్న వారిని కనిపెట్టేందుకు అధికారులు ప్రత్యేకమైన డిటెక్టర్‌లను ఉపయోగించారు.

టన్నెల్‌లో జీపీఆర్ మార్కింగ్ చేసిన ప్రాంతంలో శనివారం నుంచి తవ్వకాలు వేగంగా కొనసాగుతున్నాయి. అయితే జీపీఆర్ మిషన్ 2 మీటర్ల లోతులో 4 మృతదేహాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆ మృతదేహాలను తీయటం కష్టంగా మారింది. ఎప్పటికప్పుడు భారీగా నీట ఊట వస్తుండటం, మట్టి పేరుకుపోవటంతో వారిని బయటకు తీయటం కష్టంగా మారిందని రెస్క్యూ సిబ్బంది వెల్లడించారు. రెండు రోజులుగా శ్రమిస్తున్నా.. అర మీటర్ మేర మాత్రమే మట్టిని బయటకు తీయగలిగినట్లు తెలిసింది. ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ వేగంగా సాగుతోంది. లోపల చిక్కున్న వారిని బయటకు తీసేందుకు మరికొంత సమయం పట్టే ఛాన్స్ ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతానికి 2 మీటర్ల లోతున ఉన్న నలుగురి మృతేదేహాలను బయటకు తీసే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.ఇవాళ సాయంత్రానికి లేదా రాత్రికి నాలుగు మృతదేహాలను వెలికితీయనున్నట్లు సమాచారం. ఇక మరో నాలుగు మృతదేహాలు 7 మీటర్ల లోతులో కూరుకుపోగా.. వాటిని బయటకు తీయటం అసాధ్యమనే విషయం తెలిసింది. భారీగా మట్టి, నీటి ఊట ఉండటంతో సహాయక చర్యలకు ఆటకం ఏర్పడుతుందని రెస్క్యూ సిబ్బంది వెల్లడించారు. ఇక శ్రీశైలం %ూాదీజ% టన్నెల్ వద్దకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్లనున్నారు. నేడు సాయంత్రం ఘటనా స్థలానికి వెళ్తారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో రేంజ్ ఐజీ సత్యనారాయణ భద్రతను ప్రత్యేకంగా పర్యవేక్షించనున్నారు.

## నాలుగు నిమిషాల్లోనే ఏటీఎంను కొల్లగొట్టారు.. మహేశ్వరంలో ఘటన



**హైదరాబాద్-నవభూమి:** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో దొంగలు రెచ్చిపోయారు. మండలంలోని రావిర్యాలలో ఎస్‌బీఐ ఏటీఎంను పగలగొట్టిన దుండగులు భారీగా నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున కారు లో వచ్చిన దుండగులు.. ఏటీఎం లోని సీసీ కెమెరాలు, సైరన్ ధ్వంసం చేశారు. గ్యాస్ కట్టర్, ఇనుప రాడ్లతో ఏటీఎం మెషిన్‌ను బద్దలు కొట్టారు. డబ్బును తీసుకొని పారిపోయారు. కేవలం నాలుగు నిమిషాల్లోనే పనిపూర్తిచేసి డబ్బు ఎత్తుకెళ్లారు.ఘటనా స్థలానికి చేరుకున్న మహేశ్వరం డీసీపీ సునితా రెడ్డి, ఏసీపీ రాజు ఏటీఎంను పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దొంగలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బృందాలుగా ఏర్పడి దొంగల కోసం గాలిస్తున్నారు. కాగా, రెండు రోజుల క్రితం ఏటీఎంలో రూ.30 లక్షలు పెట్టినట్లు బ్యాంక్ మేనేజర్ వెల్లడించారు.

## ప్రైవేటు బస్సు సడన్ బ్రేక్.. ఒకేసారి ఢీకొన్న నాలుగు వాహనాలు

**నల్లగొండ-నవభూమి:**నల్లగొండ జిల్లా చిట్యాల సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై బస్సు, రెండు కార్లు, కంటైనర్ ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, పలువురు గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున చిట్యాల సమీపంలోని పెద్దకాపర్తి వద్ద ఓ ప్రైవేటు బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో వెనక వస్తున్న కారు.. బస్సును ఢీకొట్టింది. దానివెనుక వెస్తున్న కంటైనర్.. కారును ఢీకొట్టడంతో అది బస్సు కిందికి దూసుకెళ్లింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మరోకారు అదుపుతప్పి డివైడర్‌ను గుద్దింది.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యల చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. బస్సు విజయవాడ నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉన్నది. ప్రమాదం వల్ల హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. రోడ్డుపై అడ్డంగా ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

## పోలీస్ స్టేషన్‌లోనే లారీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

**ఖమ్మం-నవభూమి:** పోలీస్ స్టేషన్ పైనుంచి లారీ డ్రైవర్ దూకిన ఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం వీఎం బంజర్ కాలనీలో చోటు చేసుకుంది. పెనుబల్లిలో పోలీసులు ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలు వాహనాలను ఆపి వారికి టెస్టులు చేశారు. అతిగా మద్యం తాగి పట్టుపడిన వారిని కౌన్సిలింగ్ నిమిత్తం స్టేషన్‌కు తరలిస్తున్నారు.అయితే అదే సమయంలో డ్రైవర్ జీవన్ కుమార్ తన లారీ నడుపుకుంటూ పోలీసులు తనిఖీలు చేసే మార్గానికి వెళ్లాడు. జీవన్ ఫూటుగా మద్యం సేవించి ఉండడాన్ని గమనించిన పోలీసులు అతనికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేశారు. దీంతో అతను పరిమితికి మించి మందు తాగినట్లు గుర్తించారు. ఈ క్రమంలో అతన్ని వీఎం బంజర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే పోలీసులు తనపై దాడి చేసి చిత్రహింసలు పెట్టారని ఆరోపిస్తూ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్టేషన్ భవనం పైకి ఎక్కి అక్కడ్నుంచి ఒక్కసారిగా దూకేశాడు. దీంతో బాధితుడికి తీవ్రగాయాలు అయ్యాయి.

# మీ సేవాలో మరో అప్‌డేట్.. ఆ నంబర్ చెప్పి తీసుకోవచ్చు..




**హైదరాబాద్-నవభూమి:**విద్యార్థుల చదువుకు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించే వివిధ పథకాలకు కొన్ని ధ్రువీకరణ పత్రాలు అవసరం అవుతాయి. వాటిలో చాలా వరకు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తుల చేసుకొని.. ప్రింట్ తీసుకుంటే సరిపోతుంది. దరఖాస్తు చేసిన తర్వాత అవసరం అయితే.. స్థానిక మండల ఆర్ఐతో కూడా సంతకం చేయించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయంలో దళితబంధు, బీసీబంధు వంటి పథకాలకు ఆదాయ ధ్రువీకరణ పత్రం ఎంతో అవసరం పడింది. వాటి ఆధారంగానే అర్హులను గుర్తించి.. పథకాన్ని అమలు చేశారు. అంతే కాదు.. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల్లో కొన్ని పథకాలకు కూడా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అడుగుతున్నారు. అయితే ఒక్కసారి మీ సేవాలో ప్రింట్ తీసుకున్న తర్వాత మరో సారి వాటిని తీసుకోవడం కష్టం. మొదట తీసుకున్న వాటినే జాగ్రత్తగా భద్రపరుచుకోవాల్సి ఉంటుంది. మొదటి సారి తీసుకున్న పత్రాలు పొరపాటున ఎక్కడైనా పోతే అంతే సంగతులు. మళ్లీ కొత్త వాటి కోసం దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకున్న ప్రక్రియ. అంతే కాదు సమయం కూడా వృథా అవుతుంది.వీటితో పాటు.. విద్యార్థులకు కూడా ఈ సమస్య నిత్యం వేధిస్తూ వస్తోంది. ఇక నుంచి ఆ సమస్యలకు చెక్ పెడుతూ.. మీ సేవా ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందిన ఏడాదిలోపు మీకు మరల ఆ పత్రాలు అవసరం అయితే.. మళ్లీ వాటిని మీ సేవా కేంద్రాల్లో తీసుకునే వెసులుబాటు కల్పించారు. వీటి కోసం కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండానే ఈ సౌకర్యాన్ని కల్పించారు. కేవలం ఐదు నిమిషాల్లోనే కొత్త పత్రాలు మీరు తీసుకెళ్లొచ్చు. ఒకసారి పొందిన పత్రాన్ని రుసుం చెల్లించి.. తెలంగాణలోని ఏ జిల్లాలో అయినా.. మీరు మీ సేవా సెంటర్లో ఆ పత్రాలను తీసుకోవచ్చు.

దీని కోసం మీ దగ్గర మొదటి సారి తీసుకున్న రషీదుపై ఉన్న అప్లికేషన్ నంబర్ మీ సేవా వారికి చెబితే సరిపోతుంది. మీ దగ్గర పాత కుల, ఆదాయ పత్రాల జిరాక్స్‌లు ఉన్నా.. వాటిపై నంబర్ చెప్పినా సరిపోతుంది. వారు ఆ నంబర్ ఎంటర్ చేయగానే.. పూర్తి వివరాలతో కంప్యూటర్లో మీ పత్రాలు ప్రత్యక్షం అవుతాయి. ఆ సమయంలో మీ అడ్రస్, మొబైల్ నంబర్, రూ.35 రుసుం చెల్లిస్తే సరిపోతుంది. మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకొని.. కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా అధికారులు ఈ పరిష్కారాన్ని చూపించారు. దీనిపై విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ అవకాశం కొన్ని జిల్లాల్లో అందుబాటులోకి రాగా.. త్వరలో తెలంగాణ వ్యాప్తంగా అమలు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# ఎమ్మెల్సీ ఓట్లు ఎలా లెక్కిస్తారో తెలుసా?.. ప్రాధాన్యతకు అంత ప్రియారిటీ ఏంటీ?.. ఎలిమినేషన్ ఎలా?



**హైదరాబాద్-నవభూమి:**తెలుగు రాష్ట్రాల్లో ఫిబ్రవరి 27వ తేదీన చెరో మూడు చొప్పున మొత్తం ఆరు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. కాగా.. ఈ ఎన్నికలకు మార్చి 3వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ జరగనుంది. అయితే.. ఈ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసే ప్రక్రియే కాదు.. ఆ ఓట్ల లెక్కింపు విధానం కూడా మిగతా వాటికి భిన్నంగా ఉంటుంది. ఓటు వేసేటప్పుడు మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత అంటూ వరుస క్రమంలో ఎంత మందికైనా ఓటు వేసే వెసులుబాటు ఈ ఎమ్మెల్సీ స్థానాలకు ఉండగా.. ఆ ప్రాధాన్యతలే అభ్యర్థులను విజేతలుగా నిలబెట్టనున్నాయి. అసలు ఈ ప్రాధాన్యత ఓటుకు అంత ప్రియారిటీ ఏంటీ? మొదటి ప్రాధాన్యత ఓటుకు.. మిగతా ప్రాధాన్యత ఓట్లకు తేడా ఏంటీ? అసలు ఈ ఓట్లను ఎలా లెక్కిస్తారు..? ఇందులో ఎలిమినేషన్ ప్రక్రియ ఎప్పుడొస్తోంది.. ఎలా ఎలిమినేట్ చేస్తారన్న ముఖ్యమైన విషయాల గురించి సవివరంగా తెలుసుకుందాం..!అయితే.. సాధారణ ఎన్నికల్లో అయితే.. ఈవీఎం మెషీన్లలో బటన్ నొక్కగానే మనం ఎవరికి ఓటు వేశామన్నది అందులో నిక్షిప్తమవుతుంది. అయితే.. ఇక్కడ ప్రాధాన్యతా క్రమంలో ఓట్లు వేస్తాం కాబట్టి.. కౌంటింగ్ ప్రక్రియ కాస్త వేరేగా ఉంటుంది. అయితే.. ఈ ఓటు వేసే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తుంది. ప్రాధాన్యత క్రమంలో ఓట్లు వేసేటప్పుడు నెంబర్లు మాత్రమే వేయాలి. అవి కూడా.. మధ్యలో అంకెలు మిస్సవకుండా వరుస క్రమంలో వచ్చేలా ప్రాధాన్యత ఓట్లు వేయాల్సి ఉంటుంది. 1, 3 వేసి 2 మర్చిపోయినా.. 1,2, 4 వేసి 3 నెంబర్ వేయకపోయినా.. నెంబర్లు వేయకుండా రైట్ మార్కులు పెట్టినా.. ఇలా ఏ చిన్న తప్పు చేసినా.. మీ విలువైన ఓటు చెల్లకుండా పోతుంది.అయితే.. కౌంటింగ్ ప్రక్రియలో ముందుగా.. పోలైన ఓట్లన్నింటిని పరిశీలించి.. చెల్లకుండా పోయిన ఓట్లను పక్కన పెట్టేసి.. కేవలం చెల్లుబాటు అయిన ఓట్లను మాత్రమే లెక్కలోకి తీసుకుంది. అలా.. చెల్లుబాటు అయిన మొత్తం ఓట్ల సంఖ్యలో సగానికంటే ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా.. ఆ అభ్యర్థినే విజేతగా ప్రకటిస్తారు. ఉదాహరణకు.. మొత్తం చెల్లుబాటు అయిన ఓట్లు 1000 అనుకుంటే.. అందులో 501 ఓట్లు వచ్చిన అభ్యర్థే విజేత అన్నమాట.అయితే.. ఈ ఎమ్మెల్సీ ఓట్లను ప్రాధాన్యత క్రమంలో లెక్కిస్తుంటారు. ముందుగా మొదటి ప్రాధాన్యతా ఓట్లన్నింటినీ లెక్కిస్తారు. ఈ మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఏ అభ్యర్థికైనా విజయానికి కావాల్సిన ఓట్ల సంఖ్య వచ్చిందా అని చూస్తారు. ఒకవేళ వస్తే.. అతన్నే విజేతగా ప్రకటిస్తారు. రానిపక్షంలో.. అసలు ప్రక్రియ మొదలవుతుంది. ఇక్కడే ప్రాధాన్యతకు ఉన్న ప్రియారిటీకి పని పడుతుంది.మొదటి ప్రాధాన్యత ఓటుతో ఏ అభ్యర్థి గెలుపు మార్క్ చేరుకోకపోతే.. అప్పుడు ఎలిమినేషన్ ప్రక్రియను ప్రారంభిస్తారు. అభ్యర్థుల్లో ఎవరికో ఒకరికి విజయానికి కావాల్సిన ఓట్ల సంఖ్య వచ్చేవరకు ఈ ఎలిమినేషన్ ప్రక్రియను కొనసాగిస్తుంటారు. ఈ క్రమంలో.. మొదటి ప్రాధాన్యత ఓట్ల సంఖ్యను బట్టి ఆరోహణ క్రమంలో జాబితాను సిద్ధం చేస్తారు. ఈ జాబితాలో అతి తక్కువ ఓట్లు వచ్చిన (అన్ని ప్రాధాన్యత ఓట్లు లెక్కించినా గెలుపు మార్కు చేరుకోలేనంత తక్కువ ఓట్లతో చివరి స్థానాల్లో ఉన్న) అభ్యర్థులను గుర్తించి వరుసగా ఎలిమినేట్ చేస్తారు.ఇక.. ఉప్పుడు లిస్టులో మిగిలిన రెండో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఆ ఓట్లను ఆయా అభ్యర్థులకు జమ చేస్తారు. ఇలా కింద నుంచి పై వరకు ఇదే తరహాలో లెక్కించి.. ఈ ఓట్లను వారికి కలుపుతూ చివరి అభ్యర్థులను ఎలిమినేట్ చేస్తూ వస్తుంటారు. ఒకవేళ రెండో ప్రాధాన్యత ఓట్లలో విజయానికి కావాల్సిన సంఖ్య వస్తే.. ఆ అభ్యర్థినే విజేతగా ప్రకటిస్తారు. ఒకవేళ రెండో ప్రాధాన్యత ఓట్లను కలిపినా గెలుపు మార్కును ఏ అభ్యర్థి చేరుకోకపోతే అప్పుడు మూడో ప్రాధాన్యత ఓట్లను ప్రియారిటీగా చూస్తారు. ఇలా.. జాబితాలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరో ఒకరు గెలుపు మార్కును చేరుకునే వరకు ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. అందుకే.. ప్రాధాన్యత ఓట్లకు అంత ప్రియారిటీ ఉంటుంది.గతంలో జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చాలా సందర్భాల్లో మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఫలితాలు తేలకపోవటంతో.. రెండో ప్రాధాన్యత ఓట్ల ద్వారానే విజేతను ప్రకటించారు. కొన్ని ఎన్నికల్లో అయితే.. మూడు ప్రాధాన్యత ఓట్లు కూడా విజేతను నిర్ణయించటం గమనార్హం.

# 'ఎమ్మెల్సీ' ఓట్ల లెక్కింపు నేడే

**(1వపేజీ తరువాయి)**అభ్యర్థుల గెలుపు, ఓటముల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో పాటు ఇతర ప్రాధాన్యతా ఓట్లు కూడా కీలకమవ్వతాయి. ప్రాధాన్యతా ఓట్లను బట్టి ఫలితం నిర్దేశించాల్సి ఉన్నందున ఈ ప్రక్రియలో జాప్యం తప్పకపోవచ్చని భావించి ఆ మేరకు షిఫ్టుల వారీగా లెక్కింపు సిబ్బందిని సిద్ధం చేశారు. ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంలో టీడీపీ పక్షాన పేరాబత్తుల రాజశేఖరం, పీడీఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవుల మధ్య పోటీ నువ్వా-నేనా అన్నట్లుగా ఉంది. స్వతంత్ర అభ్యర్థులు కూడా బలమైన పోటీ ఇస్తున్నారు. 2,18,902 ఓట్లు పోలయ్యాయి. ఏలూరులోని సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో కౌంటింగ్ కు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి నియోజక వర్గం ఓట్ల లెక్కింపు ప్రక్రియ గుంటూరులోని ఏసీ కళాశాలలో జరగనుంది. 2,41,502 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

**సాయంత్రానికే ఉత్తరాంధ్ర ఫలితం!**

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓట్ల లెక్కింపు ప్రక్రియ విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో జరగనుంది. మొత్తం 22,493 మంది ఓటర్లు ఉండగా 20,794 మంది(92.45 శాతం) ఓటు వేశారు. తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో ఫలితం తేలితే సాయంత్రం 6 గంటల తర్వాత విజేత పేరు ప్రకటిస్తారు.

## లారీలు ఆపి అర్ధరాత్రి అఘోరీ హల్చల్

**(1వపేజీ తరువాయి)**హల్చల్ చేసింది. ఇక అక్కడ ఆలయ సిబ్బంది మహిళా అఘోరీకి నచ్చజెప్పి బట్టలు వేసుకుని దర్శనం చేసుకోవాలని చెప్పడంతో అక్కడ గొడవ సద్దుమణిగింది. ఇక ఆ తర్వాత వేములవాడలో కత్తి తీసుకొని పలువురిని భయపెట్టింది. లారీ డ్రైవర్ల పై విరుచుకుపడిన అఘోరి పోలీసులు రంగ ప్రవేశం చేసి మళ్లీ అఘోరికి నచ్చచెప్పి పంపించారు. ఎక్కడికి వెళ్లినా ఏదో ఒక సెన్సేషన్ క్రియేట్ చేస్తూనే ఉన్న అఘోరి మళ్ళీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హల్చల్ చేసింది. తాజాగా నెల్లూరు జిల్లాలోని జాతీయ రహదారిపై లారీ డ్రైవర్లపై విరుచుకుపడిన అఘోరి చిల్లకూరు మండలంలో టోల్ ప్లాజా వద్ద ఎద్దుల లోడ్ తో వెళుతున్న మూడు లారీలను అడ్డగించింది. ఆయుధం పట్టుకొని అఘోరీ రచ్చ వాహనాలను ఆపి హల్చల్ చేసిన అఘోరి మూడు వాహనాలలో ఎద్దులను తీసుకెళ్తున్న క్రమంలో సరైన పత్రాలు చూపించి వాహనాలు తీసుకువెళ్లాలని వారిపైన మండిపడింది. వారు తాము రైతులమని చెప్పినా వినకుండా రచ్చ చేసింది. కత్తులు, శూలాలతో అఘోరీ హల్చల్ చేసింది. చెన్నై నుండి విజయవాడ వెళ్తూ మార్గమధ్యలో అఘోరి ఒక ఆయుధం పట్టుకొని లారీ డ్రైవర్లపై విరుచుకుపడడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అఘోరికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అఘోరీకి నచ్చజెప్పిన హిజ్రాలు ఎంతకీ అఘోరి చెప్పింది వినకపోవడంతో స్థానిక హిజ్రాలను అఘోరితో మాట్లాడాలని చెప్పారు. దీంతో వారు అఘోరితో మాట్లాడి అక్కడ నుంచి పంపించడంతో అందరూ ఒక్కసారిగా ఊపిరి తీసుకున్నారు. ఏది ఏమైనా అఘోరి ఎక్కడికి వెళ్లినా ఏం చేసినా సెన్సేషన్ క్రియేట్ చేయడం మాత్రం మామూలు అయిపోయింది.

## సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ సస్పెన్షన్

**(1వపేజీ తరువాయి)**ఇతరత్రా ఆరోపణలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ గా వ్యవహరిస్తున్న రఘురామకృష్ణరాజును కస్టడీలో వేధింపులకు గురిచేసిన ఘటనలోనూ సునీల్ కుమార్ పాత్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, గతంలోనూ పీవీ సునీల్ కుమార్ పలు అరాచకాలకు పాల్పడ్డారని, చాలా మందిని నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించేలా దగ్గరుండి అధికారులను ఆదేశించారని ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు.

## మహిళలకు సీఎం చంద్రబాబు

**(1వపేజీ తరువాయి)**చెందిన 45,772 మందికి, కాపు కార్పొరేషన్ ద్వారా 11,016 మందికి కుట్టు మిషన్లను ఇవ్వనుంది. చివరిదశకు లబ్దిదారుల ఎంపిక ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం కూడా చివరి దశకు చేరుకుంది. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేవలం టైలరింగ్ శిక్షణ మాత్రమే కాకుండా ఈవెంట్ మేనేజ్మెంట్ నిర్వహణ యూనిట్ల ఏర్పాటులోనూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారు జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేయడం డెయిరీ, గొర్రెల యూనిట్లను ఏర్పాటు చేయడంలోనూ మహిళా లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

## అద్దె ఇంటితో అనుబంధం

**(1వపేజీ తరువాయి)**నివసించిన పాత ఇంటిని చూసి రేవంత్ భావోద్వేగానికి గురయ్యారు. ఆ సందర్భన బాల్య స్మృతులను పంచుకున్నారు. ఈ ఇల్లు- తన జీవితంలో ఒక అధ్యాయంగా మిగిలిపోయిందని వ్యాఖ్యానించారు రేవంత్. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. సుమారు 20 నిమిషాల పాటు అక్కడే గడిపారు. రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించడానికి ముందు ఈ ఇంట్లోనే అద్దెకు ఉన్నానంటూ చెప్పారు.

## రంగంలోకి రోబోలు!

**(1వపేజీ తరువాయి)**పూర్తయిందన్నారు. అయితే, గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదన్నారు. ఈ పనులు చేస్తున్న సంస్థ విద్యుత్ బిల్లులు చెల్లించలేదని విద్యుత్ సరఫరా కూడా నిలిపివేసిందన్నారు. దీంతో గత పదేళ్లుగా టన్నెల్ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయని సీఎం రేవంత్ తెలిపారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి కృష్ణా జలాలు అందించాలని నిర్ణయించామని.. అందుక కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆగిపోయిన ఈ ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభించామని రేవంత్ చెప్పారు. అయితే, అనుకోకుండా ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామన్నారు. జాతీయ స్థాయిలో నిపుణులైన 11 కేంద్ర సంస్థలు, ప్రైవేటు ఏజెన్సీలు 9 రోజులుగా సహాయక చర్యల్లో పాలుపంచుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గల్లంతైన 8 మంది ఆచూకీ ఇప్పటి వరకూ తెలియరాలదన్నారు. ఈ ఆపరేషన్ కొలిక్కి రావడానికి మరో రెండు మూడు రోజులు సమయం పడుతుందన్నారు. కన్వేయర్ బెల్ట్ పాడవడం వల్ల సిల్టు తొలగించేందుకు ఆటంకమేర్పడిందన్నారు. సోమవారం సాయంత్రానికి కన్వేయర్ బెల్ట్ అందుబాటులోకి వస్తుందని.. దీంతో మట్టి బురదను వేగంగా తొలగించవచ్చని సీఎం రేవంత్ తెలిపారు. సొరంగంలో గల్లంతైన కుటుంబాలకు అన్ని పార్టీలు అండగా ఉండాలన్నారు. ఎలాంటి ప్రాణనష్టం ఉండకూడదనే ఉద్దేశంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనుల్లో మనుషులు, మిషిన్లతోపాటు అవసరమైతే రోబోల సాయం తీసుకునే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ అధికారులను ఆదేశించారు. టన్నెల్ బాధితులను బయటికి తీయడంలో ప్రభుత్వం ఎలాంటి నిర్లక్ష్యం చేయడం లేదని సీఎం రేవంత్ చెప్పారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## మోడీ మంచోడే

**(1వపేజీ తరువాయి)**కేసీఆర్, 12 ఏళ్లు ప్రధానిగా ఉన్న మోడీ రాష్ట్రానికి ఏం చేశారని రేవంత్ ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ. 21 వేల కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు సీఎం రేవంత్. రూ. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని సీఎం చెప్పారు. 65 లక్షల మంది మహిళలు స్వయంసహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. సభ్యుల సంఖ్య కోటికి చేర్చాలని ప్రయత్నిస్తున్నామన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆడబిడ్డలు ఆశీర్వదిస్తే రేవంత్ రెడ్డి మరో 15 ఏళ్లు.. 20 ఏళ్లు సీఎంగా కాంగ్రెస్ అధికారంలో ఉంటే.. తమ బతుకు బస్టాండ్ అవుతుందని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు భయపడుతున్నారన్నారు. పదేళ్లుగా పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు ఎండబెట్టారని బీఆర్ఎస్ నేతలను రేవంత్ ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్ఎల్బీసీ పనులు ఆగిపోవడం వల్లే కుప్పకూలిందని రేవంత్ ఆరోపించారు. పాలమూరు రైతు బిడ్డ సీఎం అయితే ఓర్వలేరా? అని కేటీఆర్, హరీశ్ రావు, కవితపై మండిపడ్డారు. మామునూరు ఎయిర్ పోర్ట్ ప్రధాని మోడీ ఇచ్చారు.. నేనే తెచ్చానని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. మెట్రో రాలేదు.. మూసీ ప్రక్షాళనకు నిధులు రాలేదు.. ఆపింది మోడీనేనా అని రేవంత్ ప్రశ్నించారు.

## త్వరలో నామినేటెడ్ పదవులు

**(1వపేజీ తరువాయి)**అందరు తనను రావద్దని చెప్పారని చివరకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమావేశం ఏర్పాటు చేసి తనను రమ్మన్నారని గుర్తు చేసుకున్నారు చంద్రబాబు. యరపతినేని ఏర్పాటు చేసిన సమావేశంతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో మీటింగ్‌లు పెట్టామని అన్నారు. అప్పుడు ప్రత్యర్థుల కుట్రలను కూడా యరపతినేని సమర్థవంతంగా తిప్పి కొట్టారని చంద్రబాబు అభినందించారు. ఇక, నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా చంద్రబాబు క్లారిటీ ఇచ్చారు. మార్చి నెలాఖరుకల్లా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. సాధికార కమిటీ సభ్యులకే నామినేటెడ్ పదవులని తేల్చిచెప్పారు. మార్కెట్ యార్డులు, దేవస్థానాలకు పేర్లు ఇవ్వాలని సూచించారు. పార్టీ పదవులు మహానాడులోపు పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు బహిరంగంగా మాట్లాడే సమయాల్లో జాగ్రత్తా మాట్లాడాలన్నారు. అనవసరమైన విషయాలు మాట్లాడొద్దని సీఎం చంద్రబాబు ఎమ్మెల్యేలను హెచ్చరించారు.

## ప్రైవేటు నర్సింగ్ కాలేజీల ఇష్టారాజ్యం

**హైదరాబాద్-నవభూమి:** అది ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ఓ నర్సింగ్ కాలేజీ. ఆ కళాశాలలో విద్యార్థులు కేవలం అడ్మిషన్ల సమయంలోనే కనిపిస్తారు. మళ్లీ పరీక్షల నాటికి వచ్చి కాలేజీలో వాలిపోతారు. ఇలా పరీక్ష రాసి.. అలా వెళ్లిపోతారు. ఆ కాలేజీలో ఉన్న విద్యార్థులకు అర్హత లేని వారితోనే చదువులు చెప్పిస్తున్నారు. హైదరాబాద్‌లోని మెహదీపట్నం పరిసర ప్రాంతంలో ఉండే ఓ నర్సింగ్ కాలేజీ తీరు మరీ దారుణం. అక్కడి పరిస్థితులు, వసూలు చేస్తున్న ఫీజులపై నర్సింగ్ విద్యార్థులంతా వెళ్లి గతేడాది డీఎంఈ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాల ప్రాంగణ భవనంలో రెండు కాలేజీలు నడుస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం అక్కడ ఒకటే కాలేజీ ఉండాలి. మరో కాలేజీ ఆర్మూర్‌లో ఉండాలి. వైద్య ఆరోగ్యశాఖ వివరాల్లో రెండు కాలేజీలు వేర్వేరుగా ఉన్నట్లు చిరునామాలున్నాయి. రాష్ట్రంలో ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో విద్య.. మిథ్యగా మారింది. అక్కడ చదివితే కనీసం సూది వేయలేరు. బీపీ చూడలేరు. కట్టు కట్టలేరు. కాలేజీలో అధ్యాపకులుండరు. ఉన్నవాళ్లకు అర్హత ఉండదు. మౌలిక సదుపాయాలుండవు. ఈ కళాశాలలపై పర్యవేక్షణ ఉండదు. మరోవైపు రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ తనిఖీల పేరుతో కాసులు వేటలో మునిగిపోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో వైద్య ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి ఎంఎస్సీ నర్సింగ్ కాలేజీలు 21, నర్సింగ్ కాలేజీలు 87, నర్సింగ్ స్కూళ్లు 161, ఎంపీహెచ్‌డబ్ల్యూ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లు 112 ఉన్నాయి. అన్ని రకాల కాలేజీలు కలిపి మొత్తం 391 ఉన్నాయి. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న కాలేజీలు మినహా మిగిలిన వాటిలో మెజారిటీ కళాశాలల్లో నాణ్యమైన విద్య లేదు. నర్సింగ్ విద్యలో ఎమ్మెస్సీ, బీఎస్సీ, ఆక్సిలరీ నర్స్ మిడ్‌వైఫరీ(ఏఎన్ఎమ్), జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ (జీఎన్ఎమ్) కోర్సులుంటాయి. బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్ల కోర్సు. ఏఎన్ఎమ్ రెండేళ్లు, జీఎన్ఎమ్ మూడేళ్ల కోర్సులు. ఏఎన్ఎమ్ కోర్సులో చేరాలంటే పదో తరగతి పాస్ అవ్వాలి. జీఎన్ఎమ్‌కు ఇంటర్.. బీఎస్సీ నర్సింగ్‌కు నీట్ లేదా ఎంసెట్‌లో అర్హత సాధించాలి. మెజారిటీ నర్సింగ్ కాలేజీల్లో ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) నిబంధనల మేరకు అధ్యాపకులు ఉండటం లేదు. ఐఎన్‌సీ మార్గదర్శకాల మేరకు ఏఎన్ఎమ్, జీఎన్ఎమ్ కాలేజీలకు అనుబంధ ఆస్పత్రులుండాలి. చాలా కాలేజీలకు అనుబంధ ఆస్పత్రులే లేవు. జీఎన్ఎమ్ కోర్సులకు 9-12 మంది ఫ్యాకల్టీ ఉండాలి. వారంతా బీఎస్సీ, ఎమ్మెస్సీ చేసినవారై ఉండాలి. ఇక బీఎస్సీ నర్సింగ్ కోర్సులకైతే ఎమ్మెస్సీ నర్సింగ్ చేసిన వారు అధ్యాపకులుగా ఉండాలి.



## 2023 అక్టోబరు 1 తర్వాత పుడితే పాస్‌పోర్టు జారీకి బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి

**న్యూఢిల్లీ-నవభూమి:** పాస్‌పోర్టు నిబంధనల్లో కేంద్ర ప్రభుత్వం మార్పులు చేసింది. 2023 అక్టోబరు 1న లేదా ఆ తర్వాత జన్మించిన వారికి ఇకపై జనన ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులిచ్చింది. జనన మరణాల ధ్రువీకరణ రిజిస్ట్రార్, మునిసిపల్ కార్పొరేషన్ లేదా 1969 జనన మరణాల చట్టం ప్రకారం సంబంధిత అధికారి ద్వారా జారీ అయిన జనన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించొచ్చని పేర్కొంది. అలాగే 2023 అక్టోబరు 1కి ముందు జన్మించిన వారు జనన తేదీకి రుజువుగా.. డ్రైవింగ్ లైసెన్స్, పాఠశాల ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ) లేదా సంబంధిత అధికారి ద్వారా జారీ అయిన పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది.




## మాదక ద్రవ్యాలపై పంజాబ్ యుద్ధం



**చండీగఢ-నవభూమి:** పంజాబ్‌లో మాదక ద్రవ్యాల నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం యుద్ధాన్నే ప్రకటించింది. మూడు నెలల వ్యవధిలో మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలంటూ సీఎం మాన్ ఇచ్చిన ఆదేశాలు అమలుకు రంగం సిద్ధమయింది. మాదక ద్రవ్యాల సమస్యపై చర్చించేందుకు శనివారం ఒకవైపు మంత్రివర్గ ఉప సంఘం భేటీ కాగా, మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా 12వేల మంది పోలీసులు 750 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. 290 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. 8.14 కిలోల హెరాయిన్, 1.21 కేజీల నల్లమందు, 3.5 కిలోల గంజాయి, ఇతర మత్తుపదార్ధాలతో పాటు 8.02 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

## 15 ఏళ్లు దాటిన వాహనాలకు ఇంధనం బంద్!



**న్యూఢిల్లీ-నవభూమి:** రాజధాని ఢిల్లీలో కాలుష్య నియంత్రణ కోసం కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15 సంవత్సరాలు దాటిన వాహనాలకు బంకుల్లో ఇంధనం పోయొద్దని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం మార్చి 31 తర్వాత అమలులోకి వస్తుందని రాష్ట్ర పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా శనివారం అధికారులతో భేటీ అనంతరం తెలిపారు. "ఢిల్లీలో కాలుష్య కట్టడికి కంకణబద్ధులై ఉన్నాం. 15 సంవత్సరాలు పైబడిన వాహనాలను గుర్తించడానికి పెట్రోల్ బంకుల్లో గాడ్జెట్లు ఏర్పాటు చేస్తాం. గడువు దాటిన వాహనాలను అవి గుర్తిస్తాయి. వాటికి పెట్రోల్, డీజిల్ ఉండదు. ఈ ఆంక్షలకు సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర పెట్రోలియం శాఖకు పంపిస్తాం" అని మంత్రి పేర్కొన్నారు.

## 14 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత కేన్సర్ వ్యాక్సిన్



**న్యూఢిల్లీ-నవభూమి:** మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పెరుగుతున్న కేన్సర్ కేసులు ఆందోళన కలిగిస్తుండటంతో 14 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత కేన్సర్ వ్యాక్సిన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మారుతున్న జీవినవిధానంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కేన్సర్ వ్యాధులు పెరుగుతున్నారని, గతంలో నిర్దిష్టమైన వ్యసనాలు ఉన్నవాళ్లే కేన్సర్ బారిన పడేవారని, ఇప్పుడు పిల్లలతో సహా అన్ని వయస్సుల వారిలోనూ ఈ లక్షణాలు కనిపిస్తున్నాయని మహారాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు. ఇది తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. 14 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత వ్యాక్సిన్ సదుపాయం కల్పించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి అజిత్ పవార్‌ను కోరామని, ఆయన వెంటనే అంగీకరించారని తెలిపారు..

**"బర్డ్‌ఫ్లూ" ముందస్తు జాగ్రత్తలు**

విదర్భలోని కాకుల్లో బర్డ్‌ఫ్లూ కనిపించడంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. అయితే మనుషుల్లో ఎవరికీ బర్డ్‌ఫ్లూ సోకినట్టు నిర్ధారణ కాలేదన్నారు. ఒకరికి లక్షణాలు కనిపించడంతో ఆ రిపోర్ట్‌ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరోలజీకి పంపినట్టు చెప్పారు. ముందస్తు చర్యగా ఆ ప్రాంతంలోని చికిన్ దుకాణాలు తాత్కాలికంగా మూసేశామని చెప్పారు. పుణెలో గులియన్-బారే సిండ్రోమ్ లక్షణాలు కనిపించడంతో అండర్‌కుక్డ్ చికిన్‌కు ప్రజలు దూరంగా ఉండాలని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఇటీవల కోరారు.

## ఆ వాహనాలకు బంకుల్లో ఇంధనం బంద్



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధానిలో కాలుష్య నివారణకు ఢిల్లీ బీజేపీ సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకుంది. 15 ఏళ్లు పైబడిన వాహనాలకు మార్చి 31వ తేదీ తర్వాత బంకుల్లో ఇంధనం పోయడం నిలిపివేయాలని నిర్ణయించింది. కాలుష్య కట్టడి చర్యల్లో భాగంగా అధికారులతో పర్యావరణ శాఖ మంత్రి మంజిందార్ సింగ్ సిర్సా (%మీుఱఅఱఅసవతీ రాఱఅస్త్రష్ట రాఱతీంఱ%) శనివారంనాడు సమీక్షా సమావేశం నిర్వహించారు. వాహన కాలుష్య నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని తమ ప్రభుత్వం నిర్ణయించినట్టు సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ సిర్సా చెప్పారు. పాత వాహనాలపై ఆంక్షలు, తప్పనిసరి యాంటీ స్మోగ్ చర్యలు, దశలవారిగా ఎలక్ట్రిక్ బస్సులు తీసుకురావడంపై సమావేశంలో చర్చించినట్టు తెలిపారు.

## ఎదురెదురుగా ఢీకొన్న రెండు బస్సులు.. 37 మంది దుర్మరణం

**న్యూఢిల్లీ-నవభూమి:** బొలీవియా లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.



రెండు బస్సులు ఢీకొనడం వల్ల 37 మంది ప్రయాణికులు మృతిచెందారు. ఈ ప్రమాదంలో మరో 39 మంది గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు.. బస్సుల్లో చిక్కుకున్న వారిని అతికష్టం మీద బయటకు తీసుకొచ్చారు. వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రపంచ ప్రఖ్యాత ఉప్పు నేలల ప్రాంతమైన సలార్ డి ఉయూనికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఉరూరో ప్రాంతంలో జరుగుతున్న కార్నివాల్ వేడుకల్లో పాల్గొనేందుకు పలువురు ఓ బస్సులో వెళ్తుండగా, ఎదురుగా ప్రయాణికులతో వచ్చిన మరో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్లు కూడా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

# తగ్గేదేలే అంటున్న విజయ్



**చెన్నై - నవభూమి:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎలాగైతే 2019 ఎన్నికల ఫలితాల అనంతరం 2024లో టీడీపీతో కలిసి పోటీ చేసి, సూపర్ విక్టరీ సాధించి ఉపముఖ్యమంత్రి పదవి పొందారో.. అదే విధంగా తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్ కూడా అన్నాడీఎంకేతో పొత్తు కుంటారంటూ ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ప్రముఖ రాజకీయ సలహాదారుడు ప్రశాంత్ కిశోర్ ఈ మేరకు విజయ్ కు సూచించారని.. ఇప్పటికే అన్నాడిఎంకె పళనిస్వామితో కూడా చర్చలు జరిపారనే ప్రచారం రెండు రోజులుగా బలంగా నడిచింది. ఈ సమయంలో తమిళగ వెట్రి కజగం (టీవీకే) స్పెషల్ సలహాదారు ప్రశాంత్ కిశోర్ దీనిపై క్లారిటీ ఇచ్చారు. . ఊహాగానాలకు తెరదించుతూ తమిళగ వెట్రి కజగం పార్టీ ప్రత్యేక రాజకీయ సలహాదారు ప్రశాంత్ కిశోర్... 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ స్వతంత్రగానే పోటీ చేస్తుందని.. తమిళనాడు ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకోదని పేర్కొన్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అన్నాడీఎంకేతో పొత్తుకు అవకాశం ఉందా అని అడిగిన ప్రశ్నకు... ఒంటరిగా పోటీ చేయాలనేది నిబద్ధత అని.. అది మారే అవకాశం తనకు కనిపించడం లేదని.. విజయ్ ఒంటరిగా పోటీ చేస్తే అతనికి చాలా మంచి అవకాశం ఉందని అన్నారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన 118 సీట్లను సాధిస్తాడనే తాను నమ్ముతున్నట్లు నొక్కి చెప్పారు. సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ పై వేటు వాస్తవానికి... విజయ్ 40 లేదా 45 సీట్లతో సరిపెట్టుకోవడానికి పార్టీని ప్రారంభించలేదని టీవీకే ప్రధాన కార్యదర్శి ఆదయ్ అర్జున పేర్కొన్నప్పటికీ.. టీవీకే - అన్నాడీఎంకేల పొత్తుపై ఊహాగానాలు కొనసాగాయి. ఈ నేపథ్యంలోనే జరుగుతున్న ప్రచారాలకు చెక్ పెడుతూ ప్రశాంత్ కిశోర్ ఫుల్ క్లారిటీ ఇచ్చేశారు. దీంతో... ముఖ్యమంత్రి స్టాలిన్, ప్రతిపక్ష నేత పళనిస్వామి వంటి సీనియర్ నాయకులతో పాటు.. ఉదయనిధి స్టాలిన్, బీజేపీ రాష్ట్ర చీఫ్ అన్నామలై వంటి యువనాయకులతోనూ 2026 అసెంబ్లీ ఎన్నికల్లో

## సినీ ట్రిక్కులతో మరిన్ని చిక్కులు.. లాజిక్కు తెలుసుకో పోసాని



**హైదరాబాద్ - నవభూమి:** సినీ నటుడు, వైసీపీ నేత పోసాని క్రిష్ణమురళి కేసులో సినీ ట్విస్టులు రాజకీయంగా ఆసక్తికరంగా మారుతున్నాయి. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం రఘురామ కేసులో ఆయన సినీ డ్రామాలు ఆడుతున్నారని పోలీసులు చెబుతుండటంతో పోసాని మరిన్ని చిక్కులను ఎదుర్కొంటున్నారా? అనే చర్చ మొదలైంది. ప్రస్తుతం 14 రోజుల రిమాండులో ఉన్న పోసానిపై రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 కేసులు ఉన్నాయి. ప్రస్తుత కేసులో ఆయనకు బెయిల్ వచ్చినా మరో కేసులో అరెస్టు చేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. అయితే తనకు అనారోగ్యం ఉందని పోసాని, ఆయన ఆరోగ్యం బాగుందని పోలీసులు భిన్నవాదనలు వినిపిస్తుండటమే ఆసక్తి రేపుతోంది. క్లారిటీ ఇచ్చిన ప్రశాంత్ కిశోర్! సినీ నటుడు పోసాని క్రిష్ణమురళిని ఎట్టిపరిస్థితుల్లో క్షమించే పరిస్థితి కనిపించడం లేదని తాజా అప్డేట్స్ ధ్రువీకరిస్తున్నాయి. ఆయనపై ప్రభుత్వ వర్గాల్లో ఏ మాత్రం కనికరం ఉన్నా, శనివారం ఆయనను ఆస్పత్రిలో ఉంచేవారని, ఆయన చెప్పే కారణాలను అంగీకరించేవారని అంటున్నారు. గతంలో ప్రభుత్వ పెద్దలపై పోసాని చేసిన వ్యాఖ్యల కారణంగా ఆయనను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దనే ఒత్తడి ప్రభుత్వంపై వస్తోందని చెబుతున్నారు. అటు సినీ రంగం నుంచి కూడా పోసానికి మద్దతుగా ఎవరూ మాట్లాడకపోవడంతో ఆయనకు మరిన్ని కష్టాలు ఎక్కువయ్యాయని అంటున్నారు. వైసీపీ నుంచి ఆయనకు అన్నిరకాల న్యాయ సహాయం అందుతున్నా, ప్రభుత్వం, పోలీసుల బలమైన వాదనలతో అవన్నీ వీగిపోతున్నట్లు ప్రస్తుత పరిస్థితుల బట్టి అర్థమవుతోందని అంటున్నారు. అందుకే ఆయన తనకు తెలిసినా సినిమా ట్రిక్స్ ను వాడుకోవాలని డిసైడ్ అయ్యారా? అనే చర్చ జరుగుతోంది. దీనివల్ల ఆయనకు మంచి జరగకపోగా, మరిన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయని న్యాయవర్గాలు చెబుతున్నాయి. అనారోగ్యం లేకపోయినా కుంటి సాకులతో ఆస్పత్రికి వెళితే.. భవిష్యత్తులో బెయిల్ విచారణ సందర్భంగా పోలీసులు ఆ విషయాన్ని ప్రస్తావించి బెయిల్ ప్రయత్నాలకు గండి కొట్టే అవకాశాలు ఉన్నాయని ప్రచారం జరుగుతోంది. సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్ పై వేటు ప్రస్తుతం రాజంపేట జైలులో ఉన్న పోసాని తొలి నుంచి గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఆయనకు సంబంధిత మందులు ఇస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. అయితే శనివారం తనకు కడపునొప్పిగా ఉందని, అనంతరం గుండెనొప్పి అంటూ చెప్పిన పోసాని మాటలను డాక్టర్లు ధ్రువీకరించలేదు. ఆయనకు అంతా బాగుందని సర్టిఫికెట్ ఇవ్వడంతో పోసాని మళ్లీ జైలుకు వెళ్లాల్సివచ్చింది. తన సినిమా ట్రిక్కు పనిచేయకపోవడంతో ఇప్పుడు పోసాని ఏం చేస్తారనేది ఆసక్తి రేపుతోంది.

## ఆన్‌లైన్ వంటను.. లైవ్‌లో రుచి చూడొచ్చు!



**న్యూఢిల్లీ-నవభూమి:** నోరూరించే వంటకాలను టీవీ షోలలో తయారు చేస్తూ ఉంటే, వాటిని చూడటంతో సరిపెట్టుకునే కాలానికి ఇక తెర పడనుంది. టీవీ తెరలపై కనిపించే ఈ వంటకాల రుచిని ప్రేక్షకులు ఆస్వాదించే రోజులు వస్తున్నాయి. ఓహియో స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తయారు చేసిన పరికరం ఈ అనుభూతిని పంచుతుంది. ఈ పరికరంలోని సెన్సర్స్ ఆహారం రుచిని ఎలక్ట్రికల్ సిగ్నల్స్ ద్వారా అంది పుచ్చుకొని రిమోట్ పరికరానికి అందిస్తుంది. ఆ రిమోట్ ఈ సమాచారాన్ని ఉపయోగించుకుని, ఆ ఆహారం రుచులను రసాయనాల రూపంలో వెల్లడిస్తుంది. టీవీ ముందు కూర్చున్న వ్యక్తి కింది పళ్లపై ఓ పరికరాన్ని ఉంచితే, అది జెల్స్ రూపంలో ఈ రసాయనాలను ఆ వ్యక్తి నోటిలోకి పంపుతుంది. టీవీ తెరపై కనిపించే ఆహార పదార్థాల అసలు రుచుల మాదిరిగానే ఈ రుచులు కూడా ఉంటాయి. తీపి, ఉప్పు, చేదు, కారం, లేదా వీటన్నిటి మిశ్రమం స్పష్టంగా తెలుస్తుంది. ఈ టెక్నాలజీని కేవలం ఆహారాన్ని రుచి చూడటానికి మాత్రమే కాకుండా.. ఆన్‌లైన్ షాపింగ్, రిమోట్ ఎడ్యుకేషన్, వెయిట్ మేనేజ్‌మెంట్, సెన్సరీ టెస్టింగ్ వంటివాటి కోసం కూడా ఉపయోగించవచ్చునని ఈ శాస్త్రవేత్తలు తెలిపారు. మెదడుకు గాయాలైనవారికి కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు.

## రూ.1,83,01,500 కోట్లు.. ఏడాదిలో మనోళ్లు దేనికి ఖర్చు చేశారో తెలుసా?



**న్యూఢిల్లీ-నవభూమి:** ఏడాది వ్యవధిలో వస్తు సేవల కోసం భారతీయులు ఖర్చు చేసిన మొత్తంపై డెలాయిట్ - ఆర్ఏఐలు తాజాగా విడుదల చేసిన అధ్యయన వివరాలు ఆసక్తికరంగానే కాదు.. ఆశ్చర్యానికి గురి చేసేలా ఉన్నాయని చెబుతున్నారు. 2024లో రూ.1,83,01,500 కోట్ల భారీ మొత్తాన్ని దేశ ప్రజలు వస్తు సేవల కోసం వెచ్చించారని.. అంతకు ముందు ఏడాది (2023లో) ఇది రూ.87,15,000 కోట్లు మాత్రమేనని అధ్యయనం వెల్లడించింది. 7.2 శాతం వృద్ధితో అమెరికా.. చైనా.. జర్మనీ కంటే భారత్ వేగంగా ఉన్నట్లు ఈ రిపోర్టు పేర్కొంది. 2026 నాటికి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద వినియోగదారుల మార్కెట్ గా అవతరించే దిశగా వెళుతుందని పేర్కొన్నారు. ఇది 2030 నాటికి రూ.20,04,450 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. 2030 నాటికి ఏడాదికి రూ.8.71 లక్షల కంటే ఎక్కువ సంపాదించే భారతీయుల సంఖ్య దాదాపు మూడు రెట్లు దూసుకెళ్లి 16.5 కోట్లకు చేరుతుందని పేర్కొన్నారు. 2024లో ఇది కేవలం 6 కోట్లు మాత్రమే కావటం గమనార్హం. దేశంలో మధ్యతరగతి వర్గాల వృద్ధిని.. విచక్షణా వ్యయంవైపు ప్రాథమిక మార్పును చెబుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. జనాభాలో 52 శాతం ఉన్న జనరేషన్ జెడ్.. మిలీనియల్స్ ఈ మార్పునకు కారణంగా చెబుతున్నారు ప్రీమియం బ్రాండ్లు.. స్థిర ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతున్నట్లుగా వెల్లడించారు. 2030 నాటికి భారతదేశ తలసరి ఆదాయం రూ.3,48,600 దాటుతుందని అంచనా వేశారు. వివిధ రంగాల్లో కొత్త అవకాశాల్ని ఇది తెరుస్తుందని పేర్కొన్నారు. తమ వాదనకు బలం చేకూరేలా ఒక ఉదాహరణను ఇందులో పేర్కొన్నారు, గత ఏడాది క్రెడిట్ కార్డుల సంఖ్య 10.2 కోట్లు ఉందని.. 2030 నాటికి ఈ సంఖ్య 29.6 కోట్లకు దూసుకెళుతుందని చెబుతున్నారు. దీంతో.. వినియోగదారులు చేసే ఖర్చులు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు.

## తనకు తాను మరమ్మతు చేసుకునే తారు.. గుంతల రోడ్లకు ఇక చెల్లు!



**న్యూఢిల్లీ-నవభూమి:** రోడ్లపై గుంతలు వాహన చోదకులకు చికాకు కలిగిస్తుంటాయి. వాటిని పూడ్చేందుకు భారీగా నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో రోడ్ల మరమ్మతులను తక్కువ ఖర్చుతో త్వరగా పూర్తిచేసేందుకు ఉపకరించే పదార్థాల తయారీపై బ్రిటన్ పరిశోధకులు దృష్టి సారించారు. ప్రత్యేకమైన 'సెల్ఫ్-హీలింగ్' తారును అభివృద్ధి చేశారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి బయోమాస్ వ్యర్థాలు, మొక్కల నుంచి సంగ్రహించిన సూక్ష్మ బీజాలతో దీన్ని రూపొందించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలు, పగుళ్లను ఎవరి ప్రమేయం లేకుండా తనంతట తానే మరమ్మతు చేయడం ఈ తారు ప్రత్యేకత. స్వాన్సీ యూనివర్సిటీ, లండన్‌లోని కింగ్స్ కాలేజీ, చిలీ శాస్త్రవేత్తలు కలిసి ఈ తారును తయారు చేశారు. బ్రిటన్‌లో రోడ్ల మరమ్మతుల కోసం ఏటా 143.5 మిలియన్ పౌండ్లు (దాదాపు రూ.1,580 కోట్లు) ఖర్చు చేయాల్సి వస్తున్నదని, ఇప్పుడు తాము రూపొందించిన తారు మరింత మన్నికైన 'నెట్-జీరో' రోడ్ల అభివృద్ధికి దోహదం చేస్తుందని స్వాన్సీ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం తెలిపింది.

## మహాకుంభమేళ ప్రాంతం ప్రస్తుతం ఎలా ఉందంటే..



**లక్నో-నవభూమి:** ప్రయాగ్ రాజ్‌లో దాదాపు 45 రోజుల పాటు సాగిన మహా కుంభమేళ యాత్రికులతో కిక్కిరిసిపోయింది. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే ఆ మహా కుంభమేళలో అమృత స్నానాన్ని చేసేందుకు దేశ విదేశాల నుంచి యాత్రికులు ప్రయాగ్ రాజ్‌కు పోటెత్తారు. జనవరి 13వ తేదీ నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు సాగిన ఈ మహా కుంభమేళ.. జనసంద్రంగా మారింది. ఈ కుంభమేళ ఇటీవల ముగియడంతో.. ప్రయాగ్ రాజ్ పరిసర ప్రాంతాలన్నీ నిర్మానుష్యంగా మారాయి.

ఇక ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమం ప్రాంతంతోపాటు పరిసర ప్రాంతాలను 15 రోజుల్లో శుభ్రం చేసేందుకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది. దీనిని ఫిబ్రవరి 28 నుంచి ప్రారంభంచింది. అందులోభాగంగా యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన టెంట్లను తీసివేస్తున్నారు. అలాగే సంగమం ఘాట్లు, రహదారులను శుభ్రం చేస్తున్నారు. ఇక యాత్రికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక మౌలిక సదుపాయాలను సైతం తొలగిస్తున్నారు. అదీకాక.. 45 రోజుల పాటు యాత్రికులతో జనసంద్రంగా మారిన ఆ ప్రాంతం ప్రస్తుతం అతి కొద్ది మంది యాత్రికులతో ఉంది.

ఆయన ఆధ్వర్యంలో..ఇక ఈ ప్రాంతంలో పరిశుభ్ర పరిచే కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి ఆకాంక్ష రానా పర్యవేక్షిస్తున్నారు. స్వచ్ఛతా మిత్రా, గంగా సేవా దుత్‌లో ఈ ప్రాంతాన్ని శుభ్రపరుస్తున్నారు. అలాగే ఈ ప్రాంతంలోని వ్యర్థాలను నైనీలోని నిర్వీర్యం చేసేందుకు బస్వార్ ప్లాంట్‌కు తరలిస్తున్నారు. మరోవైపు ఈ మహాకుంభమేళలో యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు.. పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు 15 వేల పారిశుద్ధ్య పనివారితోపాటు 2 వేల గంగా సేవా దూత్‌లను ఉత్తరప్రదేశ్‌లోని యోగి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

**గిన్నిస్ రికార్డులు..**

దీంతో మహాకుంభమేళ జరిగినన్ని రోజులు.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచారు. ఇక 45 రోజుల పాటు సాగిన ఈ మహాకుంభమేళలో రోజుకు 1.5 కోట్ల మంది భక్తులు ఈ సంగమంలో స్నానం చేశారు. ఇది మూడు గిన్నిస్ ప్రపంచ రికార్డులను సొంతం చేసుకుంది. అదే విధంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతోపాటు ఆయన కేబినెట్ మంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు సైతం ఈ మహాకుంభమేళకు హాజరయ్యారు. విదేశీ ప్రముఖులు సైతం ప్రయాగ్ రాజ్ విచ్చేశారు.

**తప్పలేదు తొక్కిసలాట..**

జనవరి 29వ తేదీ మౌని అమావాస్య. ఈ రోజు మహాకుంభమేళలో తొక్కిసలాట జరిగింది. ఇందులో 30 మంది మరణించారు. మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డారు. అలాగే ఈ మహాకుంభమేళలో పలుమార్లు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అందులో పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. ఇక యాత్రికుల రద్దీతో దాదాపు 300 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఏదీ ఏమైనా.. దాదాపు 144 ఏళ్లకు ఒక్కసారి మాత్రమే వచ్చే ఈ మహాకుంభమేళ.. రికార్డు సృష్టించింది.

## 'మా బావే నా మొగుడు..' వద్దమ్మా శాపం అంటున్న సైంటిస్టులు!

**న్యూఢిల్లీ-నవభూమి:** మేనరికపు పెళ్లిళ్లు వద్దుంటున్నా శాస్త్రవేత్తలు. మేనరికపు వివాహాలు పుట్టే పిల్లలకు శాపంగా మారుతున్నాయని హెచ్చరిస్తున్నారు. దగ్గరి సంబంధం పెళ్లిళ్లు చేసుకుంటే పుట్టే పిల్లలకు జన్యువ్యాధులు వచ్చి జీవితం నరకప్రాయం అవుతుందని సూచిస్తున్నారు. అరుదైన జన్యు వ్యాధులకు సంబంధించి 2021లో కేంద్ర ప్రభుత్వం జాతీయ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని నిమ్స్ సహ దేశంలోని 12 ఆస్పత్రులను జన్యువ్యాధులకు సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌లుగా ఎంపిక చేసింది. జన్యువ్యాధులతో వచ్చే చిన్నారులకు హైదరాబాద్ లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నొస్టిక్స్ లో జన్యు పరీక్షలు నిర్వహించిన అనంతరం నిమ్స్ లో చికిత్స అందిస్తున్నారు. నిమ్స్ కు జన్యువ్యాధులతో 2014లో 2,453 మంది వస్తే 2024లో ఆ సంఖ్య 12,042కు పెరిగింది. దీన్ని బట్టి అర్థం అయ్యేది మేనరికాల వల్ల జన్యువ్యాధులు పెరుగుతున్నాయని భావించవచ్చు. క్లారిటీ ఇచ్చిన ప్రశాంత్ కిశోర్! జన్యువ్యాధుల్లో ప్రధానంగా గౌచర్, విల్సన్ వ్యాధులు, కొందరిలో తలసేమియా, సికిల్ సెల్ అనిమియా వంటి వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయి. గౌచర్ వ్యాధిలో కొవ్వు విచ్ఛిన్నం చెందక ప్లీహం, కాలేయం వంటి అవయవాల్లో పేరుకుపోతుంది. దీంతో ఎముకలు బలహీనపడటంతో కీళ్ల వ్యాధులు దాడి చేస్తాయి.

విల్సన్ వ్యాధి కాలేయంపై దాడి చేస్తుంది. కాపర్ నిల్వలు కాలేయంలో పేరుకుపోయి దాని పనితీరును దెబ్బతీస్తుంది. కొన్నాళ్లకు కాలేయ మార్పిడి చేయాల్సి వస్తుంది. దీనికి లక్షల ఖర్చు అవుతుందనే విషయం తెలిసిందే. కొన్ని సార్లు శిశువు తల్లి కడుపులో ఉన్నప్పుడే జన్యువ్యాధులు దాడి చేస్తున్నాయి. కొందరిలో పుట్టిన తర్వాత బయటపడుతున్నాయి. నిమ్స్ కు వచ్చే జన్యువ్యాధుల కేసుల్లో ఎక్కువ శాతం మేనరికాలు చేసుకున్న దంపతుల సంతానానివే కావడం గమనార్హం. జన్యువ్యాధులు రాకుండా ఉండాలంటే మేనరికపు వివాహాలు వద్దనే చెబుతున్నారు శాస్త్రవేత్తలు. ఒకే రక్త సంబంధీకుల మధ్య జరిగే వివాహాల్లో పేరెంట్స్ నుంచి పిల్లలకు, అలా తరతరాలకు డీఎన్ఏ వెళ్తుంది.

## నేనున్నంత వరకూ నాకు వారసులు ఉండరు: మాయావతి బిగ్ స్టేట్‌మెంట్


**లక్నో-నవభూమి:** బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షు రాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయా వతి తన రాజకీయ వారసత్వం పై సంచలన ప్రకటన చేసారు. తాను జీవించినంత కాలం పార్టీకి తన వారసులు అంటూ ఎవరూ ఉండరని డిక్లేర్ చేశారు. మరో కీలక నిర్ణయం కూడా ప్రకటించారు. తన మేనల్లుడు ఆకాష్ ఆనంద్ నిర్వహిస్తున్న రెండు బాధ్యతల నుంచి ఆయనను తప్పించారు. మాయావతి రాజకీయ వారసు డిగా, బీఎస్పీ జాతీయ కో-ఆర్డినేటర్‌గా ఆకాష్ ఆనంద్ ఇంతవరకూ వ్యవహరిస్తున్నారు. లక్నోలో ఆదివారంనాడు బీఎస్పీ జాతీయ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ ఎంపీ అశోక్ సిద్ధార్థను పార్టీ నుంచి మాయావతి ఇటీవల బహిష్కరించారు. ఆకాశ్ ఆనంద్ మామగారైన అశోక్ సిద్దార్థను ఫ్యాక్షనలిజం కారణంగా పార్టీ బహిష్కరించింది. ఈ క్రమంలోనే ఆకాష్ ఆనం ద్‌ను పార్టీ బాధ్యతల నుంచి మాయావతి తొలగిం చారు. ఆకాష్ ఆనంద్ రాజకీయ కెరీర్‌పై ఆయన మామ ప్రభావం ఉందని మాయావతి ఇటీవల ఆరోపించారు. కాగా, తాజా మార్పులు, చేర్పుల్లో భాగంగా రాజ్యసభ ఎంపీ రామ్జీ గౌతంను బీఎస్పీ నేషనల్ కోఆర్డినేటర్‌గా తిరిగి నియమించారు. 2019 వరకూ ఆయన ఈ పదవిని నిర్వహించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్
సోమవారం
3 । మార్చి । 2025



## ఉక్రెయిన్ సంక్షోభం : యుద్ధం ముసుగులో దోపిడీ కథ!

ఉక్రెయిన్ ప్రస్తుత పరిస్థితి దయనీయంగా మారింది. దేశం యుద్ధభూమిగా మారిపోయింది, ప్రజలు అనేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. మౌలిక వసతుల ధ్వంసం, నిరాశ్రయులుగా మారిన ప్రజలు, ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రభావం.. ఇవన్నీ ఉక్రెయిన్ సంక్షోభానికి అద్దం పదుతున్న అంశాలు. యుద్ధం వలన దేశం నష్టపోయినదానికంటే ఎక్కువగా విదేశీ శక్తులపై ఆధారపడే పరిస్థితిలోకి దిగజారింది. – అమెరికా పెట్టుబడులు.. ఉక్రెయిన్ ఆర్థిక స్వాతంత్ర్యంపై ముప్పు ! యుద్ధం కారణంగా ఉక్రెయిన్ భారీ ఖర్చులను భరించాల్సి వచ్చింది. అమెరికా సహా పాశ్చాత్య దేశాలు ఉక్రెయిన్‌కు ఆర్థిక, సైనిక సహాయాన్ని అందించాయి. అయితే ఇది ఉచిత సాయమా? అసలు ఉక్రెయిన్ భవిష్యత్తు కోసం ఆ దేశాలను అడ్డుకోవటానికి అమెరికా నిజంగా కృషి చేస్తుందా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితులను గమనిస్తే, ఉక్రెయిన్ తన ఖనిజ సంపదను, సహజ వనరులను తక్కువ ధరకే విదేశీ పెట్టుబడిదారులకు అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు తమ పెట్టుబడులకు బదులుగా ఉక్రెయిన్ ఖనిజాలపై హక్కులు సాధిస్తున్నాయి. భవిష్యత్తులో ఉక్రెయిన్ తన సైనిక సహకారాన్ని కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది ఆ దేశ భద్రతా వైపునా మరింత సంక్షోభంలోకి నెట్టే అవకాశం ఉంది. – రష్యా ముప్పు ఇంకా తీరలేదు రష్యా నుంచి ఉక్రెయిన్‌కి ముప్పు ఇంకా తగ్గలేదు. భూభాగాలను ఆక్రమించుకోవడం, ఉక్రెయిన్‌పై ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి రష్యా నిరంతరం కృషి చేస్తోంది. అమెరికా పెట్టుబడిదారులు తాము కోరుకున్నదాన్ని తీసుకుని వెళ్ళిన తర్వాత ఉక్రెయిన్ మరింత అసహాయ స్థితిలో చిక్కుకునే అవకాశముంది.



## రైతు మనుగడకు ముంచుకొస్తున్న మరో ముప్పు

ప్రపంచమంతా కరోనా విజృంభణతో లాక్‌డౌన్‌లో ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 2020, జూన్‌లో వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు ఆర్డినెన్సులను తీసుకువచ్చి, ఆ తరువాత వాటిని చట్టాలుగా మార్చడం తెలిసిన విషయమే. ఈ మూడు చట్టాలను భారత రైతాంగం పూర్తిగా వ్యతిరేకించి, చరిత్రలో కనీవిని ఎరుగని విధంగా దాదాపు 15 మాసాలు దేశ రాజధానిలో చేసిన దీక్షలు, ధర్నాల ఫలితంగా... చివరికి దేశ ప్రధాని రైతాంగానికి క్షమాపణ చెప్తూ ఈ మూడు చట్టాలను ఉపసంహరించుకున్నారు. ఆ సమయంలో ఆయన రైతాంగానికి కొన్ని నిర్దిష్టమైన హామీలను ఇచ్చారు. అందులో ముఖ్యమైనది కనీస మద్దతు ధరకి చట్టబద్ధత కల్పించడం. ఈ హామీ నేటికీ అమలు చేయకపోవడంతో భారత రైతాంగం తిరిగి పోరాట బాట పట్టింది. రైతాంగం నుంచి ఇంత వ్యతిరేకతతో కూడిన పోరాటాలు కొనసాగుతున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. పైగా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్ఎఎం) ముసాయిదా రూపంలో మళ్లీ రద్దు చేసిన నల్ల చట్టాలలోని కొన్ని అంశాలను రైతులపై రుద్దే ప్రయత్నం చేయడం హాస్యాస్పదం. 2024, నవంబర్ 24న భారత ప్రభుత్వం జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్‌పిఎఫ్ఎఎం) ముసాయిదాను విడుదల చేసి, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను కోరింది. ఈ ముసాయిదాలోని కొన్ని అంశాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తే, గతంలో రద్దయిన మూడు నల్ల చట్టాలలో రెండిటిని తిరిగి ఈ కొత్త మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దనున్నట్లు తెలుస్తుంది. భారత ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈ విధానంపై రైతులు, రాష్ట్రాలు, నిపుణులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇది రైతుల కోసం కాకుండా, పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడిన విధానమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ముసాయిదాలో ఉన్న రైతు వ్యతిరేక అంశాలు ఏమిటో చూద్దాం. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్‌పి) చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారింది. అంతేకాక రైతుల ఆదాయ భద్రతపై తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఎంఎస్‌పి రక్షణ లేకుండా రైతులు మార్కెట్‌లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టం. ఇది చిన్న రైతులను ఇంకా అస్థిరతలోకి నెట్టివేస్తుంది. అంతేకాక, ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కన పెట్టి, వ్యవసాయ మార్కెటింగ్‌ను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోంది. ప్రస్తుత వ్యవసాయ మార్కెటింగ్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వాల కీలక పాత్రను ఈ విధానం పూర్తిగా దెబ్బతీస్తుంది. ముఖ్యంగా, అగ్రికల్చరల్ ప్రొడ్యూస్ మార్కెట్ కమిటీస్ (ఎపిఎంసీ) వ్యవస్థను బలహీనపరచడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పక్షాన న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఇది సమాఖ్య సూత్రాలకు విరుద్ధమని వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొన్నాయి. మరొక ముఖ్యమైన అంశం ఏమంటే, ఈ విధానం ద్వారా ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తుంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులు వ్యవసాయంపై పట్టు కోల్పోయి, కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అంతేకాకుండా ఈ విధానం రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ) ప్రధాన భాగస్వాములుగా చూపబడుతున్నప్పటికీ, కార్పొరేట్ సంస్థల కేంద్రీకృత నియంత్రణకు దోహదపడుతుంది. తద్వారా చిన్న రైతుల మనుగడ ప్రశ్నార్థకంగా మారి, వాళ్ళు మార్కెట్‌లో బలహీనపడే ప్రమాదం పొంచివుంది. ఈ విధానంలో ఉన్న గిడ్డంగుల ప్రైవేటీకరణ ద్వారా, రైతులు తమ ఉత్పత్తులను సకాలంలో నిల్వ చేసుకునే అవకాశాలను కోల్పోతారు. ధరల అస్థిరతలో రైతులకు భద్రత ఇవ్వాల్సిన పద్ధతులు పూర్తిగా ప్రైవేట్ కంపెనీల నియంత్రణలోకి వెళ్లడం వల్ల, రైతులు తమ ఉత్పత్తులకు సరైన ధరలు పొందలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఈ విధానంలో మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా, పెద్ద సంస్థలు మార్కెట్‌ను పూర్తిగా ఆధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోంది. ముఖ్యంగా వ్యాపారులు అనైతిక వర్తక సంఘాలుగా ఏర్పడి, రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందడం లాంటివి జరిగే ప్రమాదం ఉంది. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానంలోని ఇలాంటి ప్రమాదకర అంశాల వల్ల రైతుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లే అవకాశం ఉంది. చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడవచ్చు. వారు తమ పంటలకు సరైన ధర పొందడంలో ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మరొకవైపు, మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలను పెంచే అవకాశముంది. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవ సాయ మార్కెట్ వ్యవస్థకి సంబంధించిన ఆంశాలపైన కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. గతంలో ఎపిఎంసీ చట్టం%–%2002 సవరణ చేయవలసి వచ్చినప్పుడు ఆనాటి కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల నుంచి శాసనసభ తీర్మానాలు తీసుకున్న తరువాత అమలులోకి తెచ్చేది. అలాంటి సంప్రదాయాలను నేటి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. భారత రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాల్సిన అవసరం ఉన్నది.

ఈ సమగ్ర విధానాలలో భాగంగా, కనీస మద్దతు ధరకు చట్టబద్ధతని కల్పించటం, మద్దతు ధర లెక్కింపులో డా. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు చేసినట్టుగా కాస్ట్-3 పైన 50శాతం మద్దతు ధరను ప్రకటించడం, ప్రస్తుతం ఉన్న ఎపిఎంసీలలో ఆధునిక సదుపాయాలు కల్పించి బలోపేతం చేయడం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న గిడ్డంగులను ఆధునీకరించడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం, ఎఫ్‌పిఓలను బలోపేతం చేయడం, మార్కెట్ రిస్క్ నుంచి రైతులను కాపాడడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఈ కొత్త వ్యవసాయ మార్కెటింగ్ విధానం రైతుల హక్కులకు ముప్పుగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం సరైన మార్పులు చేసి, ఈ విధానాన్ని సమతుల్యం చేయాలి. రైతులు భవిష్యత్తులో బలహీనం కాకుండా, వారు తమ హక్కులను సాధించేందుకు అది సమర్థంగా ఉండాలి.

# భారత్‌లోకి 'ఎఐ ఏజెంట్' వచ్చేసింది..!



'ఎఐ ఏజెంట్' భారతదేశంలోకి వచ్చింది..! ఓపెన్ ఎఐ ప్రపంచానికి చాట్‌జీపీటీని పరిచయం చేసి, ఎఐ సేవల్లో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. కృత్రిమ మేధను మరింత అభివృద్ధి చేసే దిశగా, తాజాగా 'ఎఐ ఏజెంట్' అనే కొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. వర్చువల్ సాయంగా మారే ఈ ఎఐ ఏజెంట్లు, వినియోగదారుల ప్రాంప్ట్‌ల ఆధారంగా ఆన్‌లైన్‌లో ఆటోమెటిక్‌గా పనులను నిర్వహించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.

భారత్‌తోపాటు పలు దేశాల్లో ఎఐ సేవలు ప్రారంభం..!

ప్రస్తుతం ఎఐ సేవలు అమెరికాలో చాట్‌జీపీటీ ప్రో యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉండగా, తాజాగా భారత్‌తోపాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా, యూకే దేశాల్లోనూ ఈ సేవలు ప్రారంభమయ్యాయి. అయితే ఐరోపా దేశాల్లో ఎఐ సేవలు ఇంకా అందుబాటులోకి రాలేదని, త్వరలో అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఓపెన్‌ఎఐ వెల్లడించింది. ఈ విషయాన్ని కంపెనీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది.

కంప్యూటర్-యూజింగ్ ఏజెంట్ ఆధారంగా పనులు.. ఈ ఎఐ ఏజెంట్ సంక్లిష్టమైన ఆన్‌లైన్ పనులను స్వతంత్రంగా నిర్వహించగలదు. ఇది 'కంప్యూటర్-యూజింగ్ ఏజెంట్' ఆధారంగా పని చేస్తుంది. జీపీటీ-4%శీ, శీ%3మోడళ్ల ఆధునిక నైపుణ్యాలతో రూపొందించిన ఈ ఎఐ, ప్రత్యేక బ్రౌజర్‌లో పని చేస్తుంది. యూజర్లు ఇతర పనుల్లో నిమగ్నమై ఉన్నా, ఇది స్వతంత్రంగా పని చేయగలదు. టెక్స్ట్, ఇమేజ్ తరహా ఇన్‌పుట్‌లను స్వీకరించి, లోపాలను సరిదిద్దడం, అనుకోని సవాళ్లను ఎదుర్కోవడం, ఉత్పాదకతను పెంచడం లాంటి పనులను ఈ ఎఐ సమర్థవంతంగా నిర్వహించగలదు. ఓపెన్‌ఎఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ వివరిస్తూ ఈ ఎఐ ఏజెంట్లు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు సాయంగా మారగలవని, వారికి కేటాయించిన పనులను సమర్థవంతంగా పూర్తి చేయగలవని తెలిపారు. అయితే స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యం వీటికి లేదని, మానవుల ప్రమేయం అవసరమేనని స్పష్టం చేశారు. దీర్ఘకాలంలో విజ్ఞానానికి సంబంధించిన అన్ని రంగాల్లో ఎఐ ఏజెంట్లు ప్రాముఖ్యత పొందుతాయని అభిప్రాయపడ్డారు.

**ఏళ్ల అనుభవం ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేసే పనులను చేయగలవు..!**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తోంది. దాదాపు అన్ని రంగాల్లో ఎఐ వినియోగం అనివార్యంగా మారింది. దీంతో ఎఐతో ఉద్యోగాలు ప్రమాదంలోపడడం ఖాయమనే చర్చ గత కొన్ని రోజులుగా నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎఐ ఏజెంట్స్ అనే పేరు బాగా వినిపిస్తోంది. ఏళ్ల అనుభవం ఉన్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేసే పనులను ఎఐ ఏజెంట్స్ చేయగలవని ఆల్టామాన్ చెప్పిన మాటలు ఉద్యోగుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఈ ఎఐ ఏజెంట్స్ భవిష్యత్తుల్లో ఒక సాధారణ ఉద్యోగిలాగా పనిచేస్తాయని ఓపెన్ ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మాన్ తెలిపారు. ఈ ఏజెంట్లు ఈ సంవత్సరం వర్క్‌ఫోర్స్‌లో చేరతారని, వీటితో కంపెనీల ఉత్పత్తి భారీగా పెరుగుతుందని చెప్పుకొచ్చారు. ఇక ఈ ఏఐ ఏజెంట్స్ కోడింగ్‌ను కూడా సమర్థవంతంగా చేయగలవని వెల్లడించారు.

**మనుషులను భర్తీ చేస్తాయా.?**

ఈ ఎఐ ఏజెంట్స్ మనుషులను పూర్తిగా భర్తీ చేస్తాయా అంటే లేదని ఆల్ట్‌మాన్ తెలిపారు. ఈ ఏజెంట్లు మనుషులు చేసే పనులు చేసినప్పటికీ నాణ్యత, ఆవిష్కరణలకు సంబంధించి పర్యవేక్షించేందుకు మానవులు అవసరమవుతారన్నారు. అయితే ఇవి మనుషులతో కలిసి పనిచేస్తాయని తెలిపారు. కానీ వీటి ప్రభావం కచ్చితంగా ఉద్యోగాలపై పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉంటే %ొ%. ఇప్పటికే చాలా కంపెనీలు ఎఐ ఏజెంట్స్‌ను ఉపయోగించుకుంటున్నాయి. గూగుల్, మెటా వంటి పెద్ద కంపెనీలు తమ వర్క్ ఫోర్స్‌లో వీటిని ఉపయోగించుకుంటున్నాయి. గూగుల్ తన కోడ్ నిర్మాణంలో ఎక్కువ భాగాన్ని ఎఐతోనే రూపొందిస్తుంది. అదే విధంగా మెటా కూడా ఎఐ ఏజెంట్స్‌తో కలిసి పనిచేస్తుంది. మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కూడా ఎఐ మిడ్-లెవల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను భర్తీ చేస్తుందని అన్నారు.

## అధ్యాపక కొలువులు భర్తీ చేయాలి




రాష్ట్ర యూనివర్సిటీల అధ్యాపక పోస్టుల భర్తీ విషయంలో గత 14 సంవత్సరాలుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే నినాదంతో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం జరిగింది. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలలో యూనివర్సిటీల అభివృద్ధిని పట్టించుకోలేదు. ఏ యూనివర్సిటీలైతే తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊదాయో అవే నేడు అధ్యాపకులు లేక నిర్వీర్యం దిశగా అడుగులు వేస్తున్నాయి. తెలంగాణ యూనివర్సిటీలలోని ఖాళీలు భర్తీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. యూనివర్సిటీలలో టీచింగ్ పోస్టులు భర్తీ కోసం 'తెలంగాణ యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు' బిల్లును గత ప్రభుత్వం తీసుకొచ్చింది. రాజ్యాంగబద్ధమైన యూనివర్సిటీల స్వయంప్రతిపత్తికి విఘాతం కలుగుతుందని ఆ బిల్లును కులపతి, రాష్ట్ర గవర్నర్ పెండింగ్‌లో పెట్టారు. దీనిని సాకుగా చూపించి గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఖాళీల భర్తీ విషయంలో కాలయాపన చేస్తున్నాయి.

ప్రతిష్ఠాత్మకమైన ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, జేఎన్‌టీయూ, బాసర(ఐటి) యూనివర్సిటీలలోని కొన్ని విభాగాలు అధ్యాపకులు లేకపోవడంతో కాంట్రాక్ట్, పార్ట్‌టైమ్ వారితో కాలం వెళ్లదీస్తున్నాయి. అలాగే, కొన్ని విశ్వవిద్యాలయాలకు రిజిస్ట్రార్, ఇతర కీలక పరిపాలన పదవుల్లో ఇతర విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లను ఇన్‌ఛార్జిలుగా నియమిస్తున్నారు. అదేవిధంగా యూనివర్సిటీలోని కొన్ని విభాగాలకు రెగ్యులర్ ప్రొఫెసర్లు లేకపోవడంతో కాంట్రాక్టు ఉద్యోగులను డిపార్ట్‌మెంట్ విభాగ అధిపతులుగా, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లుగా నియమిస్తున్నారు.

దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలు (సెంట్రల్ యూనివర్సిటీస్)లోని అన్ని రకాల బోధన ఉద్యోగాల పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేస్తున్నారు. ఇదే విధానాన్ని రాష్ట్రంలోని యూనివర్సిటీ టీచింగ్ పోస్టుల భర్తీ విషయంలో కూడా అవలంబించాలి. రాష్ట్ర యూనివర్సిటీల నుండి ప్రతి సంవత్సరం దాదాపు రెండువేల మంది పీహెచ్‌డి పూర్తి చేసి కేంద్రీయ విశ్వవిద్యాలయాలు ఇచ్చే రెగ్యులర్ నోటిఫికేషన్‌కి అర్హత సాధించినప్పటికీ, నియామకాల విషయంలో వీరికి కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డి చేసిన వారితో సమానమైన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. దేశంలో అత్యున్నతమైన చదువు పీహెచ్‌డి, నెట్, సెట్ అర్హత సాధించి, ఒకవైపు ఉద్యోగాలు లేక, మరోవైపు కుటుంబ భారంతో పాటు ఏజ్‌బార్ అయిపోవడంతో అనేకమంది ఆశావాదుల అసిస్టెంట్ ప్రొఫెసర్ కావాలనే కల కలగానే మిగిలిపోతుంది. ప్రభుత్వాలకు రాజకీయ ఖాళీల భర్తీ విషయంలో ఉన్న చిత్తశుద్ధి యూనివర్సిటీ ఖాళీలను భర్తీ చేయడంలో లేదు. ఇకనైనా ప్రభుత్వం అర్హత గల అభ్యర్థులతో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి.


## ఇంటర్ విద్యలో సంస్కరణలు అవసరం



జాతీయ క్రైమ్ బ్యూరో లెక్కల ప్రకారం భారతదేశంలో విద్యార్థుల ఆత్మహత్యల్లో తొమ్మిది శాతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయి. వీటిలో మెజారిటీ విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నవారే కావడం గమనార్హం. నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్(2022) ప్రకారం విద్యార్థుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్ తొలి మూడు స్థానాల్లో ఉండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు 10, 11 స్థానాల్లో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు అధిక శాతం మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఇంటర్మీడియట్ విద్యారంగం కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో ఉండడమే. వారి ప్రభావం వల్ల గత మూడు దశాబ్దాలలో ఇంటర్మీడియట్ విద్యలో ఎటువంటి సంస్కరణలూ జరుగలేదు. కార్పొరేట్ శక్తుల స్వార్థ ప్రయోజనాల కోసం విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి సంవత్సరం ఆత్మహత్యలకు గురి అవుతున్న విద్యార్థులలో అత్యధిక శాతం ఇంటర్ విద్యార్థులే అని గణాంకాలు చెబుతున్నాయి. ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడిన ప్రతీసారి విద్యార్థుల ఆత్మహత్యల వార్తలు ఆందోళన కలిగిస్తూనే ఉన్నాయి. ఇంటర్‌లో చేరే విద్యార్థులు కోర్సు మొదలయిన రోజు నుంచి ఫలితాలు వచ్చే వరకు రెండు సంవత్సరాల పాటు నిరంతర ఒత్తిడిలో ఉంటారు. దీనికి కారణం బోర్డు పరీక్షలు, కార్పొరేట్ శక్తులు, తల్లిదండ్రుల ఒత్తిడి. దేశంలో కేవలం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో, తమిళనాడులో మాత్రమే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు జరుగుతున్నాయి. మిగతా రాష్ట్రాల్లో కేవలం అంతర్గత మూల్యాంకనం ద్వారా మాత్రమే విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను నమోదు చేస్తారు. మొదటి సంవత్సరం పరీక్షల్ని తొలగిస్తే విద్యార్థులపై ఒత్తిడి తగ్గి, మొదటి ఏడాది సిలబస్‌లో కీలక అంశాలపై పట్టు సాధించడంతో పాటు వాటి ఆధారంగా రెండో ఏడాది సబ్జెక్టులపై పట్టు సాధించి, జాతీయస్థాయి పరీక్షలలో రాణించే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూడా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే సమయం, సౌలభ్యం దొరుకుతుంది. అధ్యాపకులు కూడా పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసేందుకు వెసులుబాటు ఉంటుంది. అదేవిధంగా జాతీయ బోర్డు, ఇతర రాష్ట్రాల బోర్డులు కేవలం 12వ తరగతి పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నందున వారితో సారూప్యత ఏర్పడుతుంది. కానీ, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు తొలగిస్తే విద్యార్థులు, అధ్యాపకులలో మొదటి సంవత్సరంపై శ్రద్ధ తగ్గి, కేవలం రెండవ సంవత్సరంపై మాత్రమే దృష్టి పెడతారని కొందరు విద్యావేత్తల అభిప్రాయం. మొదటి సంవత్సర ఇంటర్నల్ పరీక్షలు, మూల్యాంకనం పకడ్బందీగా నిర్వహించడం ద్వారా దీనిని అధిగమించవచ్చు. అదే విధంగా జాతీయ స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షలలో రెండు సంవత్సరాల సిలబస్ నుంచి సమాన సంఖ్యలో ప్రశ్నలు ఉంటాయని విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారిని ప్రోత్సహించాలి. ప్రభుత్వమే ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు రాసే పోటీ పరీక్షల కోసం ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లను నిర్వహించడం, ప్రభుత్వ రంగంలో ఇంటర్మీడియట్ విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవడం, మొదటి సంవత్సర పరీక్షలు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఇంటర్మీడియట్ విద్యలో సంస్కరణలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. **– సహాయ**



## ఈ శివుడిని దర్శిస్తే దెబ్బకు మీ జాతకం మారాల్సిందే..



సాధారణంగా కొండ ప్రాంతాలపై ప్రతి చెట్టుపై కాకులు కనిపిస్తూ ఉంటాయి. కానీ, గుంటూరు జిల్లా నరసరావుపేటకు సమీపంలోని ఈ కోటప్ప కొండపై మాత్రం అస్సలు కాకులు వాలవు. కొండ ఎక్కుతున్నప్పుడు దారిలో అనేక కాకులు కనిపించినా కొండపై మాత్రం ఒక్క కాకి కూడా అక్కడ కనిపించదు. ఇప్పటి వరకూ ఈ కొండపై కాకులు వాలిన దాఖలాలు కూడా లేవు. అయితే, అసలు ఈ కొండపై కాకులు ఎందుకు వాలవు? వాలకపోవడానికి కారణం ఏమిటి? అనే ప్రశ్నకు సమాధానం తెలియాలంటే కోటప్ప కొండ చరిత్ర గురించి మనం తెలుసుకోవాలి.


కోటప్ప కొండ చరిత్ర..మహా శివుడు కైలాసంలో దక్షిణామూర్తిగా తపస్సు చేస్తాడు. ఆ సమయంలో బ్రహ్మదేవుడు దక్షిణామూర్తి అయిన శివుడిని దర్శించి తనకు జ్ఞాన బోధ చేయాలని కోరుతాడు. అందుకు పరమశివుడు బదులిస్తూ త్రికుటాచలంకు వస్తే జ్ఞానాన్ని ప్రసాదిస్తానని చెబుతాడు. దీంతో బ్రహ్మ ఇతర దేవతలతో కలిసి వెళ్లి అక్కడ శివుడి నుండి జ్ఞానం పొందుతాడు. ఆ ప్రదేశమే పాత కోటప్ప కొండగా మారింది. కోటప్ప కొండను ఎటువైపు నుంచి చూసినా సరే మూడు శిఖరాలు కనిపిస్తాయి. ఈ మూడు శిఖరాలను బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా అందరూ భావిస్తారు. అందుకే ఈ కొండను త్రికుటేశ్వరంగా, ఇక్కడ కొలువైన స్వామిని త్రికుటాచలేశ్వరునిగా, త్రికోటేశ్వరుడిగా భక్తులు కొలుస్తారు.

అయితే, ఈ పర్వతాలకు సమీపంలోనే కొండకావూరులో సుందుడు అనే ఒక యాదవుడు తన భార్య కుందిరితో కలిసి అక్కడ జీవించేవాడు. సుందుడు ఒకరోజు పశువులను కాచుకుంటూ కొండపై ఉన్న త్రికుటేశ్వరున్ని దర్శించి సేవిస్తాడు. ఆ తరువాత సుందుడు భార్యకు గొల్లభామ అనే కుమార్తె జన్మిస్తుంది. ఆమె జన్మించిన తరువాత సుందుడు కుటుంబం సిరి సంపదలతో ఎదుగుతుంది.

**ఈ కొండపై కాకులు వాలవు..**

గొల్లభామ చిన్నతనం నుంచే పరమశివుడి పట్ల భయభక్తులు కలిగి ఉండేది. ఆమె రోజూ రుద్రకొండపై ఉన్న పాత కోటేశ్వర ఆలయంలో పూజలు చేసేది. ఆమె భక్తిని పరీక్షించాలని శివుడు కన్య అయిన గొల్లభామకు గర్భాన్ని ప్రసాదిస్తాడు. అయితే, ఆమె గర్భంతో ఉన్నప్పటికీ ఆ పరమేశ్వరున్ని కొలిచేందుకు పాత కోటప్ప కొండకు ప్రతి రోజూ వెళ్లేది. ఎప్పటిలానే ఒక రోజు ఆమె శివునికి నైవేద్యంగా ఒక చల్ల కుండలో పెరుగును తీసుకుని వెళ్తూ ఆయాసంతో కొండ మెట్లపై కూర్చుంటుంది. ఇంతలోనే ఒక కాకి ఆ కుండపై వాలి గొల్లభామ దగ్గర ఉన్న పెరుగును నేలపాలు చేస్తుంది. దీంతో గొల్లభామ తీవ్ర విచారంలో ఉంటుంది. ఆ సమయంలో ఒక వృద్ధ బ్రాహ్మణుడి రూపంలో ఆ పరమేశ్వరుడు వచ్చి ఆమె విచారానికి కారణమైన కాకులు ఇకపై ఈ కొండపై వాలవని చెబుతాడు. అప్పటి నుంచి ఈ కోటప్ప కొండపై కాకులు వాలడం లేదని పురాణం చెబుతుంది. ఇప్పటికీ కూడా అక్కడ కాకులు వాలవు అని స్థానికులు చెబుతారు.





## ఎండకాలంలో సన్ గ్లాసెస్..

సన్ గ్లాసెస్.. ఎండకాలంలో కళ్లకు రక్షణనిస్తాయి. ముఖానికి కొత్త అందాన్ని తెచ్చిపెడతాయి. మిమ్మల్ని మరింత స్టయిలిష్‌గా మారుస్తాయి. ఈ వేసవి కోసం ప్రఖ్యాత రేబాన్ సంస్థ.. సరికొత్త సన్ గ్లాసెస్‌ను మార్కెట్లో విడుదల చేసింది. నాణ్యత కలిగిన లెన్స్, మన్నికైన ఫ్రేమ్స్‌తోపాటు ఐకానిక్ డిజైన్లకు రేబాన్ ప్రసిద్ధి. ఫ్యాషన్‌తోపాటు బ్రాండింగ్‌ను ఇష్టపడేవారికి ఇవి మంచి ఎంపిక.రౌండ్ డబుల్ బ్రిడ్జ్‌పాతతరం వైబ్ కావాలనుకునే కొత్తతరం కోసం.. రౌండ్ డబుల్ బ్రిడ్జ్ పేరుతో సన్ గ్లాసెస్ తీసుకొచ్చింది రేబాన్. సొగసైన మెటల్ ఫ్రేమ్‌తో తయారైన ఈ గ్లాసెస్.. ఎక్కువకాలం మన్నుతాయి. తేలికగా ఉండటంతో రోజంతా ధరించినా సౌకర్యంగా ఉంటాయి. యూవీ ప్రొటెక్షన్ కలిగిన లెన్స్.. మీ కళ్లకు రక్షణ కవచంలా పనిచేస్తాయి. ట్రెండీ లుక్‌తో ఆకట్టుకునేలా ఉండే ఈ గ్లాసెస్.. మీరు ఎలాంటి దుస్తుల్లో ఉన్నా స్టయిలిష్‌గా కనిపించేలా చేస్తాయి.

**ఫుల్ రిమ్ ఏవియేటర్స్**

క్లాసిక్ ఫ్యాషన్‌ను ఇష్టపడే వారికి ఫుల్ రిమ్ ఏవియేటర్స్ మంచి చాయిస్! రేబాన్ ఐకానిక్ డిజైన్‌తో దృఢమైన ఫ్రేమ్స్‌తో వస్తున్నాయివి. తేలికైన, మన్నికైన మెటల్ ఫ్రేమ్‌తో తయారైన ఈ ఏవియేటర్స్.. రోజంతా ధరించడానికి సౌకర్యవంతంగా ఉంటాయి. యూవీ ప్రొటెక్షన్ కలిగిన లెన్స్‌లు.. కఠినమైన సూర్యకాంతి నుంచి కళ్లను రక్షిస్తాయి. మీ లుక్‌ను మరింత కూల్‌గా మారుస్తాయి.

గ్రేడియంట్ స్క్వేర్..సొగసైన అసిటేట్ ఫ్రేమ్‌తో.. మీ ముఖానికి స్టయిలిష్, ఫంక్షనల్ లుక్ తీసుకొస్తాయి రేబాన్ గ్రేడియంట్ స్క్వేర్ సన్ గ్లాసెస్. తేలికగా, సౌకర్యంగా ఉంటాయి.

# మరీ మరిగిస్తే చేటే!





పొద్దున లేస్తే.. టీ! మధ్యాహ్నానికి.. మరో‘టీ’! సాయంత్రానికి.. ఇంకో‘టీ’! ఇలా.. రోజులో కనీసం నాలుగైదు సార్లు వేడివేడి ‘చాయ్’ తాగేస్తుంటారు చాలామంది. ఇంట్లోవాళ్లు కూడా.. అడిగిందే తడవుగా చిక్కని ఉష్ణోదకాన్ని చేసిపెడతారు. అంతేకాదు, ‘టీ.. ఎంత ఎక్కువ సమయం మరిగితే అంత రుచి’ అనుకుంటారు. కానీ, ఇలా ఎక్కువసేపు మరిగించిన చాయ్ తాగడం ఆరోగ్యానికి హానికరం అని చెబుతున్నారు నిపుణులు.

చాయ్ ఎక్కువసేపు మరిగితే.. దాన్ని తాగడం వల్ల శరీరానికి లభించే శక్తి నశిస్తుంది. ‘టీ’లో టానిన్లు అనే రసాయనాలు ఉంటాయి. ఎక్కువసేపు మరిగించడం వల్ల వాటి సాంద్రత పెరిగిపోతుంది. శరీరంలోకి అధిక మొత్తంలో చేరే టానిన్లు.. కడుపునొప్పి, వికారం, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలకు కారణం అవుతాయి.అధికంగా మరిగించడం వల్ల టీలో ఉండే కెఫీన్.. చేదుగా మారుతుంది. అంతేకాదు పాలలో ఉండే కాల్షియం, విటమిన్లు, విటమిన్ బి, బి12, సి వంటి పోషకాలు కూడా నశిస్తాయి. టీలో ఉండే యాంటి ఆక్సిడెంట్లు కూడా ఉనికి కోల్పోతాయి. అందుకే.. పాలతో టీ చేసుకునేవారు 3 నుంచి 5 నిమిషాల్లోపే వడగట్టేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అంతకన్నా ఎక్కువసేపు మరిగిస్తే.. రుచి సంగతి ఏమో కానీ, ఆరోగ్యానికి చేటు తప్పదని హెచ్చరిస్తున్నారు.

# హెల్దీ లడ్డూల అడ్డా

మారాం చేసే చిన్నపిల్లలకు లడ్డూ ఇచ్చి ఊరడించడం సర్వసాధారణంగా చూస్తుంటాం. కానీ, మార్కెట్లో దొరికే లడ్డూలను ఎలాంటి పదార్థాలతో తయారు చేస్తున్నారనే అనుమానం హైదరాబాద్‌కు చెందిన బి.శాంతిని కిడ్ ఫుడ్ మేకర్‌ని చేసింది. చక్కెర, బెల్లం లేకుండా తీపి లడ్డూలు తయారుచేసి రుచితోపాటు ఆరోగ్యాన్నీ పంచుతున్నది. వంటింట్లో మొదలైన ఆమె ఫుడ్ జర్నీ.. అపార్ట్‌మెంట్ కాంపౌండ్ దాటి, కాలనీ వాసులను పలకరించి వీ హబ్ వేదికగా కొత్తపుంతలు తొక్కింది. ‘మామ్స్ హోం మేడ్ స్పైసెస్ అండ్ ఫుడ్స్’ పేరుతో వ్యాపారం మొదలుపెట్టి లడ్డూలు, మసాలాలు, కారం పొడులు విక్రయిస్తూ స్టార్టప్ స్టార్ అయింది. ఆ విశేషాలు ఇవి..







శాంతి వాళ్లు ఉండేది హైదరాబాద్‌లోని చందానగర్‌లో. ఆమె భర్త ఐటీ ఉద్యోగి. పని ఒత్తిడితో సతమతమయ్యే భర్తకు ఆర్థికంగా అండగా నిలవాలనుకుంది. స్వతహాగా ఎదగాలనే సంకల్పంతో ఫుడ్ మేకింగ్ రంగంలోకి అడుగుపెట్టింది శాంతి. తల్లి నుంచి అబ్బిన మసాలా తయారీ నైపుణ్యాలకు మరింత పదును పెట్టింది. దీనికి కొనసాగింపుగా పిల్లల కోసం హోమ్ మేడ్ ఫుడ్ తయారుచేయడం ప్రారంభించింది. ఇంట్లో ప్రయోగాలతో చేసిన పదార్థాలు పిల్లలు ఇష్టంగా ఆరగించడంతో.. విపణిలోకి దూసుకొచ్చింది.

**చక్కెర, బెల్లం లేని తీపి లడ్డూలు**

హోమ్ మేడ్ ఫుడ్ అంటే చాలు నగరవాసులకు ఓ నమ్మకం. ముఖ్యంగా స్వీట్లకు ఉన్న గిరాకీ అంతా ఇంతా కాదు. చక్కెరతో తయారయ్యే మిఠాయిలు ఎక్కువగా తీసుకుంటే పిల్లల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది. దీనికితోడు జంక్‌ఫుడ్ ఉండనే ఉంది! తాను తయారుచేసే ఆహార ఉత్పత్తులు రుచితోపాటు ఆరోగ్యాన్నీ అందివ్వాలని ఆశించింది శాంతి. పోషకాలు నిండిన పదార్థాలు ఎలా తయారుచేయాలో పరిశోధన చేసింది. యూట్యూబ్ పాఠాలు విన్నది. సామాజిక మాధ్యమాల్లో చూసి కొత్త పదార్థాలు చేయడం నేర్చుకుంది. తర్వాత ఇంట్లో ప్రయోగాత్మకంగా లడ్డూలు చేయడం మొదలుపెట్టింది. తను చేసిన వాటిని ముందుగా తన పిల్లలకు మాత్రమే తినిపించి, వారిలో మార్పులను గమనించింది. కాలక్రమంలో మరింత వైవిధ్యంగా పుష్టినిచ్చే లడ్డూలను తయారుచేసింది. చక్కెర, బెల్లం వాడకుండా కేవలం ఖర్జూరంతో లడ్డూలు చుట్టడం ఆమె ప్రత్యేకత. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటికన్నా శాంతి చేసిన లడ్డూల్లో మెరుగైన పోషక విలువలు ఉన్నాయని ఆహార నాణ్యత పరీక్షల్లో కూడా వెల్లడైంది. చక్కెర లేకుండా తయారుచేసిన లడ్డూలను పిల్లలకు ఆహారంగా ఇవ్వడం వల్ల వారికి రుచిని అందిస్తూనే, ఆరోగ్యాన్ని కాపాడవచ్చని అంటున్నది శాంతి. ఈ సూత్రమే తన వ్యాపారం చక్కగా సాగేందుకు దోహదం చేసిందని చెబుతున్నది.

**తయారీ నుంచి ప్యాకింగ్ వరకూ**

మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు వీ హబ్ అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి తెలుసుకుంది శాంతి. భర్త సహకారంతో వీ హబ్ తలుపు తట్టింది. ఓరియెంటేషన్ తరగతుల ద్వారా ఆమెకు హెల్దీఫుడ్ ప్రాధాన్యం, మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ప్యాకింగ్, తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఏర్పడింది. ఇంట్లోనే నాణ్యతతో రుచి, పుష్టికరమైన లడ్డూలు, స్నాక్స్ సిద్ధం చేసింది. వాటిని ఆహార భద్రత నిబంధనలకు అనుగుణంగా ప్యాకింగ్ చేయడం వరకు అన్ని చకచకా నేర్చుకున్నది. తన ఉత్పత్తులు నేరుగా కస్టమర్లకు అందించేలా బీ2సీ (బిజినెస్ టు కన్స్యూమర్) విధానంలో వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది. లడ్డూలతోపాటు రకరకాల కారం పొడులు, మసాలాలు కూడా తయారుచేస్తున్నది. ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటుచేసి తన ఉత్పత్తులను విక్రయిస్తున్నది.

**ఎన్నో ఇబ్బందులు..**

సొంతంగా ఏదైనా చేయాలనుకునే గృహిణులు ప్రారంభ దశలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటి సవాళ్లు ఎన్ని ఎదురైనా శాంతి నిలబడింది. ప్రస్తుతం తన ఉత్పత్తులకు మంచి గిరాకీ ఏర్పడటంతో విస్తరణపై దృష్టి పెట్టింది. తనలాంటి మరో 10 మంది మహిళలతో వ్యాపారాన్ని పెంచే దిశగా అడుగులు వేస్తున్నది. వీ హబ్ సహకారంతో శాంతికి వస్తున్న ఆర్డర్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భవిష్యత్తులో తక్కువ మొత్తంతో క్లౌడ్ కిచెన్ ప్రారంభించడంపై దృష్టి పెట్టానని, తమ ఉత్పత్తులు మరింత మందికి చేరువయ్యేలా ప్రయత్నిస్తామని చెబుతున్న శాంతికి మనమూ ఆల్ ద బెస్ట్ చెబుదాం.

# టైల్స్ మురికిని ఇలా వదిలించండి!





టైల్స్‌ని వ్యాక్యూమ్ క్లీనర్ లేదా మెత్తని చీపురుతో ప్రతిరోజూ శుభ్రం చేయాలి. దుమ్ము, ధూళి లేకుండా పరిశుభ్రంగా ఉంచుకుంటే టైల్స్ చక్కగా మెరుస్తూ కనిపిస్తాయి.

ఒక బకెట్ గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల కల్లు ఉప్పు వేసి కరిగించాలి. ఇందులో పలుచని వస్త్రాన్ని ముంచి గట్టిగా పిండి దాంతో ఇల్లంతా తుడవాలి. టైల్స్ మీద మరకలు ఉంటే వాటి మీద కొన్ని ఉప్పు నీళ్లు చల్లి గట్టిగా రుద్ది తుడవాలి. ప్రతిరోజూ ఇలా చేస్తూ ఉంటే టైల్స్ మీద చేరే బ్యాక్టీరియా పూర్తిగా నశిస్తుంది.

బకెట్ నీళ్లలో కొద్దిగా టూత్‌పేస్టు వేసి కలపాలి. ఇందులో ముంచిన మాప్‌తో టైల్స్‌ని తుడిస్తే మంచి ప్రయోజనం కనిపిస్తుంది.

ఒక కప్పు వేడినీటిలో అర కప్పు వైట్ వెనిగర్, ఒక చెంచా బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక బకెట్ నీళ్లలో వేసి కలపాలి. ఇందులో ముంచిన మాప్‌తో ఇల్లంతా తుడిస్తే... టైల్స్ మీద మురికి మొత్తం తొలగిపోయి కొత్తవాటిలా మెరుస్తాయి.

రెండు చెంచాల హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణంలో ఒక చెంచా బేకింగ్ సోడా వేసి కలపాలి. ఈ పేస్టుని టైల్స్ మధ్య కనిపించే మురికి మీద రాయాలి. రెండు నిమిషాల తరవాత పొడి వస్త్రంతో తుడిచేస్తే మురికి మొత్తం తొలగిపోతుంది. ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం వేసి కలపాలి. ఇందులో సన్నని వస్త్రం లేదా మాప్ ముంచి దానితో టైల్స్‌ని రుద్దుతూ తుడిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

ఒక కప్పు వేడి నీటిలో ఒక కప్పు వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ఒక స్ప్రే బాటిల్‌లో పోసి ఉంచుకోవాలి. దీన్ని టైల్స్‌పై చేరిన మురికి లేదా మరకలపై కొద్దిగా స్ప్రే చేసి పాత టూత్‌బ్రష్‌తో రుద్ది వెంటనే కాగితం లేదా వస్త్రంతో తుడవాలి. తరచూ ఇలా చేస్తూ ఉంటే టైల్స్ రంగు మారకుండా ఉంటాయి.

టైల్స్‌ని శుభ్రం చేయడానికి బజార్లో దొరికే రసాయన ద్రావణాలను ఉపయోగించకపోవడమే మంచిది. వీటివల్ల అవి మెరుపుని కోల్పోతాయి.

# ఔషధాల నిధి... జామ



జామకాయలో పీచు పదార్థం అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియ సజావుగా జరిగేందుకు తోడ్పడుతుంది. మలబద్ధకం రాకుండా చేస్తుంది.

మధుమేహం ఉన్నవారు... రోజుకి ఒక జామకాయ తింటే రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణలో ఉంటుంది.

జామకాయలో బి6, నియాసిన్ విటమిన్లు ఉంటాయి. ఇవి మెదడుకి రక్తప్రసరణను పెంచుతాయి. ప్రతిరోజూ జామకాయలు తినడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

తరచూ జామకాయలు తినడం వల్ల శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. దీంతో శరీరంలో వాతం, వాపులు, కీళ్ల నొప్పులు తగ్గుతాయి. జామలోని ఎ విటమిన్... కంటిచూపుని మెరుగుపరుస్తుంది.

అల్పాహారంలో జామకాయను చేర్చుకుంటే గుండె జబ్బులు రావు. దీనిలోని పొటాషియం రక్తపోటుని అదుపులో ఉంచుతుంది. చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది.

జామకాయను తరచూ తింటూ ఉంటే చర్మం తేమతో నిండి ఆరోగ్యంగా కనిపిస్తుంది. దీనిలోని సి విటమిన్ చర్మంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో ముఖం మీద మొటిమలు, గుల్లలు, ముడతలు రాకుండా ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. సాయంత్రం వేళ జామకాయ ముక్కలు తింటే అలసట తీరుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. జామలోని మెగ్నీషియం ప్రభావవంతంగా పనిచేసి రాత్రిపూట నిద్ర బాగా పట్టేలా చేస్తుంది. మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# సజ్జ రొట్టెలు మెత్తమెత్తగా...



సజ్జ పిండిలో జీర్ణవ్యవస్థకు హాని కలిగించే గ్లూటన్ ఉండదు. ఈ పిండి శరీరానికి వెచ్చదనాన్ని అందిస్తుంది. అందుకే సజ్జ రొట్టెలు తినడం ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. సజ్జ రొట్టెలు మెత్తగా రావాలంటే ఏచిట్కాలు పాటించాలో తెలుసుకుందాం.

స్టవ్ మీద గిన్నె పెట్టి ఒక గ్లాసు నీళ్లు పోసి అరచెంచా ఉప్పు, ఒక చెంచా నెయ్యి వేసి అయిదు నిమిషాలు మరిగించి దించాలి. ఇందులో ఒక గ్లాసు సజ్జ పిండి వేసి మెల్లగా కలుపుతూ ముద్దలా చేయాలి. దీనిపై తడిగుడ్డ కప్పి పది నిమిషాలు నాననిస్తే పిండి ఉబ్బుతుంది. రొట్టెలు కూడా మెత్తగా వస్తాయి.

సజ్జ పిండిని ఎక్కువసేపు కలపకూడదు. నీళ్లు కలిసి ముద్దలా అయితే చాలు. గోధుమపిండి మాదిరి ఒత్తుతూ కలిపితే సజ్జపిండి జిగురుగా మారుతుంది. రొట్టెలు చేయడం కష్టమవుతుంది.

సజ్జ రొట్టెలను పలుచగా ఒత్తకూడదు. కొంచెం మందంగానే ఉండాలి. పొడి పిండి చల్లుకుంటూ పెద్దగా నొక్కకుండా తేలికగా ఒత్తాలి.

స్టవ్ మీద ఇనప పెనం పెట్టి అది వేడెక్కాక సజ్జ రొట్టెను జాగ్రత్తగా వేయాలి. ఒకవైపు కాలిన తరవాతే రెండోవైపుతిప్పాలి.

సజ్జ రొట్టెలు త్వరగా గట్టిపడతాయి. కాబట్టి ఎక్కువసేపు కాల్చకూడదు. రొట్టెమీద గోధుమ రంగుచుక్కలు కనిపించగానే రెండోవైపునకు తిప్పాలి. రెండు వైపులా దోరగా కాలిన తరవాత పళ్లెంలోకి తీసి కొద్దిగా నెయ్యి రాయాలి. రొట్టెలు ఆరిపోకుండా పలుచని గుడ్డ కప్పాలి. ఇలాచేస్తే చాలా సమయం వరకు రొట్టెలు మెత్తగా ఉంటాయి.





## టెస్లాపై ఆశలు వదులుకున్నట్టేనా?..

**హైదరాబాద్ - నవభూమి:**లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆ పెట్టుబడిని రాబట్టేందుకు పలు రాష్ట్రాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఉచిత భూములు, రకరకాల ప్రోత్సాహకాల ఆశ చూపడంతోపాటు తమ రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను ఎత్తిచూపుతూ ఎలాగైన పరిశ్రమను దక్కించుకొనేందుకు ఎవరి మార్గాల్లో వారు ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందా? అంటే అవుననే సమధానం వస్తున్నది. టెస్లా ప్లాంటు కోసం రాష్ట్ర సర్కారు అవసరమైన మేరకు ప్రయత్నాలు చేయకపోవడమే ఈ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నది.టెస్లా కంపెనీని ఆకర్షించేందుకు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, కర్ణాటక, తెలంగాణ సైతం రేసులో ఉన్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఇప్పటికే అనేక ఆటోమొబైల్ పరిశ్రమలు కొనసాగుతుండటం వాటికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే పలు ప్రముఖ కార్ల తయారీ కంపెనీలు ఈ రాష్ట్రాల్లో తమ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు చేస్తున్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ఐటీ పరిశ్రమలు అధికంగా ఉండటం కొంత అనుకూలాంశం కాగా, ఈ రెండు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కావడం ప్రతికూలాంశమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. పోటీలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మినహా అన్నింటికీ ఓడరేవు ఉంది. దీంతో ఎగుమతి, దిగుమతులకు ఈ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయి. అన్నిటికి మించి మన రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో టెస్లాతో సంప్రదింపులు జరిపినప్పటికీ అనంతరం ఆ ప్రయత్నాలను కొనసాగించకుండా వదిలేసిందని అంటున్నారు. ముఖ్యంగా ఓడరేవు లేకపోవడం, ఎన్డీఏ కూటమిలోని రాష్ట్రాలతో మనం పోటీ పడే అవకాశం లేదనే భావన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు తెలిసింది.




## డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా.. ఈ టూ వీలర్స్‌పై జాలీగా రైడ్ చేయవచ్చు..



**న్యూఢిల్లీ-నవభూమి:**నిత్యావసరాల్లో ఇంధన ఖర్చులు భాగమయ్యాయి. ఎప్పటికప్పుడు డీజిల్, పెట్రోల్ రేట్లు విపరీతంగా పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాల వారి బడ్జెట్ గతి తప్పుతోంది. అందుకే ఎలక్ట్రిక్ స్కూటర్లకు మార్కెట్లో డిమాండ్ నానాటికీ పెరిగిపోతోంది. ఇంధనంతో పనిలేకుండా విద్యుత్ ఛార్జింగ్‌తో నడిపే వెసులుబాటే ప్రజలు వీటి వైపు మొగ్గుచూపడానికి ప్రధాన కారణం. ఇక పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించేందుకు తోడ్పడే ఈవీ స్కూటర్ల వాడకాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు శ్రమిస్తున్నాయి. మరి, తక్కువ ధరలోనే లైసెన్స్ అవసరం లేకుండా క్వాలిటీ బ్యాటరీ, మంచి స్పీడ్, మైలజ్, కాలుష్యరహితమైన ఈ బెస్ట్ ఈవీ స్కూటర్లపై ఓ లుక్కేయండి..

పెట్రోల్ లేదా డీజిల్‌తో నడిచే టూ వీలర్స్ కంటే ఈవీ వాహనాలకు అయ్యే ఖర్చు తక్కువ. నిజానికి, 1988 మోటారు వాహనాల చట్టం ప్రకారం.. 25 కిలోమీటర్ల గరిష్ఠ వేగం, 250 వాట్ల కంటే తక్కువ శక్తి కలిగిన వాహనాలను డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే డ్రైవ్ చేయవచ్చు. ఇక ఈ మధ్య కాలంలో మంచి రేంజ్ ఇచ్చేందుకు ఈవీ స్కూటర్లలో అధిక శక్తిగల మోటార్లను వినియోగిస్తున్నారు. అలాంటి 4 అత్యుత్తమ మోడళ్ల గురించి తెలుసుకుందాం..

**లోహియా ఓమా స్టార్**

దీని ప్రారంభ ధర రూ. 51,750లు. బ్యాటరీ 3 సంవత్సరాల వారంటీ ఇస్తారు. 4.5 నుండి 5 గంటల్లో పూర్తిగా ఛార్జ్ అవుతుంది. ఇంధన సామర్థ్యం 4.5 లీటర్లు. 70 కి.మీ రేంజ్‌తో గంటకు 25 కి.మీ వేగంతో వెళుతుంది.

**ఆంపియర్ రియో ఎలైట్**

ఆంపియర్ రియో ఎలైట్ స్కూటర్ ధర రూ.42,999 నుంచి ప్రారంభమవుతుంది. బరువు 94 కిలోలు. వారంటీ 3 సంవత్సరాలు. 60%ఎ, 20ూష్ట్ర% లిథియం-అయాన్ బ్యాటరీ ఉంటుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 60 కి.మీ. వరకు వెళుతుంది. 4-5 గంటల్లో పూర్తి ఛార్జ్ అవుతుంది. గరిష్ఠ వేగం గంటకు 25 కి.మీ. ఎరుపు, నీలం, తెలుపు, నలుపు రంగుల్లో లభ్యమవుతుంది.


**కోమాకి ఎక్స్‌జీటీ కేఎం**

కోమాకి ఎక్స్‌జీటీ కేఎం ఈవీ ప్రారంభ ధర రూ.60,279. ఒకసారి ఛార్జ్ చేస్తే 100కి.మీ వెళ్తుంది. వేగం గంటకు 60 కిలోమీటర్లు. . 4-5 గంటల్లో పూర్తిగా ఛార్జ్ అవుతుంది. ఇది 130-150 కి.మీ రేంజ్ అందిస్తుంది. బ్యాటరీకి 1 సంవత్సరం వారంటీ ఇస్తారు.

**ఒకినావా ఆర్30**

ఒకినావా ఆర్30 ఎలక్ట్రిక్ స్కూటీ ప్రారంభ ధర రూ.61,998 వరకు ఉంటుంది. . 3 సంవత్సరాల పాటు బ్యాటరీకి వారంటీ వస్తుంది. 250 వాట్ల శక్తితో నడిచే ఈ స్కూటర్ 60 కి.మీ రేంజ్ ఇస్తుంది. గంటకు 25 కి.మీ వేగంతో వెళ్లవచ్చు. 5 గంటల్లో ఛార్జ్ అవుతుంది.ఇండియాలో పోటీలేని టాప్ బిజినెస్ ఇదే.. తక్కువ ఖర్చు.. అధిక లాభాలు..

## ఇండియాలో పోటీలేని టాప్ బిజినెస్ ఇదే.. తక్కువ ఖర్చు.. అధిక లాభాలు..




**న్యూఢిల్లీ-నవభూమి:**ఈ కంపెనీ ప్రారంభిస్తే వ్యాపారవేత్తగా మీకు లాభాల పంట పండటం ఖాయం. ఇదొక్కటేనా.. పర్యావరణవేత్తగానూ అందరూ మిమ్మల్ని ఆకాశానికెత్తేస్తారు. 140కోట్లకు పైగా జనాభా ఉన్న ఇండియాలో ప్రతి రోజూ వేల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతుంటాయి. కంప్యూటర్లు, ఫోన్లు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ప్రింటర్లు, స్కానర్లు ఇలా ఎన్నో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పెద్ద మొత్తంలోనే పేరుకుపోతున్నాయి. వీటిని రీసైకిల్ చేసే బిజినెస్ స్టార్ట్ చేస్తే కోట్లలో ఆదాయం రావడం ఖాయం. ఎందుకంటే, మన దేశంలో ఇలాంటి కంపెనీలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయి. మీరు చేయాల్సిన పనల్లా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడమే.. మరి, ఈ బిజినెస్ ఎలా మొదలుపెట్టాలంటే..

ప్రస్తుతం భారతదేశంలో ఒక రోజులోనే 26 వేల టన్నులకు పైనే ప్లాస్టిక్ వ్యర్థాలు పోగవుతున్నాయి. ఇందులో దాదాపు సగం రీసైక్లింగ్ చేయకుండా వదిలేస్తున్నారు. ఎలక్ట్రానిక్ వేస్ట్ కూడా ఏటా సుమారు 20 లక్షల టన్నులు వస్తోంది. ఈ వేస్టేజ్ మొత్తాన్ని సేకరించడమే మీరు చేయాల్సిన ముఖ్యమైన పని. ఈ విషయంలో మీరు సఫలమైతే ఈ వ్యాపారంలో వెనుతిరిగి చూడాల్సిన అవసరం ఎప్పటికీ రాదు. ఇందుకు రాజస్థాన్‌కు చెందిన రాజ్ కుమార్ బెస్ట్ ఎగ్జాంపుల్. ఐటీ రంగం కారణంగా పెరిగిపోతున్న ఈ- వేస్ట్ రీసైకిల్ కావట్లదనే ఆవేదనతో.. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో తాను భాగం కావాలనుకున్నాడు. ఉద్యోగం వదులుకుని మరీ మొదట రాజస్థాన్‌లోని కుషేరాలో ఒక ప్లాంట్.. తర్వాత హర్యానాలోని గురుగ్రామ్‌లో మరో భారీ రీసైక్లింగ్ ప్లాంట్ నెలకొల్పాడు. ప్రస్తుతం 200కు పైగా కంపెనీలతో టై అప్ అయ్యి.. ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యాపారాన్ని దాదాపు రూ.30 కోట్ల టర్నోవర్‌కు చేర్చాడు.

**ప్లాస్టిక్ లేదా ఈ-వేస్ట్ రీసైక్లింగ్ బిజినెస్ ఇలా ప్రారంభించండి..**

చాలా కంపెనీలు ఈ- వ్యర్థాలను సాధారణంగా స్టోర్ రూంలో ఉంచి కొన్నాళ్లయ్యాక చెత్తలో పడేస్తుంటారు. వీటిని కొనుగోలు చేస్తే ఇరువురికి లాభాలు ఉంటాయి. పర్యావరణానికి మేలు జరుగుతుంది.

స్థానికంగా ఉండే ఐటీ, ఆటోమొబైల్, కన్సల్టింగ్, ఫార్మాస్యూటికల్స్, ఫైనాన్షియల్ సెక్టార్, టెలికమ్యూనికేషన్స్, కన్స్యూమర్ గుడ్స్, హెవీ ఇండస్ట్రీస్ తదితర రంగాలకు చెందిన కంపెనీలతో ఈ-వేస్ట్ అమ్మేలా డీలింగ్ కుదుర్చుకోండి. వీటిని సేకరించాక మీరు ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా రీసైక్లింగ్ చేసి.. తిరగి ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ సంస్థలకు ముడిపదార్థాలుగా మంచి రేటుకు అమ్ముకోవచ్చు.

**ముద్ర రుణాలు:** ఈ తరహా వ్యాపారాల కోసం కేంద్రప్రభుత్వం ముద్ర స్కీం కింద రూ.50,000 నుంచి రూ.10 లక్షల వరకూ లోన్ అందిస్తోంది. ఈ డబ్బుతో రీసైక్లింగ్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేసి వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు.రిజిస్ట్రేషన్ : వ్యాపారం ప్రారంభించే ముందుగా మీ సేవ కేంద్రానికి వెళ్లి కంపెనీ పేరు రిజిస్ట్రేషన్ చేయించుకుంటే ఓ పాన్ కార్డ్ ఇస్తారు. నలుగురి కంటే ఎక్కువమంది పనివారిని పెట్టి బిజినెస్ స్టార్ట్ చేస్తుంటేలేబర్ సర్టిఫికేట్ తప్పక తీసుకోవాలి. మీ సేవా కేంద్రం ద్వారా పెట్టుబడి ఖర్చు, ప్రభుత్వ సబ్సిడీ, రీసైక్లింగ్ యంత్రాలు ఎలా పొందాలి.. తదితర పూర్తి వివరాలు విచారించుకోవచ్చు.

## ఏడాదికి రూ. 80 వేల పెట్టుబడి.. సిప్ .. సుకన్య సమృద్ధి.. 15 ఏళ్లకు దేంట్లో ఎక్కువ రాబడి వస్తుంది?




**న్యూఢిల్లీ-నవభూమి:** మీరు సంపాదించే దాంట్లో నుంచే పొదుపు చేసి దానిని మదుపు చేస్తున్నారా.. ఇలా చేయకుంటే ఇక నుంచైనా దీని గురించి ప్లాన్ చేయండి. చిన్న వయసు నుంచే పెట్టుబడులు పెడుతుంటే దీర్ఘకాలంలో మంచి రిటర్న్ అందుకునే అవకాశం ఉంటుందని చెప్పొచ్చు. ఇక ఇందుకోసం ఏయే పథకాల్ని ఎంచుకోవాలో ఆలోచిస్తున్నారా..? ఇప్పుడు లాంగ్ టర్మ్‌లో అద్భుతమైన రిటర్న్ అందుకునేందుకు మనకోసం ఉన్న ఆప్షన్స్ గురించి చూద్దాం. వీటిల్లో రెండు పాపులర్ స్కీమ్స్.. మ్యూచువల్ ఫండ్స్‌లోని సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ చిన్న మొత్తాల పొదుపు పథకాల్లోని సుకన్య సమృద్ధి యోజన ఇవి రెండూ కూడా దీర్ఘకాలంలో బంపర్ రిటర్న్ అందించేందుకు అవకాశం ఉన్న ఆప్షన్లేనని చెప్పొచ్చు.

ఇప్పుడు మీరు ఉదాహరణకు సంవత్సరానికి రూ. 80 వేల చొప్పున పెట్టుబడి పెట్టాలనుకుంటే.. 15 సంవత్సరాల్లో ఈ రెండింట్లో దేంట్లో రిటర్న్ ఎలా ఉంటాయో తెలుసుకుందాం. దేంట్లో ఎక్కువ రాబడి ఉంటుంది. దేంట్లో బెనిఫిట్స్ ఏంటి? రిస్క్ ఎక్కడ ఎలా ఉంటుంది.. పూర్తి వివరాలు చూద్దాం.

సిప్ అంటే క్రమానుగత పెట్టుబడి విధానం. ఇది మ్యూచువల్ ఫండ్లలో ఎక్కువగా వాడుతుంటారు. ఇక్కడ నిర్దిష్ట మొత్తాన్ని నెలవారీగా, 3 నెలలు లేదా 6 నెలలు, ఏడాదికోసారి ఇలా రెగ్యులర్ ఇంటర్వెల్స్‌లో ఇన్వెస్ట్ చేస్తుంటారు. ఇక్కడ మ్యూచువల్ ఫండ్లలో సిప్ విధానంలో కాంపౌండింగ్ ఎఫెక్ట్ కారణంగా దీర్ఘకాలంలో సంపద పెరిగేందుకు కారణమవుతుంది. ఇక్కడ మార్కెట్‌తో లింక్ అయి ఉంటుంది కాబట్టి రిస్క్ ఉంటుందని చెప్పొచ్చు. కానీ దీర్ఘకాలంలో మాత్రం మంచి రిటర్న్ వస్తుంటాయని నిపుణులు చెబుతుంటారు. ఇక్కడ కచ్చితమైన రిటర్న్ ఎంతో చెప్పలేం. దాని పెర్ఫామెన్స్‌పై ఆధారపడి ఉంటుంది.ఉదాహరణకు మీరు సిప్‌లో ఏడాదికి రూ. 80 వేల చొప్పున పెట్టుబడి పెడితే 15 ఏళ్లకు నెలకు రూ. 6667 చొప్పున పడుతుంది. ఇక్కడ మొత్తం 15 ఏళ్లకు పెట్టుబడి రూ. 12 లక్షలు అవుతుంది. ఉదాహరణకు సగటున 12 శాతం వార్షిక రాబడి చొప్పున అంచనా వేస్తే ఈ మొత్తం 15 ఏళ్లలో రూ. 31.73 లక్షలు అవుతుంది. అంటే రూ. 19 లక్షలకుపైగా లాభం వచ్చిందన్నమాట. 12 శాతానికి మించి కూడా రిటర్న్ ఆశించవచ్చు. దీనిని బట్టి రాబడి ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే రిస్క్‌ను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది.

సుకన్య సమృద్ధి యోజన


%ఇక సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రభుత్వ మద్దతు ఉన్న స్కీమ్. ఇది కేవలం ఆడపిల్లల కోసం ఉద్దేశించిన స్కీమ్. ఇక్కడ నిర్దిష్ట వడ్డీ రేట్లను బట్టి గ్యారెంటీ రిటర్న్ వస్తాయి. ప్రస్తుతం 8.20 శాతం వడ్డీ రేటు ఉంది. ఇక్కడ టాక్స్ బెనిఫిట్స్ ఉంటాయి. పాత పన్ను విధానం కింద.. ఆర్థిక సంవత్సరంలో రూ. 1.50 లక్షల పెట్టుబడులపై పన్ను మినహాయింపు పొందొచ్చు. పాప పదేళ్ల లోపు ఇందులో చేర్పించాలి. వరుసగా 15 ఏళ్లు కట్టాలి. మెచ్యూరిటీ పీరియడ్ 21 ఏళ్లు. అంటే అకౌంట్ తెరిచిన 21 ఏళ్లకు చేతికి డబ్బులొస్తాయి. ఇక్కడ కనీసం ఆర్థిక సంవత్సరంలో రూ. 250 చొప్పున ఇన్వెస్ట్ చేయొచ్చు. గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు.పాపకు 18 ఏళ్లు వచ్చాక లేదా పదో తరగతి పూర్తయ్యాక 50 శాతం వరకు డబ్బుల్ని ఉపసంహరించుకోవచ్చు. పాపకు 18 ఏళ్లు దాటక పెళ్లయితే.. పూర్తి డబ్బుల్ని మెచ్యూరిటీకి ముందే తీసుకోవచ్చు. ఇక్కడ ఉదాహరణకు ఏడాదికి రూ. 80 వేల చొప్పున ఇన్వెస్ట్ చేస్తే.. 15 ఏళ్లకు ప్రస్తుత 8.20 శాతం వడ్డీ రేటు ప్రకారం.. పెట్టుబడి రూ. 12 లక్షలపై.. మెచ్యూరిటీకి రూ. 36.94 లక్షలు వస్తాయి. వడ్డీతోనే రూ. 25 లక్షల వరకు అందుకోవచ్చన్నమాట. అంటే ఇక్కడ రిస్క్ తీసుకొని అయినా సరే అనుకుంటే సిప్ బెస్ట్ ఛాయిసే కానీ.. సుకన్య సమృద్ధితో రిస్క్ లేకుండా గ్యారెంటీగా పెద్ద మొత్తంలో రిటర్న్ వస్తాయని చెప్పొచ్చు.

## ఈ బ్యాంకుల్లోనే అధిక వడ్డీ రేట్లు..
# 10 లక్షలు జమ చేస్తే ఎంతొస్తుంది?



**న్యూఢిల్లీ-నవభూమి:**చాలా కాలం తర్వాత రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొద్ది రోజుల కిందట కీలక రెపో రేట్లు తగ్గించింది. 6.50 శాతం నుంచి 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించి 6.25 శాతానికి తీసుకొచ్చింది. ఇదే సమయంలో బ్యాంకులు లెండింగ్ రేట్లను తగ్గించాల్సి వస్తోంది. అంటే హోం లోన్, పర్సనల్ లోన్, వెహికిల్ లోన్ వంటి వాటి ఈఎంఐ తగ్గుతుంది. లేదా లోన్ టెన్యూర్ తగ్గుతుంది. అయితే.. ఇదే సమయంలో బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఇంత కాలం అత్యధిక వడ్డీ రేట్లు ఆఫర్ చేయగా.. ఇప్పుడు క్రమంగా తగ్గిస్తూ వస్తుంటాయి. ఇప్పటికే చాలా బ్యాంకులు ఇలా చేయగా.. ఇంకొన్ని బ్యాంకులు కూడా తగ్గించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటికీ ఏడాది టెన్యూర్ డిపాజిట్లపై చాలా బ్యాంకులు ఆకర్షణీయ స్థాయిలోనే వడ్డీ రేట్లు అందిస్తున్నాయి. వీటి గురించి తెలుసుకుందాం.ఇప్పుడు రూ. 3 కోట్లకు లోబడిన రిటైల్ టర్మ్ డిపాజిట్లపై ఏడాది టెన్యూర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. అన్ని బ్యాంకుల్లోనూ జనరల్ సిటిజెన్స్ వడ్డీ రేట్లు చూద్దాం. వీరి కంటే సీనియర్ సిటిజెన్లకు దాదాపు ప్రతి బ్యాంకులో కూడా దాదాపు 50 బేసిస్ పాయింట్ల వరకు వడ్డీ అధికంగా వస్తుందని చెప్పొచ్చు.బంధన్ బ్యాంకు ఏడాది ఎఫ్‌డీపై సాధారణ ప్రజలకు 8.05 శాతం వడ్డీ రేటు ఆఫర్ చేస్తోంది. ఇక్కడ రూ. 10 లక్షలు జమ చేస్తే సంవత్సరంలో రూ. 80,277 వడ్డీ వస్తుంది. ఇండస్‌ఇండ్ బ్యాంకులో సంవత్సరం వ్యవధి డిపాజిట్లపై 7.75 శాతం వడ్డీ రేటు ఉంది. ఇక్కడ కూడా రూ. 10 లక్షలు ఒకేసారి డిపాజిట్ చేసినట్లయితే రూ. 77,287 వడ్డీ అందుతుంది. యెస్ బ్యాంకులో కూడా ఇదే స్థాయిలో వడ్డీ రేట్లు ఉన్నాయి. కాబట్టి రిటర్న్ ఇలాగే ఉంటాయని చెప్పొచ్చు.ఆర్బీఎల్ బ్యాంకులో ఏడాది డిపాజిట్లపై వడ్డీ రేటు ప్రస్తుతం 7.50 శాతంగా ఉంది. ఇక్కడ 10 లక్షలు జమ చేసిన వారికి మెచ్యూరిటీకి రూ. 74,793 వడ్డీ అందుతుంది. కర్ణాటక బ్యాంకులో ఏడాది టెన్యూర్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై వడ్డీ రేటు 7.25 శాతంగా ఉంది. ఇక్కడ రూ. 10 లక్షలు డిపాజిట్ చేస్తే మెచ్యూరిటీకి చేతికి రూ. 72,305 వడ్డీ వస్తుంది. డీసీబీ బ్యాంకులో ఏడాది ఎఫ్‌డీపై 7.10 శాతం వడ్డీ రేటు ఉండగా 10 లక్షలు జమ చేసిన వారికి చేతికి రూ. 70,807 వడ్డీ అందుతుంది. సీనియర్ సిటిజెన్లకు ఇంకా ఎక్కువ వడ్డీ వస్తుందని చెప్పొచ్చు.

## కొత్త పన్ను శ్లాబులతో కన్ఫ్యూజన్ ఉందా? మీ ఆదాయంపై ఎంత పన్ను కట్టాలి.. ఇదిగో ఫుల్ క్లారిటీ..!





**న్యూఢిల్లీ-నవభూమి:** కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తూ.. కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక ప్రకటనలు చేసిన సంగతి తెలిసిందే. టాక్స్ రిబేట్ అంతకుముందు రూ. 7 లక్షల వరకు ఆదాయంపై ఉండగా.. ఇప్పుడు రూ. 12 లక్షలకు పెంచారు. దీని కింద రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారు ఎలాంటి చెల్లించాల్సిన అవసరం లేదు. ఇంకా.. స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75 వేలు ఎలాగూ ఉంది. దీంతో రూ. 12.75 లక్షల వరకు పన్ను పడదని గుర్తుంచుకోవాలి. ఇంకా.. ఇదే కొత్త పన్ను విధానంలో టాక్స్ శ్లాబుల్ని కూడా సవరించిన సంగతి తెలిసిందే. ఇక్కడ ముఖ్యంగా శ్లాబుల సంఖ్య పెరిగింది. అంతకుముందు 6 శ్లాబులు ఉండగా.. ఇప్పుడు ఏడుకు పెంచారు. మరోవైపు కనీస పన్ను మినహాయింపు పరిమితి గతంలో రూ. 3 లక్షలుగా ఉండగా.. ఇప్పుడు రూ. 4 లక్షలకు పెంచారు. అయితే.. రూ. 12 లక్షల వరకు నో టాక్స్ అని.. మళ్లీ రూ. 4-8 లక్షలకు 5 శాతం, 8-12 లక్షలకు 10 శాతం టాక్స్ రేట్లు ఏంటి అని అంతా గందరగోళానికి గురవుతున్నారు. దీని గురించి ఇప్పుడు క్లారిటీగా తెలుసుకుందాం.

పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపులు (టాక్స్ డిడక్షన్స్) ఉండేవి. అదే కొత్త పన్ను విధానంలో ఇవేమీ లేవు. ఇక్కడ స్టాండర్డ్ డిడక్షన్ కింద రూ. 75 వేలు మాత్రం తగ్గించుకోవచ్చు. అంటే మీ జీతం నుంచి రూ. 75 వేలు స్డాండర్డ్ డిడక్షన్ తగ్గించుకొని.. ఆ ఆదాయంపై టాక్స్ లెక్కించుకోవాలి. ఇప్పుడు రూ. 12 లక్షల్ని పన్ను ఆదాయంగా పరిగణిస్తారు. ఈ లిమిట్ మేరకు వర్తించే పన్నును ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 87 కింద రిబేటు మినహాయిస్తారు. కాబట్టి.. రూ. 12.75 లక్షల వరకు ఆదాయం ఉంటే టాక్స్ పడదు. అదే రూ. 12.75 లక్షలపై ఒక్క రూపాయి దాటినా కూడా రిబేట్ వర్తించదు. అప్పుడు టాక్స్ లెక్కలు వర్తిస్తాయి.

ఇప్పుడు కొత్త పన్ను విధానంలో పన్ను వర్తించని ఆదాయం రూ. 7.75 లక్షలు (స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75 వేలు కలిపి) ఉంది. ఇక్కడ సెక్షన్ 87%ూ% కింద రిబేట్ రూ. 25 వేలుగా ఉంది.ఇదే ఇప్పుడు రూ. 12 లక్షలపై చూస్తే.. ఉదాహరణకు వ్యక్తి ఆదాయం రూ. 12.75 లక్షలు అనుకుంటే.. అప్పుడు స్టాండర్డ్ డిడక్షన్ రూ. 75 వేలు తీసేయాలి. ఇంకా రూ. 12 లక్షలు ఉంటుంది. దీనిపై పన్ను శ్లాబుల ప్రకారం లెక్కిస్తే రూ. 60 వేలు టాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఎలా లెక్కించాలంటే ముందుగా 4 లక్షల వరకు నో టాక్స్.. 12 లక్షల నుంచి 4 లక్షలు తీసేస్తే రూ. 8 లక్షలు అవుతుంది. తర్వాత రూ. 4-8 లక్షలపై 5 శాతం (రూ. 20 వేలు), మళ్లీ రూ. 8-12 లక్షలపై 10 శాతం (రూ. 40 వేలు) ఇలా మొత్తం రూ. 60 వేలు వాస్తవంగా చెల్లించాలి. సెక్షన్ 87%ూ% కింద రిబేట్ ఉంది కాబట్టి ఇక్కడ పైసా పన్ను పడదన్నమాట.

ఇలాగే ఇతర ఆదాయాలపైనా లెక్కించుకోవచ్చు. నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో చెప్పినట్లుగానే.. రూ. 18 లక్షల వార్షికాదాయంపై ఏకంగా రూ. 70 వేలు పన్ను ఆదా చేసుకోవచ్చు. ఇక్కడ స్టాండర్డ్ డిడక్షన్ చేస్తే వచ్చే రూ. 17,25,000 పై చెల్లించాల్సిన పన్ను రూ. 1,22,500 టాక్స్ పడుతుంది. అదే పాత లెక్కల ప్రకారం ఇది రూ. 1,92,500 అంటే రూ. 70 వేలు ఆదా అవుతుంది. ఇలాగే రూ. 25 లక్షల ఆదాయంపై ఏకంగా రూ. 1.10 లక్షలు పన్ను ఆదా చేసుకోవచ్చు. ఇక్కడ రూ. 25.75 లక్షలపై అంతకుముందు రూ. 4.4 లక్షలుగా ఉండగా.. ఇప్పుడు రూ. 3.3 లక్షలకు తగ్గుతుంది.

మిగతా ఆదాయాల విషయానికి వస్తే.. రూ. 8 లక్షలు, రూ. 9 లక్షలు, 10 లక్షలు, 11 లక్షలు, 12 లక్షలు ఇలా దేనిపైనా పైసా పన్ను కట్టక్కర్లేదు. దీనికి అదనంగా రూ. 75 వేల సంపాదనపైనా పన్ను పడదు. అంటే రూ. 15.75 లక్షల వరకు ఆదాయంపై ఇప్పుడు టాక్స్ రూ. 1.40 లక్షలుగా ఉండగా.. ప్రతిపాదించిన శ్లాబ్స్‌తో రూ. 1.05 లక్షలకు తగ్గుతుంది. అంటే రూ. 35 వేలు ఆదా అవుతుంది. ఇక రూ. 16 లక్షలు అంటే ఇక్కడ ప్రస్తుతం రూ. 1,70,000 పన్ను చెల్లించాల్సి ఉంటే.. ప్రతిపాదించిన కొత్త శ్లాబులతో రూ. 1,20,000 మాత్రమే పడుతుంది. రూ. 50 వేలు ఆదా చేసుకోవచ్చు. ఇలాగే రూ. 20 లక్షలపై అయితే రూ. 90 వేలు ఆదా చేసుకోవచ్చు. చెల్లించాల్సిన పన్ను కొత్త శ్లాబులతో రూ. 2 లక్షలుగా ఉంది.




## బంగారం, వెండి ధరలు ఎంతకు పెరిగాయో తెలుసా..



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం ధరలు కొన్ని రోజులుగా తగ్గుతూ పెరుగుతూ వస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో మ్నెత్తానికి పసిడి రేట్లు పైపైకి ఎగబాకుతున్నాయి. కాగా, ఆదివారం ఉదయం 06:30 గంటల సమయానికి https://bullions.co.in ప్రకారం.. ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.77,147 ఉండగా.. 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.84,160గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.77,275 కాగా.. 24 క్యారెట్ల తులం పసిడి ధర రూ.84,300గా ఉంది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.77,403కు చేరుకోగా.. 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.84,440 వద్ద కొనసాగుతోంది.ఇక, వెండి విషయానికి వస్తే ఢిల్లీలో కిలో వెండి ధర రూ.93,930గా ఉంది. ఆర్థిక రాజధాని ముంబైలో కేజీ వెండి రూ.94,090కు చేరింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో రూ. 94,240గా ఉంది.

ప్రధాన నగరాల్లో బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు ఇవే..

బెంగళూరు- రూ.77,339, రూ.84,370
కోల్‌కతా- రూ.77,174, రూ.84,190
చెన్నై- రూ.77,504, రూ.84,550
పుణె- రూ.77,275 రూ.84,300
భోపాల్- రూ.77,358, రూ.84,390
ముంబై- రూ.77,275, రూ.84,300
భువనేశ్వర్- రూ.77,303, రూ.84,330
కోయంబత్తూర్- రూ.77,504, రూ.84,550
జైపూర్- రూ.77,266, రూ.84,290
దిస్పూర్- రూ.77,440, రూ.84,480

## సిప్' కొనసాగించాలా.. వద్దా?

**న్యూఢిల్లీ-నవభూమి:**స్టాక్ మార్కెట్ ప్రస్తుతం 'బేర్' పట్టులో ఉంది. దాదాపు ఈ ఏడాది ప్రారంభం నుంచే నష్టాల్లో కొనసాగుతూ వస్తోంది. ఈ డౌన్‌ట్రెండ్ ఇంకా ఎంత కాలమో ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ఫిబ్రవరి నెలలో సెన్సెక్స్ 5.5 శాతానికి పైగా నష్టపోయింది. బీఎసఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా రూ.40 లక్షల కోట్లకు పైగా ఆవిరైపోయింది. స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలో ఈ పతనం మరింత ఎక్కువగా ఉంది. మరి ఇలాంటప్పుడు స్మాల్ అండ్ మిడ్ క్యాప్ విభాగంలో మదుపు చేసే మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) నిర్వహించే క్రమానుగత పెట్టుబడి పథకాల్లో (సిప్) కొనసాగాలా? వద్దా? అనే ప్రశ్న మదుపరుల్లో తలెత్తుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదుపరులు అనుసరించాల్సిన వ్యూహం ఏమిటో ఓసారి పరిశీలిద్దాం.

ప్రస్తుత మార్కెట్ పతనాన్ని చూసి సిప్ ఆపటం ఏ మాత్రం మంచిది కాదు. నెలనెలా అందే సిప్ మొత్తాలను ఫండ్ మేనేజర్లు ఎప్పటికప్పుడు తమదైన పెట్టుబడి వ్యూహంతో మంచి కంపెనీల షేర్లలో మదుపు చేస్తుంటారు. మార్కెట్ ఆటుపోట్లకు లోనైంత మాత్రాన ఈ ఫండ్స్ దీర్ఘకాలిక రాబడులు దెబ్బతింటాయని భావించలేం. కాకపోతే ఇది ఒక కుదుపు మాత్రమే. దీర్ఘకాలిక పొదుపు, సంపద సృష్టికి స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలో మదుపు చేసే ఎంఎఫల 'సిప్' చక్కటి పెట్టుబడి సాధనమనే విషయం మర్చిపోవద్దు. కాకపోతే ఫండ్ పనితీరుతో పాటు ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డునీ ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.లార్జ్ క్యాప్ షేర్లతో పోలిస్తే చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో రాబడులు ఎక్కువ. కాకపోతే ఇందుకు ఓర్పు కూడా అవసరం. మిడ్ అండ్ స్మాల్ క్యాప్ ఫండ్స్‌కూ ఇది వర్తిస్తుంది. కనీసం పదేళ్లపాటైనా ఈ ఫండ్స్‌లో 'సిప్' పెట్టుబడులు కొనసాగిస్తే, పెద్దగా నష్ట భయం లేకుండా బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు పొందవచ్చు.

ఏ పెట్టుబడి అయినా అవసరమైనప్పుడు వెంటనే అమ్ముకుని నగదు చేసుకునే సౌలభ్యం ఉండాలి. స్మాల్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లలో మదుపు చేసే ఈక్విటీ పథకాలకూ ఇది వర్తిస్తుంది. సాధారణంగా ఫండ్ మేనేజర్లు తమ మొత్తం పెట్టుబడుల్లో కనీసం 15 నుంచి 20 శాతం నిధులను నగదు రూపంలో ఉంచుకుంటారు.

ఎప్పుడు ఏ రిడెంప్షన్ ఒత్తిడి వచ్చినా తట్టుకునేందుకు ఈ నిధులు ఉపయోగపడతాయి. మార్కెట్ దిద్దుబాటులో ఉన్నప్పుడు ఇది మరింత అవసరం.ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని మదుపరులు ప్రస్తుతం మార్కెట్ పతనంలోనూ చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్లలో మదుపు చేసే ఈక్విటీ పథకాల్లో సిప్ పెట్టుబడులు కొనసాగించడమే మంచిది.

# మరో మూడు మృతదేహాల వెలికితీత.. ఏడుకు పెరిగిన ఉత్తరాఖండ్ మృతుల సంఖ్య

**న్యూఢిల్లీ-నవభూమి:** ఉత్తరాఖండ్ లోని చమోలి జిల్లా మనా గ్రామంలో మంచు చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు పెరిగింది. రెస్క్యూ సిబ్బంది మంచుదిబ్బల కింద నుంచి ఆదివారం మరో మూడు మృతదేహాలను వెలికితీశారు. దాంతో మొత్తం మృతుల సంఖ్య ఏడుకు చేరింది. రెండు రోజుల క్రితం బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ కార్మికుల శిబిరంపై మంచు చరియలు విరిగిపడ్డాయి. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు.



%ఆచూకీ దొరకని మరో మృతదేహం కోసం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతున్నది. బీఆర్వో కార్మికులు మంచు తొలగించే పనుల్లో ఉండగా మంచు చరియలు విరిగిపడి 58 మంది అందులో కూరుకుపోయారు. వెంటనే ఆర్మీ, సహాయక బృందాలు రంగంలోకి దిగి 54 మందిని కాపాడారు. వారిని ఎయిర్‌లిఫ్ట్‌తో జోషి మఠ్ ఆర్మీ ఆసుపత్రికి తరలించారు. వారిలో తీవ్రంగా గాయపడిన నలుగురు కార్మికులు చికిత్స పొందుతూ మృతిచెందారు.

# మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌కు మాయావతి షాక్.. అన్ని పార్టీ పదవుల నుంచి తొలగింపు



**లక్నో-నవభూమి:** ఉత్తరప్రదేశ్‌కు చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి ఆదివారం సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆమె రాజకీయ వారసుడిగా భావిస్తున్న మేనల్లుడు ఆకాష్ ఆనంద్‌ను మరోసారి అన్ని పార్టీ పదవుల నుంచి తొలగించారు. ఆకాష్ తండ్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్‌ను కొత్త జాతీయ సమన్వయకర్తలుగా నియమించారు. ఆదివారం లక్నోలో జరిగిన బీఎస్పీ సమావేశంలో ఈ మేరకు పార్టీలో భారీ మార్పులు చేశారు.కాగా, బీఎస్పీ సంస్థాగత బలాన్ని బలహీనపరిచే వర్గాలను సృష్టించడం ద్వారా పార్టీలో విభజనకు అశోక్ సిద్ధార్థ్ కారణమయ్యారని మాయావతి ఆరోపించారు. పార్టీకి లేదా ఉద్యమానికి హాని కలిగించడానికి తన పేరును దుర్వినియోగం చేస్తే వారిని వెంటనే తొలగిస్తానని ఆమె స్పష్టం చేశారు.మరోవైపు ఈ సూత్రానికి అనుగుణంగా అశోక్ సిద్ధార్థ్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు మాయావతి తెలిపారు. ఆయన ప్రభావం ఉన్న అల్లుడు ఆకాష్ ఆనంద్‌ను కూడా పార్టీ బాధ్యతలన్నింటి నుంచి తొలగించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని బహుజనుల పురోగతికి మాత్రమే కాకుండా దేశ పురోగతికి ఈ మార్పు అవసరమని అన్నారు. బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతి వేడుకల ప్రణాళికలను కూడా మాయావతి వెల్లడించారు.

# జనరల్ టికెట్ ప్రయాణీకులతో రిజర్వేషన్ బోగి నిండిపోయిందా.. ఇలా చేస్తే క్షణాల్లో మీ సమస్యకు పరిష్కారం గ్యారంటీ



**న్యూఢిల్లీ-నవభూమి:**రైలు ప్రయాణంలో ఎన్నో అనుభవాలు ఎదురవుతాయి. కొన్నిసార్లు కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మరికొన్ని సందర్భాల్లో ఎప్పటికీ మర్చిపోలేని మధురానుభూతులు ఎదురవుతాయి. అదే సమయంలో కొన్ని సమస్యలతో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ప్రశాంతమైన ప్రయాణం కోసం ముందుగానే రైలు ప్రయాణం కోసం టికెట్ రిజర్వు చేసుకుంటారు ఎక్కువమంది. తమకు కేటాయించిన బెర్తులో పడుకుని గమ్యస్థానానికి చేరుకోవచ్చునుకుంటారు. కానీ మీరు రిజర్వేషన్ చేయించుకున్న మీ బెర్తు లేదా సీటు వద్దకు వెళ్లేసరికి ఇతర వ్యక్తులు కూర్చుని ఉంటారు. కొన్నిసందర్భాల్లో రిజర్వేషన్ బోగిలో జనరల్ టికెట్ ప్రయాణీకులు ఎక్కువుగా ఎక్కడం ద్వారా మీకు ఇబ్బందికలిగిస్తారు. ఆ సందర్భాల్లో ప్రయాణం విసుగుగా సాగుతుంది. ఏమి చేయాలో తోచదు. ఇబ్బందిపడుతూ ప్రయాణం చేస్తారు. మీ బెర్తు లేదా సీట్లో కూర్చున్న వ్యక్తులను లేవమంటే లేవరు. టీటీఈ ఆ సమయంలో మీకు అందుబాటులో ఉండకపోవచ్చు. అలాంటప్పుడు ఏమి చేయాలో తెలుసుకుందాం. ఎలాంటి సమస్యకైనా..భారతీయ రైల్వే ప్రయాణీకులకు అసౌర్యం కలగకుండా చూసేందుకు ఎన్నో చర్యలు తీసుకుంటోంది. వీటి గురించి కొంతమందికి తెలియకపోవడంతో ఇబ్బందులు ఎదురైనప్పుడు సర్దుకుపోతూ ప్రయాణం చేస్తారు. రిజర్వేషన్ బోగీల్లో భద్రతకు భారతీయ రైల్వే ఎంతో ప్రాధాన్యత ఇస్తుంది. జనరల్ టికెట్ ప్రయాణీకులు రిజర్వేషన్ బోగీల్లో ఎక్కితే ఫైన్ విధించడం ద్వారా అలాంటివారిని కట్టడిచేసే ప్రయత్నం చేస్తోంది. ఫైన్ కట్టినప్పటికీ రిజర్వేషన్ ప్రయాణీకుడికి ఏ ఒక్కరూ ఇబ్బంది కలిగించకూడదు. మన బెర్తు లేదా సీటు లేదా బోగీలో సాధారణ టికెట్ ప్రయాణీకులు ఎక్కినప్పుడు ఒక్క ఫిర్యాదుతో సమస్యకు క్షణాల్లో పరిష్కారం లభిస్తుంది. ఇంతకీ ఈ ఫిర్యాదు ఎలా చేయాలనే అనుమానం కలగడం సహజం. గతంలో రైల్వే మంత్రిత్వశాఖకు చెందిన ట్విట్టర్ ఐడీకి ట్వీట్ చేయడం ద్వారా వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం లభించేది. ట్విట్టర్ వినియోగించే ప్రయాణీకుల సంఖ్య తక్కువుగా ఉండటంతో పాటు ట్విట్టర్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారంలో కొంత జాప్యం ఏర్పడుతుండటంతో భారతీయ రైల్వే ప్రయాణీకుల సమస్యలు, ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించేందుకు మరో సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. దాని గురించి పూర్తి వివరాలు తెలుసుకుందాం.

**కొత్త పోర్టల్**

రైల్ మదద్ పేరుతో రైల్వేశాఖ ఓ పోర్టల్ తీసుకొచ్చింది. ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే గంటలోపు సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తారు. సాధారణంగా రైలులోని రిజర్వుడు బోగిలో జనరల్ టికెట్ ప్రయాణీకులు లేదా టికెట్ లేని ప్రయాణీకులు ప్రయాణిస్తే వారిని కట్టడిచేసే బాధ్యత రైలులోని టీటీఈ, స్క్వాడ్‌పై ఉంటుంది. కానీ టీటీఈకి టికెట్లు తనిఖీ చేసే పని ఉండటంతో ఆయనపై అదనపు భారం పడుతుందనే ఉద్దేశంతో భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఆర్పీఎఫ్ సిబ్బంది ఈ విధులను నిర్వర్తిస్తారు. రైలు మదద్ పోర్టల్‌లోకి వెళ్లగానే ప్రయాణికుడి ఫోన్ నెంబర్ అడుగుతుంది. నెంబర్ ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. దానిని ఎంటర్ చేసిన తర్వాత టికెట్ పిఎన్ఆర్ నెంబర్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. పిఎన్ఆర్ ఎంటర్ చేయగానే ప్రయాణానికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. వెంటనే మన ఫిర్యాదును ఎంచుకోవాలి. భద్రతపరమైన అంశం కావడంతో సెక్యూరిటీ ఆప్షన్ ఎంచుకుని ఫిర్యాదుకు సంబంధించిన వివరాలు కింద డిస్క్రిప్షన్‌లో రాయాలి. ఆ తర్వాత మన ఫిర్యాదును సమర్పిస్తే వెంటనే ఫిర్యాదు సంఖ్య మొబైల్ నెంబర్‌కు వస్తుంది. ఈ ఫిర్యాదు వెంటనే భారతీయ రైల్వేలోని ప్రత్యేక ఫిర్యాదుల విభాగం, సహాయ కేంద్రానికి వెళు తుంది. వారు ఫిర్యాదు పరిశీలించి ప్రయాణీకుడు ప్రయాణిస్తున్న రైలు ఏ రైల్వేజోన్ పరిధిలో ఉందో చెక్ చేసి వెంటనే సమీపంలోని సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేస్తారు. రైల్వే అధికారులు ఆ రైలుకు సంబంధించి డ్యూటీలో ఉన్న సిబ్బందికి విషయాన్ని తెలియజేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు.

**ఫిర్యాదుదారుడి ఫీడ్ బ్యాక్..**

ఫిర్యాదును పరిష్కరించిన తర్వాత రైల్వే సిబ్బంది ప్రయాణికుడి ఫీడ్ బ్యాక్ తీసుకుంటారు. సమస్య పరిష్కారమైందా లేదా, రైల్వే స్పందించిన తీరుపై సంతృప్తిగా ఉన్నారా అనే విషయాలను ఫీడ్ బ్యాక్ ఫామ్‌లో అడుగుతారు. అదే సమయంలో సమస్య పరిష్కరించిన తర్వాత పురోగతిని రైల్వే సిబ్బంది ఉన్నతాధికారులకు నివేదిస్తారు. ఆ తర్వాత ఫిర్యాదును క్లోజ్ చేస్తున్నామని భారతీయ రైల్వేనుంచి ప్రయాణికుడి మొబైల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది.

# సూట్‌కేస్‌లో యువతి మృతదేహం.. కాంగ్రెస్ మహిళా కార్యకర్తగా గుర్తింపు



**చండీగఢ్-నవభూమి:** బస్టాండ్ సమీపంలో సూట్‌కేస్ పడి ఉండటం కలకలం రేపింది. తెరిచి చూసిన పోలీసులు అందులో యువతి మృతదేహం ఉండటంతో షాక్ అయ్యారు. మృతురాలిని కాంగ్రెస్ మహిళా కార్యకర్తగా గుర్తించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఆమె పాల్గొన్నట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. హర్యానాలోని రోహ్‌తక్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సాంప్లా బస్టాండ్ సమీపంలో బ్లూ కలర్‌లో ఉన్న పెద్ద ట్రావెల్ బ్యాగ్ పడి ఉంది. అనుమానించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.కాగా, పోలీసులు, ఫోరెన్సిక్ ల్యాబ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సూట్‌కేస్‌లోని యువతి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలిని 22 ఏళ్ల హిమానీ నర్వాల్‌గా గుర్తించారు. ఆమెను హత్య చేసి మృతదేహాన్ని సూట్‌కేస్‌లో కుక్కి బస్టాండ్ సమీపంలో పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మహిళ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు హతురాలు హిమానీ నర్వాల్ కాంగ్రెస్ కార్యకర్త అని ఆ పార్టీ ఎమ్మెల్యే భరత్ భూషణ్ బాత్రా తెలిపారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో ఆమె చురుకుగా పాల్గొన్నట్లు చెప్పారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల సమయంలో భూపిందర్ హుడా, దీపిందర్ హుడా ప్రచారంలో కూడా ఆమె పాల్గొన్నట్లు వెల్లడించారు.కాగా, తన కుమార్తె హిమానీ హత్యకు కాంగ్రెస్ పార్టీలోని కొంతమందికి ప్రమేయం ఉండవచ్చని ఆమె తల్లి సవితా నర్వాల్ అనుమానం వ్యక్తం చేసింది. తన కుమార్తె రాజకీయంగా ఎదుగుతుండటం చూసి కొందరు సహించలేక ఆమెను హత్య చేసి ఉంటారని ఆమె ఆరోపించింది.

# ప్రజలు అడుక్కునేందుకు అలవాటు పడ్డారు..



**న్యూఢిల్లీ-నవభూమి:**బీజేపీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ప్రహ్లాద్ పటేల్ తాజా వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ప్రజలు చేయి చాచేందుకు అలవాటు పడిపోయారన్న ఆయన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. రాజగఢ్ జిల్లాలో వీరాంగన రాణి అవంతీబాయ్ లోధీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరై ప్రసంగించిన సందర్భంగా ప్రహ్లాద్ పటేల్ ఈ వ్యాఖ్యలు చేశారు "ప్రభుత్వం నుంచి అడుక్కుని తీసుకునేందుకు ప్రజలు అలవాటు పడిపోయారు. నేతలు వచ్చినప్పుడల్లా వారికి గంప నిండుగా అర్జీలు ఇస్తుంటారు. స్టేజ్‌పైన నేతలకు పూలమాలలు వేసి చేతుల్లో అర్జీలు పెడుతుంటారు. ఇది మంచి అలవాటు కాదు. ఇలా అర్థించే బదులు ఇచ్చే అలవాటును పెంపొందించుకోవాలి. దీంతో, సమాజంలో సంస్కారం పెరగడంతో పాటు జీవితం ఆనందమయం అవుతుంది""ఇలా చేయిచాచే వారి వల్ల సమాజం బలహీనమవుతుంది. ఉచితాలపై ఆకర్షితులు కావడం ధీర మహిళల లక్షణం కాదు. అమరులను గౌరవించుకోవడం అంటే వారు చూపిన మార్గంల్లో వారి ఆదర్శాలకు అనుగూణంగా జీవించడమే. నిజమైన దేశభక్తులు చేయి చాచి అర్థించినట్టు మనం ఎక్కడైనా విన్నామా? నర్మదా పరిక్రమ యాత్రికుడిగా నేను దానాలు స్వీకరించా. కానీ అవి నా కోసం కాదు. నాకు ఏదైనా ఇచ్చానని చెప్పే వ్యక్తి ఎవరూ లేరు" అని అన్నారు.

ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు జీతూ పట్వావీ.. పటేల్ వ్యా?్యలను ఖండించారు. ఆయన రాష్ట్ర ప్రజలను అవమానించారని అన్నారు. ప్రజలను భిక్షగాళ్లనే స్థాయికి బీజేపీ వారి అహంకారం పెరిగిపోయిందని మండిపడ్డారు. ప్రజలు కష్టాలు, ఆశలు, కన్నీళ్లను అవమానించారని అన్నారు. "ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తే వాళ్లను బిక్షగాళ్లంటూ అవమానిస్తున్నారు. త్వరలో బీజేపీ నేతల ఓట్లు అడుక్కుంటూ వస్తారు" అని ఆయన అన్నారు.

# పన్నుల వాటా తగ్గితే కేంద్రంపై పోరాటమే..కర్ణాటక సీఎం సిద్దరామయ్య




**బెంగళూరు-నవభూమి:** రాష్ట్రాలకు కేంద్ర పన్నుల వాటా తగ్గిందని, ఈ అంశంలో కర్ణాటకకు అన్యాయం జరిగితే కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య స్పష్టంచేశారు. రాష్ట్రాలకు పన్నులవాటా 41శాతం నుంచి 40 శాతానికి తగ్గించేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. మోదీ ప్రధాని అయినప్పటి నుంచి రాష్ట్రాలకు ఉండే రాజ్యాంగబద్ధమైన అధికారాలను తగ్గిస్తున్నారని, బలహీనం చేస్తున్నారని తెలుస్తోందన్నారు. రాష్ట్రాలకు వాటా పంపిణీ న్యాయబద్ధంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్‌కు ఉందన్నారు. ఏటా కన్నడిగుల నుంచి రూ.4 లక్షల కోట్లు కేంద్రానికి పన్నుల రూపంలో వెళ్తోందని, రాష్ట్రానికి 15 పైసల వాటా మాత్రమే తిరిగి వస్తోందన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ పన్నులు పంచే విషయంలో 4.713 శాతం నుంచి 3.64కు తగ్గించిందని వెల్లడించారు. తద్వారా కర్ణాటక గడిచిన ఐదేళ్లలో రూ.68,775 కోట్లు కోల్పోయిందని అన్నారు. 15వ ఫైనాన్స్ కమిషన్ వ్యవధి వచ్చే ఏడాది ముగుస్తుందని, ఇప్పటివరకు కమిషన్ సిఫారసు చేసిన స్పెషల్ గ్రాంటు రూ.5495 కోట్లు, రాష్ట్రానికి కేంద్రం వాటా రూ.6 వేల కోట్ల మొత్తం విడుదల కాలేదని తెలిపారు.

# స్నానానికి పనికిరాని గంగ నీరు!


## రాష్ట్ర ఆర్థిక సర్వే నివేదిక వెల్లడి

**పట్నా-నవభూమి:** కాలుష్యం కారణంగా బిహార్‌లోని అనేక చోట్ల గంగా నది నీరు స్నానానికి పనికి రాదని రాష్ట్ర అసెంబ్లీలో ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వే 2024-25 వెల్లడించింది. నీటిలో అధిక స్థాయిలో బ్యాక్టీరియాలు (టోటల్ కోలిఫాం, ఫీకల్ కోలిఫాం) ఉన్నాయని పేర్కొంది. ఈ మేరకు బిహార్ కాలుష్య నియంత్రణ మండలి(బీఎసపీసీబీ) రాష్ట్రంలోని 34 చోట్ల పక్షం రోజులకోసారి చేసిన గంగా నది నీటి నాణ్యత పరిశీలనలో వెల్లడైందని అధికారులు తెలిపారు. గంగా నది, దాని ఉపనదుల ఒడ్డున ఉండే పట్టణాల నుంచి మురుగునీరు, ఇళ్ల నుంచి వచ్చి కలిసే వ్యర్థ నీటి కారణంగా బ్యాక్టీరియా అధిక మొత్తంలో చేరిందని సర్వే పేర్కొంది. ఇదే సమయంలో గంగా, దాని ఉపనదుల్లో పీహెచ్, డిజాల్వ్‌డ్ ఆక్సిజన్, బయో-కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ) వంటి ఇతర పారామితులు పరిమితి స్థాయిలో ఉన్నాయని, ఈ నీరు జల జీవరాశులకు, చేపల పెంపకానికి, వ్యవసాయానికి సరిపోతుందని తెలిపింది. బీఎసపీసీబీ చైర్మన్ శుక్లా మాట్లాడుతూ..

మలంలో ఈ ఫీకల్ కోలిఫాం బ్యాక్టీరియా ఉంటుందని చెప్పారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల కన్నా గంగా నదిలో చాలా చోట్ల ఫీకల్ కోలిఫాం పరిమితి మించిపోయిందని, దీంతో ఆ నీరు స్నానానికి పనికిరాదని పేర్కొన్నారు. నదిలోకి వచ్చే నీటి శుద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.



# చర్చి ఉత్సవాల్లో విషాదం..



**కన్యాకుమారి-నవభూమి:** తమిళనాడులో ఘోర విషాదం చోటు చేసుకుంది. చర్చి ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేస్తూ విద్యాదాఘాతంతో నలుగురు యువకులు మృతిచెందారు. తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి జిల్లా ఎనాయం పుతేంతురైలోని సెయింట్ ఆంథోనీ చర్చి పండగను ప్రతి ఏటా భక్తులు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇదే క్రమంలో ఈ ఏడాదీ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించాలని పాస్టర్లు భావించారు.ఈ మేరకు ఏర్పాట్లన్నీ చకాచకా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ పనుల్లో జీసస్ ఫాలోవర్లు, స్థానిక యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పండగ సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన రథం పై ఏసుక్రీస్తును ఊరేగిస్తుంటారు. దీంతో రథా నికి సుందరీకరణ పనులు చేసేందుకు కొంత మంది యువకులు ఇవాళ (ఆదివారం) ఉదయం సిద్ధమయ్యారు. పనుల కోసం ఇనుప నిచ్చెనను తీసుకెళ్తుండగా హైవోల్టేజీ వైర్లకు అది తగిలింది. దీంతో నలుగురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. గిలగిలా కొట్టుకుం టూ కాలిపోతూ ప్రాణాలు విడిచారు. కాలిపో తున్న యువకులను చూస్తూ నిస్సహాయ స్థితిలో స్థానికులు కన్నీటిప ర్యంతం అయ్యారు. మృతు లను మైఖేల్ పింటో, మరియా విజయన్, బి.శోభన్, ఆంటోనీగా పోలీసులు గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. విద్యుదాఘా తానికి సంబంధించిన వీడియోలను కొంతమంది తమ సెల్ ఫోన్లలో రికార్డు చేశారు. కాగా, ఈ దృశ్యాలు సోషల్

# పక్షిని ఢీకొట్టిన విమానం.. ఇంజిన్‌లో మంటలు.. అత్యవసర ల్యాండింగ్



**న్యూఢిల్లీ-నవభూమి:** న్యూజెర్సీలోని నెవార్క్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కాసేపటికే ఫెడెక్స్ కార్గో విమానం పక్షిని ఢీకొట్టింది. ఆ వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దాంతో విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఇంజిన్‌లో మంటలు రావడంతో విమానం నెవార్క్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యిందని న్యూయార్క్, న్యూజెర్సీ పోర్ట్ అథారిటీ ప్రతినిధి లెనిస్ వాలెన్స్ తెలిపారు.ఈ ఘటనలో విమాన సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని, మంటలు ఇంజిన్‌కు మాత్రమే పరిమితం అయ్యాయని వాలెన్స్ చెప్పారు. అత్యవసర ల్యాండింగ్ కోసం ముందు జాగ్రత్త చర్యగా విమాన రాకపో కలను కొద్దిసేపు నిలిపివేశారు. ఆ తర్వాత రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఫెడెక్స్ ప్రతినిధి మాట్లాడుతూ విమానం ఇండియా నాపోలిస్ వైపు వెళ్తుండగా ఘటన చోటుచేసుకుందని చెప్పారు.

# శిఖరాగ్ర చర్చల్లో యుద్ధం.. డొనాల్డ్ ట్రంప్-జెలెన్‌స్కీ మధ్య మాటల తూటాలు



**వాషింగ్టన్-నవభూమి:** నిత్యం ప్రశాంతంగా ఉండే వైట్ హౌస్ శుక్రవారం ఇద్దరు దేశాధినేతల వాగ్వాదంతో దద్దరిల్లింది. ఎవరూ తగ్గకపోవ డంతో అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీల మధ్య జరిగిన సమావేశం రసాభాసగా మారింది. అమెరికా ఏం చేయాలో చెప్పవద్దంటూ జెలెన్‌స్కీని ట్రంప్ తీవ్రంగా హెచ్చరించారు. దీంతో రష్యాతో యుద్ధంపై శాంతి, ఉక్రెయిన్‌లో అరుదైన ఖనిజాల తవ్వకాలకు సంబంధించిన ఒప్పందాలు జరగకుండానే జెలెన్‌స్కీ వైట్‌హౌస్ నుంచి నిష్క్రమించారు. ఉక్రెయిన్‌లో ఖనిజాల వెలికితీత, రష్యాతో యుద్ధం ముగింపునకు సంబంధించి అమెరికాతో ఒప్పందానికి శుక్రవారం అన్ని ఏర్పాట్లు జరిగాయి. ఈ ఒప్పందం ద్వారా రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడంలో అమెరికా సాయాన్ని ఉక్రెయిన్ పొందుతుందని అందరూ ఆశించారు. అయితే శ్వేత సౌధంలో ఇద్దరు నేతల మధ్య జరిగిన సమావేశంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇద్దరు నేతలు మీడియా, పలువురు దౌత్యవేత్తల సమక్షంలో రష్యా యుద్ధం గురించి గొడవపడ్డారు. మూడో ప్రపంచ యుద్ధంతో జూదం ఆడుతున్నారని, అమర్యాదగా ఉన్నారంటూ జెలెన్‌స్కీని ట్రంప్ నిందించగా, దానికి జెలెన్‌స్కీ దీటుగా బదులిచ్చారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ప్రస్తావిస్తూ హంతకుడితో రాజీ పడకూడదని అంటూ రష్యాపై ట్రంప్ వైఖరి ఏమిటని సూటిగా ప్రశ్నించారు. ఉక్రెయిన్‌కు మద్దతు ఇవ్వడం కొనసాగించక పోతే అమెరికా 'భవిష్యత్తులో దాని ప్రభావాన్ని చవి చూస్తుంది' అని జెలెన్‌స్కీ చేసిన హెచ్చరికపై ట్రంప్ ఆయనను ఆపి 'మేమేమవుతామో మాకు చెప్పకండి. ఒక సమస్యను పరిష్కరించడానికి మేము ప్రయత్నిస్తున్నాం' అని అన్నారు. సామరస్యంగా ప్రారంభమైన సమావేశం వీరి వాదనలు, వాగ్వాదాలతో వేడెక్కడంతో ట్రంప్ సమావేశాన్ని ఆకస్మాత్తుగా ముగించారు. ఉక్రెయిన్ దురాక్రమణకు పుతిన్‌ను బాధ్యుడిని చేయాలంటూ జెలెన్‌స్కీ చర్చల సందర్భంగా పట్టుబట్టారు. అదే సమయంలో రష్యా రెండో దాడిని చేయదన్న తన నమ్మకాన్ని ట్రంప్ పునరుద్ఘాటించారు. దీంతో 10 నిముషాల పాటు సమావేశంలో వాతావరణం వేడెక్కింది. 'నువ్వు చాలా చెడ్డ స్థితిలో ఉన్నావు, నీకు మరో అవకాశం లేదు' అని ట్రంప్ అనగా, తాను కార్డులు ఆడటం లేదని జెలెన్‌స్కీ బదులిచ్చారు. 'లేదు.. నువ్వు ఆటలు ఆడుతున్నావు. లక్షలాది మంది ప్రజల జీవితాలతో జూదం ఆడుతున్నావు. మూడో ప్రపంచ యుద్ధంతో జూదం ఆడుతున్నావు. నువ్వు చేస్తున్నదంతా నీ దేశాన్ని అగౌరవపరుస్తుంది, చాలామంది చెప్పినట్టు మీకు మద్దతు ఇచ్చిన దాని కంటే ఎక్కువ' అని ట్రంప్ బదులిచ్చారు. ఉక్రెయిన్‌కు కనుక అమెరికా మిలిటరీ సామగ్రి అందజేయకపోతే యుద్ధం రెండు వారాల్లో ముగిసేదని అన్నారు.

**ఎవరికీ తల వంచే ప్రసక్తే లేదు**

అమెరికా అధ్యక్షుడితో చర్చల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన వైఖరిని నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. 'మా దేశ భూభాగంలో మేము ఉంటున్నాం. మేము అక్కడ ఉండేందుకు ఎవరి అనుమతి తీసుకోవాలి? మేం ఎవరికీ తల వంచే ప్రసక్తే లేదు. భవిష్యత్తులో రష్యా ఏదైనా దురాక్రమణకు పాల్పడితే అమెరికా మా దేశాన్ని రక్షించాలని కోరుతున్నాను.' అని జెలెన్‌స్కీ చర్చల్లో స్పష్టం చేశారు.

**తక్షణం వైట్‌హౌస్‌ను వదిలి వెళ్లండి**

రెండు దేశాల మధ్య సమావేశం అర్ధాంతరంగా ముగియడంతో జెలెన్‌స్కీ, ఆయన బృందం తక్షణం వైట్ హౌస్‌ను విడిచి వెళ్లాలంటూ ఆదేశాలు వచ్చినట్టు అధికారులను ఉటంకిస్తూ రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఈ పరిణామాల పట్ల ఉక్రెయిన్ రాయబారి ఒక్సానా మారకరోవా ఆందోళన చెందారు. ట్రంప్‌తో వాగ్వాదం అనంతరం వైట్‌హౌస్ నుంచి బయటకు వచ్చిన జెలెన్‌స్కీ ఉక్రెయిన్ ఆవేదనను వినాలని ప్రపంచ దేశాలను కోరారు.

**మేము పంపిన నిధులకు లెక్కలు చూపండి**

ఉక్రెయిన్‌కు అమెరికా చేసిన వందల బిలియన్ డాలర్ల నిధుల సహాయానికి సంబంధించిన లెక్కలను తమకు పంపాలని ట్రంప్ ఆ దేశాన్ని డిమాండ్ చేశారు. ఇరు దేశాల మధ్య చర్చల్లో ఏర్పడిన ప్రతిష్ఠంభన అనంతరం శనివారం ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఫైటర్ జెట్‌కు తొలి మహిళా పైలట్.. తనుష్క సింగ్ అసాధారణ ఫీట్



**న్యూఢిల్లీ-నవభూమి:**ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో (ఐఏఎఫ్) 'జాగ్వార్ ఫైటర్ జెట్'లో చేరటమంటే మామూలు విషయం కాదు. వ్యూహాత్మక, కచ్చితమైన వైమానిక దాడులకు ఆ విభాగం పేరొందింది. శాశ్వత నియామకంతో దీంట్లో చేరిన మొదటి మహిళా పైలట్‌గా తనుష్క సింగ్ గుర్తింపు అందుకున్నారు.జాగ్వార్ ఫైటర్ దళానికి పూర్తిస్థాయిలో ఎంపికైన తొలి మహిళా పైలట్‌గా ఆమె రికార్డ్ సృష్టించారు. తెలంగాణ, దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ పొందారు. హాక్ ఎంకే 132 ఎయిర్‌క్రాఫ్ట్‌ను నడపటంలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు.

# రోడ్లపై స్వేచ్ఛగా తిరిగేలా చూడండి



**న్యూఢిల్లీ-నవభూమి:**మణిపూర్‌లో భద్రతా పరిస్థితి సమీక్షించేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం నాడిక్కడ ఓ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. మార్చి 8 నుంచి మణిపూర్‌లోని అన్ని రోడ్లపై ప్రజలు స్వేచ్ఛగా తిరిగే విధంగా చూడాలని అమిత్ షా అధికారులను ఆదేశించారు. అవాంతరాలు సృష్టించడానికి ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించడానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ఇందుకు సంబంధించి అవసరమైన సహాయాన్ని అందచేస్తుందని అమిత్ షా హామీ ఇచ్చారు. మణిపూర్‌లోని అంతర్జాతీయ సరిహద్దుల పొడవునా ఎంట్రీ పాయింట్ల వద్ద రెండు వైపులా కంచె నిర్మాణం పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# అవన్నీ ఫేక్.. మీనాక్షి చౌదరి వార్తలపై స్పందించిన ఏపీ ప్రభుత్వం

టాలీవుడ్ బ్యూటీ మీనాక్షి చౌదరిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా శక్తీకరణ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అయిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై ఏపీ ప్రభుత్వంకి సంబంధించిన సోషల్ మీడియా ఫ్యాక్ట్ చెక్ వింగ్ స్పందిస్తూ ఆ వార్తలు ఫేక్ అని తెలిపింది.



ఆంధ్రప్రదేశ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ బ్రాండ్ అంబాసిడర్‌గా హీరోయిన్ మీనాక్షి చౌదరిని నియమించారని సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారం పూర్తిగా ఫేక్. ప్రభుత్వం పేరుతో ఉద్దేశపూర్వకంగా ఇటువంటి తప్పుడు పోస్టులు పెడుతున్న వారిపై, ఫేక్ ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారమైన చర్యలు ఉంటాయి. అంటూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంకి చెందిన ఫ్యాక్ట్ చెక్ వింగ్ సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చింది.

నవచిత్ర





నిఖిలా విమల్

# మేడ మీద బ్యూటీ మళ్లీ ఇటువైపు చూడదా?

కేరళ కుట్టీ నిఖిలా విమల్ సుపరిచితమే. అమ్మడు చైల్డ్ ఆర్టిస్ట్ గానే మాలీవుడ్‌లో లాంచ్ అయింది. అటుపై టాలీవుడ్‌లో 'మేడ మీద అబ్బాయ్', 'గాయత్రి' లాంటి చిత్రాల్లో నటించింది. కానీ ఈ రెండు సినిమాలు ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో మరో ఆలోచన లేకుండా నిఖల మాలీవుడ్‌కి వెళ్లిపోయింది. కొంత కాలంగా అక్కడే నటిగా కనసాగుతుంది. తమిళ్‌లో కూడా బాగానే పని చేస్తోంది. ప్రస్తుతం హీరోయిన్‌గా రెండు భాషల్లోనూ బిజీగానే ఉంది. గత ఏడాది నాలుగైదు సినిమాలతో అలరించింది. ఇదే ఏడాది కూడా నాలుగైదు సినిమాలతో ప్రేక్షకుల్లో ఉండేలా కనిపిస్తుంది. సినిమాలు కూడా మంచి విజయాలు సాధించడంతోనే ఈరకంగా బిజీగా ఉంది. లేకుంటే ఇంత బిజీగా ఉండే ఛాన్స్ లేదు. ఆ రకంగా నిఖిలా విమల్ కెరీర్ సాగిపోతుంది. అయితే ఈ భామ మళ్లీ టాలీవుడ్ వైపు చూడదా? అన్నది సందేహంగా మారింది. ఎవరికైనా జయపజయాలు సహజం. సక్సెస్ ..పెయిల్యూర్ ని బ్యాలెన్స్ చేస్తూ ముందుకెళ్లాలి. కానీ ఈ విషయంలో టాలీవుడ్ పరంగా చూస్తే నిఖిల ఫెయిల్యూర్‌ని బ్యాలెన్స్ చేయలేకపోయింది. రెండు పెయిల్యూర్స్ వచ్చే సరికి మళ్లీ టాలీవుడ్ వైపు చూడటమే మానేసింది. నిజానికి కొంత కాలంగా కేరళ భామలకు టాలీవుడ్ పెద్ద పీట వేస్తుంది. అందులోనూ సక్సెస్‌ల్లో ఉన్న భామల్ని నెత్తిన పెట్టుకుంటుంది. ముంబై భామల్ని పక్కనబెట్టి మరీ కేరళ కుట్టీలను ఎంపిక చేస్తున్నారు. వాళ్లలో నేచురల్ బ్యూటీకి కనెక్ట్ అవ్వడంతో పాటు అంతే సహజంగా నటన ఉండటంతో వాళ్లే ఉత్తమంగా మేకర్స్ ఎంపిక చేస్తున్నారు. కానీ నిఖిలా విమల్ మాత్రం ఇండస్ట్రీకి పూర్తిగా దూరమై ఎలాంటి కంబ్యాక్ ప్రయత్నాలు చేయకుండా తప్పు చేస్తోంది అన్న వాదన తెరపైకి వస్తోంది.

# కొత్త ఏడాదిలో అన్నీ శుభవార్తలేనా?



హీరోయిన్‌గా రాణించాలంటే పెళ్లి చేసుకోకూడదు...తల్లి కాకూడదు అన్నది నాటి రూల్. నేడు రూల్ ఆ పాత రూల్ కి పూర్తి కాంట్రెస్ట్. హీరోయిన్ గా సక్సెస్ అవ్వాలంటే పెళ్లి చేసుకోవాలి...తల్లి అయితే ఇంకా క్రేజ్ ఉంటుందన్నది నేటి రూల్‌గా మారింది. తల్లులైన అందమైన బాలీవుడ్ భామలంతా నటీమణులు ఎంత బిజీగా ఉన్నారు అన్నది చెప్పాల్సిన పనిలేదు. దీపికా పదుకొణే, కరీనా కపూర్ , అనుష్క శర్మ, అలియాభట్‌లు కొందరైతే అద్దె గర్భం ద్వారా తల్లులైన వారు మరికొంత మంది .నయనతార, ప్రియాంక చోప్రా ఇలా కొంత మంది ఉన్నారు. వీరంతా ప్రొఫెషనల్‌గా ఎంతో బిజీగా ఉన్నారు. పెళ్లి..తల్లి అనే బంధంతో సంబంధం లేకుండా నటీమణులుగా కొనసాగుతున్నారు. ఇండస్ట్రీలో అత్యధిక పారితోషికం కూడా అందుకుంటున్నారు. త్వరలో మరికొంత మంది కూడా తల్లులు కాబోతున్నారు. వారంతా ఇప్పటికే గర్భం దాల్చిన విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. నిన్నటి రోజున కియారా అద్వాణీ గర్భందాల్చిన విషయాన్ని రివీల్ చేసింది. భర్త సిద్దార్థ్ మల్హోత్రాతో కలిసి విషయాన్ని పంచుకుంది. నటిగా ఇప్పటికే బిజీగా ఉంది. ఇకపై కియారా మరింత బిజీగా మారుతుంది. ప్రస్తుతం టాక్సిక్, వార్ 2 చిత్రాల్లో కియారా నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే సునీల్ శెట్టి కుమార్తె అతియాశెట్టి కూడా గర్భంతో ఉంది. ఇదే ఏడాది తల్లిగా పిలుపు అందుకోబోతుంది. అలాగే ఇలియానా, అమీజాకన్స్ కూడా తమ ప్రెగ్నెన్సీ వార్తను ఇప్పటికే కన్పమ్ చేసారు. ఇద్దరు సెకెండ్ చైల్డ్‌కి రెడీ అవుతున్నారు. కత్రినా కైఫ్ కూడా శుభవార్త చెబుతుందని అంతా ఆశిస్తున్నారు. ఇప్పటికే ఆమె గర్భవతి అని పలుమార్లు మీడియాలో కథనాలు వైరల్ అయిన సంగతి తెలిసిందే. ఇంకా మీడియాకు ఇలాంటి విషయాలు వెల్లడించకుండా గోప్యత వహించే వారు మరికొంత మంది ఉన్నారు.

# సమంత 15 ఏళ్ల జర్నీ.. స్టన్నింగ్ గోల్డెన్ లుక్

టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సమంత.. 15 ఏళ్ల సినిమా ప్రయాణాన్ని పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెకు ప్రెస్టీజియస్ అవార్డు లభించింది. తాజాగా చెన్నైలో జరిగిన బిహైండ్ వుడ్స్ గోల్డ్ అవార్డ్స్ వేడుకలో, 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్ లోని ఆమె పాత్రకు బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు దక్కింది. ఈ ప్రత్యేక గౌరవాన్ని అందుకున్న సమంత.. తన ఎమోషనల్ జర్నీ గురించి సోషల్ మీడియాలో షేర్ చేస్తూ, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపింది. ఈ అవార్డు ఫంక్షన్ కోసం సమంత ఎంచుకున్న లుక్ స్పెషల్ హైలైట్ గా మారింది. అద్భుతమైన గోల్డ్ కలర్ శారీలో మెరిసిపోయిన ఆమె లుక్ రాయల్ ఎలిగెన్స్ ను చూపించింది. మినిమల్ జువెలరీ, సింపుల్ మేకప్ తో తళుక్కున మెరిసిన సమంత.. తన స్టన్నింగ్ లుక్ తో ఫ్యాన్స్ ను ఫిదా చేసింది.

ఇంతకుముందు కూడా ట్రెడిషనల్ అవుట్ ఫిట్స్ లో మెస్మరైజ్ చేసిన సమంత.. ఈసారి మరింత గ్లామరస్ గా కనిపించింది. 15 ఏళ్ల ఫిల్మీ కెరీర్ లో సమంత అనేక రోల్స్ చేసి ప్రేక్షకులను అలరించింది. ఆమె కెరీర్ లో 'ఏ మాయ చేసావే' ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ఆ సినిమా విడుదలైనప్పటి నుంచీ ఆమెకు వరుసగా విజయాలు దక్కాయి. ఆ తర్వాత 'ఎటో వెళ్ళిపోయింది మనసు', 'మనమ్', 'రంగస్థలం', 'మజిలీ' లాంటి బ్లాక్ బస్టర్స్‌తో తన స్థాయిని మరింత పెంచుకుంది. బాలీవుడ్‌లో కూడా అడుగుపెట్టి వెబ్ సిరీస్ 'సిటాడెల్' తో కొత్త అవతారం ఎత్తింది. కనిపెడితే క్రేజీ బైక్ గిఫ్ట్.. ప్రస్తుతం సమంత వ్యక్తిగతంగా కొన్ని హెల్త్ ఇష్యూస్ తో బ్రేక్ తీసుకున్నప్పటికీ, సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫ్యాన్స్ కు టచ్ లోనే ఉంది. ఇటీవల ఆమె తన ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపిన విషయం తెలిసిందే. త్వరలోనే వెండితెరపై మరిన్ని సినిమాలతో రీఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. ఇక ఆమె నెక్స్ట్ ప్రాజెక్ట్ ఏంటనే ఆసక్తిగా ఎదురు చూస్తున్న అభిమానులకు త్వరలోనే మరో అప్డేట్ ఇవ్వనుందట.



# తమన్నా.. నిజంగా పాలరాతి శిల్పమే..

హీరోయిన్ తమన్నా భాటియాకు ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి వచ్చి తనదైన గుర్తింపు... మంచి ఫేమ్ సంపాదించుకుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. పరిశ్రమలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఇంకా అదే క్రేజ్.. అదే గ్లామర్.. ఆమె సొంతమనే చెప్పాలి. మరాఠీ బ్యూటీ అయిన తమన్నా.. నార్త్ టు సౌత్ అందరినీ అలరిస్తూ దూసుకుపోతోంది. కెరీర్ స్టార్టింగ్ లోనే టాలీవుడ్ ను ఓ రేంజ్ లో ఏలిందని చెప్పొచ్చు. స్టార్ హీరోలందరితో ఆడిపాడి తక్కువ టైమ్ లోనే ఎక్కువ గుర్తింపు సొంతం చేసుకుంది తమన్నా. ఇప్పుడు హీరోయిన్ గా నటిస్తూనే.. స్పెషల్ సాంగ్స్ తో అలరిస్తోంది. %ూశ్రీంశీ =ఘు% - రెండు దశాబ్దాల యూట్యూబ్..దాని సక్సెస్ స్టోరీ చదివేద్దాం! రీసెంట్ గా రజినీ కాంత్ జైలర్ లో కావాలయ్యా పాటతో ఓ ఊపు ఊపేసింది తమన్నా. ఆమె డ్యాన్స్ అండ్ ఎక్స్ప్రెషన్స్ కు అంతా ఫిదా అయిపోయారు. ఆ తర్వాత బాలీవుడ్ మూవీ స్త్రీ 2లోని ఆజ్ కీ రాత్ సాంగ్ తో మరోసారి మెప్పించింది. తన అందచందాలు, స్టెప్పులతో ఓ రేంజ్ లో అందరినీ అలరించింది అమ్మడు. అయితే కెరీర్ పరంగా బిజీగా ఉంటూనే.. సోషల్ మీడియాలో తమన్నా చేసే సందడి వేరే లెవెల్. ఎప్పటికప్పుడు గ్లామర్ ట్రీట్ ఇస్తూనే ఉంటోంది. తాజాగా మరో బ్యూటిఫుల్ పిక్స్ తో తళుక్కుమంది అమ్మడు. వైట్ కలర్ మిడ్డీ డ్రస్ లో తమన్నా అదరగొట్టేసిందనే చెప్పాలి. క్లాసీ లుక్ లో తన గ్లామరస్ స్కిన్ తో మైండ్ బ్లాక్ చేసేసింది. %ూశ్రీంశీ =ఘు% - కిరణ్ అబ్బవరం బంపర్ ఆఫర్.. కనిపెడితే క్రేజీ బైక్ గిఫ్ట్.. బ్లాక్ కలర్ ఫ్లోరల్ ప్రింట్ తో ఉన్న వైట్ డ్రెస్ అదిరిపోగా.. గ్లాసీ మేకప్ తో ఫుల్ షైనీగా



కనిపించి క్లీన్ బౌల్డ్ చేస్తుందని చెప్పడంలో డౌట్ అక్కర్లేదు. రకరకాల పోజులను పోస్ట్ చేసిన తమన్నా.. తెల్ల పావురాల ఎమోజీలను క్యాప్షన్ గా ఇచ్చింది. ప్రస్తుతం తమన్నా కొత్త పిక్స్.. సోషల్ మీడి యాలో వైరల్ గా మారాయి. పిక్స్ అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సో షైనీ అని చెబుతున్నారు. పాలరాతి శిల్పంలా ఉన్నారని, నిజంగా మిల్క్ బ్యూటీనే అని కొనియాడుతున్నారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో ఓదెల 2 మూవీ చేస్తుండగా.. ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. అటు బాలీవుడ్? లో డార్లింగ్ పార్ట్ నర్స్ తో త్వరలోనే సందడి చేయనుంది.

# మరో రికార్డుకు చేరువైన విరాట్ కోహ్లీ..



**న్యూజిలాండ్-నవభూమి:** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా టీమిండియా ఆదివారం న్యూజిలాండ్‌తో తలపడనున్నది. భారత జట్టు స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ మరిన్ని రికార్డులపై కన్నేశాడు. పాకిస్తాన్‌పై సెంచరీతో కోహ్లీ పలు రికార్డులను నెలకొల్పాడు. కివీస్‌పై పలు రికార్డులు సాధించేందుకు రెడీగా ఉన్నాడు. కివీ జట్టుపై మరికొన్ని పరుగులు చేస్తే.. న్యూజిలాండ్‌పై 3వేలు అంతకన్నా ఎక్కువ పరుగులు చేసిన ఐదో బ్యాట్స్‌మెన్‌గా కోహ్లీగా నిలువనున్నాడు. కోహ్లీ 85 పరుగులు చేసిన వెంటనే న్యూజిలాండ్‌పై మూడు వేల పరుగులు పూర్తి చేసుకుంటాడు. దాంతో సచిన్ టెండూల్కర్, రికీ పాంటింగ్, జాక్ కాలిస్, జో రూట్ సరసన నిలువనున్నాడు. టీమిండియా దిగ్గజ ఆటగాడు సచిన్ టెండూల్కర్ న్యూజిలాండ్‌పై అంతర్జాతీయ క్రికెట్‌లో 3,345 పరుగులు చేశాడు. జాక్ కలిస్ 3,071 పరుగులు చేయగా.. జో రూట్ 3,068 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌పై 55 మ్యాచుల్లో విరాట్ 2,915 పరుగులు చేశాడు. ఇందులో తొమ్మిది సెంచరీలు, 15 హాఫ్ సెంచరీలున్నాయి. చివరిసారిగా కోహ్లీ న్యూజిలాండ్‌తో వన్డే ఆడినప్పుడు 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్‌లో 117 పరుగులు చేశాడు. ఆ సమయంలో వన్డేల్లో అత్యధిక సెంచరీలు చేసిన సచిన్ రికార్డును అధిగమించారు. వన్డేల్లో విరాట్ 50వ సెంచరీ సాధించాడు. సచిన్ 49 సెంచరీల రికార్డును అధిగమించి 50వ సెంచరీ చేశాడు. దాంతో పాటు కోహ్లీ న్యూజిలాండ్‌పై వన్డేల్లో భారత బ్యాట్స్‌మన్‌గా అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచే అవకాశం ఉంది. కోహ్లీ మరో 105 పరుగులు చేస్తే న్యూజిలాండ్‌పై అత్యధిక పరుగులు చేసిన భారత ప్లేయర్‌గా నిలువనున్నాడు. ప్రస్తుతం ఈ రికార్డు సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్నది. 42 మ్యాచ్‌ల్లో 1,750 పరుగులు చేశాడు.

# భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ



**న్యూజిలాండ్-నవభూమి:** భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఒకటి వెంట ఒకటి వరుసగా మూడు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ శుభ్‌మాన్ గిల్, రోహిత్ శర్మ.. వన్ డౌన్‌లో వచ్చిన విరాట్ కోహ్లీ ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్ బాటపట్టారు. జట్టు స్కోర్ 15 పరుగుల వద్ద శుభ్‌మాన్ గిల్ (2) ఔటయ్యాడు. మ్యాట్ హెన్రీ బౌలింగ్‌లో ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ క్రీజులోకి వచ్చాడు. గిల్ ఔటయ్యే సమయానికి భారత్ స్కోర్ మూడు ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 15 పరుగులు.ఆ తర్వాత ఆరో ఓవర్ తొలి బంతికి నిలదొక్కుకున్నాడనుకున్న రోహిత్ శర్మ (15) ఔటయ్యాడు. జామిసన్ బౌలింగ్‌లో విల్ యంగ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అప్పటికి జట్టు స్కోర్ 5.1 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 22 పరుగులు. ఆ తర్వాత ఓవర్లోనే విరాట్ కోహ్లీ (11) కూడా పెవిలియన్ చేరాడు. మ్యాచ్ హెన్రీ బౌలింగ్‌లో ఫిలిప్స్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ప్రస్తుతం శ్రేయాస్ అయ్యర్, అక్షర్ పటేల్ క్రీజులో ఉన్నారు. జట్టు స్కోర్ 9 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 35 పరుగులు.

నవక్రీడ

# పక్షిలా ఎగిరి పట్టేసింది.. విమెన్స్ క్రికెట్‌లో ఇలాంటి క్యాచ్ చూసుండరు



**న్యూఢిల్లీ-నవభూమి:** మహిళల క్రికెట్‌లో ఒకప్పటి కంటే ఇప్పుడు ప్రమాణాలు బాగా పెరిగాయి. మెన్స్ క్రికెట్ స్థాయిలో కాకపోయినా భారీగానే ఆదరణ దక్కు తుండటంతో బోర్డులు కూడా విమెన్స్ క్రికెట్ కోసం భారీగా ఖర్చు పెడుతున్నాయి. ఆటగాళ్ల శిక్షణ దగ్గర నుంచి రెమ్యూనరేషన్ వరకు పెద్ద మొత్తంలో డబ్బులు వెచ్చిస్తున్నాయి. ప్రతిభ కలిగిన ప్లేయర్ల జాడపట్టి ఎంకరేజ్ చేస్తున్నాయి. దీంతో మెరికల్లాంటి క్రికెటర్లు వెలుగులోకి వస్తున్నారు. ఒకప్పటితో పోలిస్తే మహిళా క్రికెట్‌లో బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్.. ఇలా ఏ స్టాండర్డ్స్ చూసుకున్నా మెన్స్ క్రికెట్‌తో పోటీపడే స్థాయికి చేరుకున్నాయి. అందుకు విమెన్స్ ప్రీమియర్ లీగ్ బిగ్ ఎగ్జాంపుల్ అని చెప్పాలి. ఈ టోర్నమెంట్‌లో మహిళా క్రికెటర్లు చేసే స్టంట్స్ చూస్తే షాక్ అవ్వాల్సిందే.అమాంతం గాల్లోకి ఎగిరి..డబ్ల్యూపీఎల్-2025లో ఓ స్టార్ ప్లేయర్ స్టన్నింగ్ క్యాచ్‌తో అందరి ఫోకస్‌ను తన వైపునకు తిప్పుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ విమెన్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు విమెన్ టీమ్స్ మధ్య జరిగిన ఫైట్‌లో ఓ అద్భుతం చోటుచేసుకుంది. ఆర్సీబీ స్టార్ ఆల్‌రౌండ్ ఎలిస్ పెర్రీ కళ్లుచెదిరే రీతిలో ఓ క్యాచ్ అందుకొని అందర్నీ ఆశ్చర్యపరిచింది. రేణుకా బౌలింగ్‌లో డీసీ సారథి మెక్ లానింగ్ కొట్టిన బంతిని గాల్లో పక్షిలా ఎగురుతూ పట్టేసింది పెర్రీ. బంతి తన కంటే ఎక్కువ ఎత్తులో వస్తుండటంతో ముందే అంచనా వేసి చేతుల్ని పైకి తీసుకెళ్లిన పెర్రీ.. అది సమీపించగానే అమాంతం గాల్లోకి ఎగిరి పర్ఫెక్ట్ టైమింగ్‌తో పట్టేసింది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**